శనివారం
05 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 287

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



చరణ్‌లాంటి డాన్సర్‌తో స్టెప్పులువేసి ఎంజాయ్ చేశా 11

అయోధ్య కేసు 10వ తేదీకి

సుప్రీం వాయిదా



ఢిల్లీ: అయోధ్యలోని రామ జన్మభూమి బాబ్రీ మసీదు వివాదం కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించిన వ్యాజ్యాలు శుక్రవారం నాడు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్కే కౌల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చాయి. అయితే ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు వినకుండానే విచారణను ధర్మాసనం జనవరి 10కి వాయిదా వేసింది. శుక్రవారం ఈ కేసు విచారణ కనీసం 30 సెకన్లు కూడా సాగకపోవడం గమనార్హం.

అయోధ్య కేసు విచారణ ప్రారంభం కాగానే.. 'ఈ కేసులో విచారణకు తేదీల ఖరారుపై జనవరి 10న తగిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేస్తుంది' అని చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఇరు పక్షాల తరఫున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాజీవ్ ధవన్ల నుంచి ఎలాంటి వాదనలు వినకుండానే కోర్టు విచారణను వాయిదా వేసింది.

అయోధ్య వివాదంపై గతంలో దాఖలైన 4 సివిల్ వ్యాజ్యాలపై అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. వివాదానికి సంబంధించిన మొత్తం 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని పేర్కొంది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని స్వీకరించిన న్యాయస్థానం పిటిషన్లపై జనవరి మొదటివారంలో తగిన ధర్మాసనం విచారణ చేపడుతుందని గతేడాది అక్టోబరు 29న నిర్ణయించింది. తాజాగా నేడు మరోసారి వాయిదా వేసింది.

రఫేల్‌తో మళ్లీ..

మోదీ అధికారంలోకి



- సాధారణ విమానం ధరతో యుద్ధవిమానాలకు పోలికా..
- సెప్టెంబర్ నాటికి తొలి రఫేల్ విమానం భారత్‌కు
- రఫేల్‌పై దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్
- పార్లమెంట్‌లో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

ఢిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై లోక్‌సభలో శుక్రవారం జరిగిన చర్చలో అధికార పక్షం పై చేయి సాధించింది. రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ రఫేల్ ఒప్పందం, యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. పలు దశల్లో రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు సంబంధించి వాడీవేడీ చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ విమానాల కొనుగోలుకు సంబంధించి వివరణ ఇచ్చారు. రఫేల్ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై బురద జల్లుతున్నారని ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఈ ఒప్పందంపై వివరాలన్నీ తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. బోఫోర్స్ కుంభకోణం యూపీయే ప్రభుత్వాన్ని కూల్చేసిందని, అయితే రఫేల్ ఒప్పందం ఎన్డీయే ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. నాలుగేళ్ళ నుంచి ప్రధాని మోదీ అవినీతిరహిత పాలనను అందిస్తున్నారని వివరించారు.

బోఫోర్స్ వల్ల మీ సర్కార్ కూలింది, రఫేల్‌తో మోదీ సర్కార్ మళ్లీ..

తాను బోఫోర్స్ గురించి మాట్లాడాలనుకోవడం లేదని, అదొక కుంభకోణమని నిర్మల సీతారామన్ చెప్పారు. బోఫోర్స్ వల్ల కాంగ్రెస్ కూలిపోయిందన్నారు. రఫేల్ మోదీని మళ్ళీ అధికారంలోకి తెస్తుందని, నవ భారత నిర్మాణం కోసం మోదీ ప్రభుత్వం మళ్ళీ ఏర్పాటయ్యేలా చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రఫేల్ ఒప్పందం విషయంలో ఆపిల్, నారింజ పళ్ళను పోల్చి చూస్తోందని ఆరోపించారు. (తరువాయి 4లో)

వచ్చే ఎన్నికల్లో గెలిస్తే..

రఫేల్‌పై క్రిమినల్ విచారణ

- పార్లమెంట్ ప్రాంగణంలో ప్రకటించిన రాహుల్



ఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రఫేల్ ఒప్పందం వివాదంపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రప్రభుత్వంపై మరోసారి విమర్శల వర్షం కురిపించారు. " అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్‌కే విదేశీ భాగస్వామ్యం ఇవ్వాలని రఫేల్ ఒప్పందంలో భారత ప్రభుత్వం డసో ఏవియేషన్‌ను ఆదేశించినట్లు ఆ కంపెనీ అంతర్గత ఈ మెయిళ్ల ద్వారా బహిర్గతమైంది. అయినప్పటికీ ప్రభుత్వం దీనిపై మాట్లాడట్లేదు. రఫేల్ వివాదంపై కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడాలని కాంగ్రెస్ సహా మొత్తం ప్రతిపక్షం కోరుకుంటోంది' అని రాహుల్ అన్నారు. బుధవారం నాటి లోక్‌సభ సమావేశంలో అరుణ్‌జైట్లీ చాలా సేపు మాట్లాడారని, కానీ రఫేల్‌పై తాము వేసిన ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పలేదని రాహుల్ ఎద్దేవా చేశారు. రఫేల్ చర్చకు భయపడి మోదీ దూరంగా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఈ వివాదంపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశిస్తామని, నేరస్థులను శిక్షిస్తామని రాహుల్ స్పష్టం చేశారు.

అయ్యప్పను దర్శించుకున్న

మూడో మహిళ

- శశికళ ప్రవేశించినట్లు నిర్ధారిస్తున్న పోలీసులు
- ఆలయంలోకి వెళ్ళలేదంటున్న శ్రీలంక వనిత
- కేరళలో కొనసాగుతున్న ఆందోళనలు



తిరువనంతపురం: కేరళలోని పవిత్ర శబరిమలలోకి మరో మహిళ ప్రవేశించినట్లు తెలుస్తోంది. శ్రీలంకకు చెందిన 46 ఏళ్ల శశికళ గురువారం రాత్రి ఆలయంలోకి వెళ్ళి అయ్యప్పను దర్శించుకుని పూజలు నిర్వహించినట్లు అక్కడి పోలీసులు చెబుతున్నారు. అయితే ఆమె మాత్రం ఈ విషయాన్ని ఖండించారు. తనను శబరిమల ఆలయంలోకి అనుమతించలేదని శశికళ వెల్లడించారు. 18 మెట్ల వద్దే తనను అడ్డుకున్నారని ఆమె తెలిపారు. తాను మెనోపాజ్‌కు చేరుకున్నట్టు మెడికల్ సర్టిఫికెట్ చూపించినప్పటికీ లోపలికి అనుమతించలేదని శశికళ ఆరోపించారు. తాను 48 రోజుల దీక్ష చేశానని, అయినప్పటికీ ఆలయ అధికారులు తన మాట వినకపోవడంతో బలవంతంగా వెనక్కి రావాల్సి వచ్చిందని మీడియాకు వివరించారు. అయితే శ్రీలంకకు చెందిన శశికళ ఆలయంలోకి ప్రవేశించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని పోలీసులు స్పష్టం చేశారు. సీసీటీసీ ఫుటేజ్ ద్వారా ఈ విషయాన్ని నిర్ధారించినట్లు వారు చెబుతున్నారు. దీంతో ఈ విషయంపై గందరగోళం నెలకొంది. ఒకవేళ శబరిమలలోకి శశికళ ప్రవేశించిన పక్షంలో సుప్రీం కోర్టు ఆదేశాల తర్వాత 50 ఏళ్ళలోపు ఆలయంలోకి ప్రవేశించిన మూడో మహిళగా ఆమె నిలుస్తారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి పదేళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయసు ఆడవారిని అనుమతించరు. అయితే లింగ బేధం లేకుండా అన్ని వయసుల మహిళలను అనుమతించాల్సిందేనని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కేరళ ప్రభుత్వం ఈ తీర్పును సమర్థించడంతో పాటు అమలు చేస్తామని స్పష్టం చేసింది. అయితే అనంతరం రెండు సార్లు ఆలయం తెరచుకోగా ఆందోళనకారులు, హిందూ సంఘాలు, భక్తులు మహిళల ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు. కాగా మకర మాసంలో పూజల కోసం శబరిమల మరోసారి తెరచుకోగా జనవరి 2న బిందు, కనకదుర్గ అనే ఇద్దరు మహిళలు ఆలయంలోకి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుని చరిత్ర సృష్టించారు. కేరళ సీఎం విజయన్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఈనేపథ్యంలో కేరళ రాష్ట్రం మరోసారి రణరంగంగా మారింది. 50 ఏళ్ల లోపు ఆడవాళ్లు ఆలయంలోకి ప్రవేశించడాన్ని నిరసిస్తూ బీజేపీతోపాటు పలు హిందూ సంస్థలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. (తరువాయి 4లో)

ఆర్టీసీ నష్టాలకు..

సర్కారే కారణం

- తేల్చిచెప్పిన కార్మిక సంఘాలు
- ప్రయివేటు వాహనాలను అరికట్టాలి
- డీజిల్‌ను జీఎస్టీలోకి చేర్చాలి
- బడ్జెట్‌లో 1 శాతం కేటాయించాలి
- నష్టాలను సర్కారే భరించాలి
- పన్నులను తగ్గించండి
- జోనల్, డివిజన్ వ్యవస్థను రద్దు చేయాలి 4

తెలంగాణ

"గొంగడి" గోస



- సర్కారుకు లేదు ధ్యాస
- మొక్కుబడిగా గొర్రెల పంపిణీ
- ఉన్ని గొర్లకు దిక్కేది? 4

శబ్ద విప్లవంతోనే

టీఆర్ఎస్ గెలుపు



- కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: 'కాంగ్రెస్ నేతలు నిశబ్ధ విప్లవంతో గెలుస్తామనుకున్నారు. ప్రజలు మాత్రం శబ్ద విప్లవంతో టీఆర్ఎస్‌ను గెలిపించారు.' అని టీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో చొప్పదండి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అహంకారి అంటూ అభివర్ణించారు. ఓటమితో కాంగ్రెస్‌లో అనేక మంది రిటైర్ కాబోతున్నారని చెప్పారు. కార్యకర్తలందరూ కష్టించి పని చేయడం వల్లనే నల్లగొండలో కాంగ్రెస్ ముఖ్య నేతలను ఓడించగలిగామని చెప్పారు. ట్రాక్టర్ గుర్తు కారణంగానే.. హుజూర్‌నగర్‌లో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలిచారని తెలిపారు. ఓడిన చోటనే గెలిచేందుకు హుజూర్‌నగర్ కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ చొప్పదండి అల్లుడని, ఆ నియోజవకర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన రూ. 500 కోట్లకు ఆశపడి కాంగ్రెస్ దాసోహమైందన్నారు. అందరూ కట్టకట్టుకొని వచ్చినా..సింహంలా సింగిల్ వచ్చిన కేసీఆర్ గెలిచారన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పొన్నాల లక్ష్మయ్య చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. ఇక కాంగ్రెస్ నేతలు ఇప్పట్లో లేచే పరిస్థితి లేదన్నారు. పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా కార్యకర్తలందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. అధికారం వచ్చిందనే గర్వం కార్యకార్తలకు పనికి రాదని, ప్రజలతో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

చేతులారా.. చేజార్చుకున్నాం

- అభ్యర్థుల ఖరారు ఆలస్యమే ఓటమికి అసలు కారణం
- అసెంబ్లీ ఎన్నికల్లో సరిగ్గా ప్రచారం చేసుకోలేకపోయాం
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో పంథా మార్చుకుందాం
- రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం
- పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు ప్రారంభం



విజయక్రాంతి, హైదరాబాద్ : అభ్యర్థులను ఖరారు చేయడంలో ఆలస్యం కావడంతో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సరిగ్గా ప్రచారం చేసుకోలేకపోయామని ఓటమి పాలైన పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు మధనపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్ కృష్ణన్ నేతృత్వంలో ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, (తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్



విజయక్రాంతి
శనివారం 05 జనవరి 2019
హైదరాబాద్



శుభోదయం


ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
మార్గశిర మాసం

సూర్యోదయం	: ఉ. 06:47	కరణం	: చతుష్పాద 17:54 నాగవ రాత్రి మొత్తం
సూర్యాస్తమయం	: సా. 05:55	రాహుకాలం	: ప. 09:36, 10:58
పక్షము	: కృష్ణ పక్షం	యమగండం	: మ. 01:43, 03:08
తిథి	: అమావాస్య మొత్తం	వర్జ్యం	: మ. 01:23, 03:08, రా.07:00, 03:32
నక్షత్రం	: మూల 15:08	అమృతకాలం	: 08:08, 09:53
యోగం	: ధ్రువ 26:13		




సూక్తి సుధ



మనం సుఖంగా ఉండటానికి సులభమైన మార్గం, ఇతరులను సుఖంగా జీవించేలా చేయడమే..

- స్వామి వివేకానంద

తిరుప్పావై పాశురం-21



ఏఱ్ఱకలజ్ఞ౦ ఎదిరిపొంగి మీదళిప్ప
మాఱ్ఱాదేపాల్ శొరియుం వళ్ళల్
పెరుంపశుక్కళ్
ఆఱ్ఱ ప్పడైత్తాన్ మగనే! యఱివురాయ్
ఊఱ్ఱముడైయాయ్! పెరియాయ్,
ఉలగినిల్
తోఱ్ఱమాయ్ నిన్ఱశుడరే! తుయిలెళాయ్
మాఱ్ఱారునక్కు వలితులైన్దు ఉన్ వా
శర్కణ్
ఆఱ్ఱాదు వందు ఉన్నడి పణియుమాప్పోలే
పోఱ్ఱియాంవందోం పుగళందు ఏలో
రెంబావాయ్



'పాడుగు కింద పెట్టిన కుండలు పైపైకి పొంగి పొరలునట్లు నిండునట్లుగా పాలను ఎడతెగకుండగా స్రవించు ఉదారములగు పెద్దయావులు సమృద్ధిగా కలిగిన నందగోపుని కుమారుడా! మేలుకొమ్ము! దృఢ ప్రమాణ సిద్ధుడా! నిరతిశయ బృహత్త్వం కలవాడా! లోకాన అవిర్భవించి ప్రకాశించు జ్యోతి స్వరూపా! నిద్ర నుండి లెమ్ము! శత్రువులు నీ బలానికి లొంగి ఆగ లేక నీ వాకిలికి వచ్చి నీ పాదాలను స్తుతించునట్లే మేము కూడా ఆగలేక, పొగడి మీకు మంగళా శాసనం చేయవచ్చినాం'

నందగోపుడు ఆచార్యుడు. గోవులు వేదాలు. వేదాంగాలు దూడలు. మన కోరికలను తీర్చుట, కుండలను నింపుట.

గోవులు – ఆచార్యులు, కుండలు – శిష్యులు

ఆచార్యుని ఆశ్రయించుట కుండను పొదుగు కింద పెట్టుట.

ఆచార్యోపదేశాలను శిష్యులు మననం చేసి యుక్తులను గురించి చేయుటే పొంగు.

శత్రువులు – భక్తులను ద్వేషించువారు.

- డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

నృసింహ, అనబడే బాపూదేవశాస్త్రి (శక.1743)

వేద విజ్ఞానం

భాగం-71

స్థూల పరిచయం

బ్రిటీష్‌వారి పరిపాలన స్థిరపడిన తర్వాత జీవించిన పండితులలో ప్రముఖుడు, భారతీయ మరియు పాశ్చాత్య ఖగోళ, గణితశాస్త్రములలో అత్యంత ప్రావీణ్యము సంపాదించిన వారిలో ఒకరు బాపూదేవశాస్త్రి. ఈయన ఋగ్వేది, చిత్‌పావన్ బ్రాహ్మణుడు, స్వస్థలం అహమ్మద్‌నగర్ జిల్లా, గోదావరి తీరంలోని టోంకే గ్రామం. శక.1743 (1 నవంబర్ 1821) కార్తీక శుక్ల షష్ఠినాడు జన్మించాడు. తల్లిదండ్రులు సీతారామ్, సత్యభామలు. నాగపూర్‌లోని మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్య ఇక్కడే ఉంటున్న కన్యాకుబ్జ బ్రాహ్మణుడు ఢుండిరాజు వద్ద భాస్కరాచార్యుని లీలావతి, బీజగణితములను అభ్యసించాడు. శక.1760లో బాపూదేవుని గణిత ప్రతిభకు ఆశ్చర్యపోయిన సిహోర్ రాజకీయ ప్రతినిధి లార్డ్ విల్కిన్‌సన్ ఉన్నత విద్యకై సిహోర్‌లోని సంస్కృత పాఠశాలకు తీసుకువెళ్ళాడు. అక్కడ రేఖాగణితం మరియు ఇతర గణితములను సేవారాం ఆధ్వర్యంలో నేర్చుకున్నాడు. తర్వాత విల్కిన్‌సన్ సిఫారసుతో శక. 1763లో (క్రీ.శ 1841)లో వారణాసిలో సంస్కృత పాఠశాలలో రేఖా గణితాధ్యాపకునిగా నియమింపబడ్డాడు. అప్పటి నుండి చివరి వరకు అక్కడే స్థిరనివాసమున్నాడు. శక.1811లో గణితశాఖాధిపతిగా పదవీ విరమణ చేసాడు. శక.1812 వైశాఖ మాసంలో 69 ఏళ్ళ వయస్సులో మరణించాడు.

బాపూదేవుని పర్యవేక్షణలో అనేక మంది శిష్యులు శిక్షణ తీసుకున్నారు. క్రీ.శ.1864లో గ్రేట్ బ్రిటన్‌లోని రాయల్ ఆసియాటిక్ సొసైటీ, ఐర్లండ్, గౌరవ సభ్యునిగాను, 1868 బెంగాల్‌లోని ఆసియాటిక్ సొసైటీ సభ్యునిగాను, కలకత్తా విశ్వవిద్యాలయ ఫెలోగాను ఉన్నారు. అలాగే అలహాబాద్ విశ్వవిద్యాలయ ఫెలోగాను చేసాడు. క్రీ.శ. 1878లో సి.ఐ. ఈ బిరుదును, అదే సంవత్సరం బ్రిటన్ రాణి స్వర్ణోత్సవ సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వం నుండి మహామహోపాధ్యాయ బిరుదును అందుకున్నారు. చంద్రగ్రహణాన్ని సరిగా ముందుగానే చెప్పినందుకు జమ్ము మహారాజు రూ.1000/– బహుమతిని అందించారు.

బాపూదేవ సంకలనం చేసినది 1. రేఖాగణితం మొదటి అధ్యాయం 2. త్రికోణమితిపై కొంతభాగం 3. సాయన పద్ధతిలో వివాదాలు 4. పూర్వ ఖగోళ శాస్త్రవేత్తల బోధనలు 5. అష్టాదశ విచిత్ర ప్రశ్నోత్తర సంగ్రహము 6. తత్త్వ వివేక పరీక్ష 7. మాన్‌మందిర్‌లోని పరికరములపై వివరణ 8. అంకగణితం. ఈ గ్రంథాలు సంస్కృతంలో రాయబడి ముద్రించబడ్డాయి. వీటికి అదనంగా రాసినవి (అ) కలనగణిత సిద్ధాంతంపై 20 శ్లోకములలో వివరణ (ఆ) గోళీయ త్రికోణమితి సూత్రములు (ఇ) సిద్ధాంత గ్రంథములను పరిశీలించే వారికి ఉపయోగపడే వివరణలు (ఈ) యంత్రరాజ గ్రంథోపయోగం చేద్యకము (ఉ) లఘు శంకు – ఛిన్న – క్షేత్ర గుణము. ఇవి ముద్రించబడలేదు. హిందీభాషలో రాసిన అంక, బీజ, జ్యోతిష గ్రంథములు ముద్రించ బడ్డాయి. సూర్యసిద్ధాంతమును అనువదించడమే కాకుండా, ఎల్.విల్కిన్‌సన్ రాస్తున్న సిద్ధాంత శిరోమణిలోని గోళాధ్యాయ ఆంగ్ల అనువాదాన్ని సంపూర్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ రెండు గ్రంథాలు ఆర్ట్‌బెంటన్ ప్రాట్ ఆధ్వర్యంలో 1861–62లో ముద్రించబడ్డాయి. శక. 1788లో భాస్కరుని సిద్ధాంత శిరోమణి గణిత గోళాధ్యాయములపై క్లిష్టతరమైన అంశములపై పాఠాన్ని ముద్రించడం, 1805లో లీలావతిని ముద్రించడం జరిగింది. శక.1797 నుండి 1812 వరకు నాటికల్ అల్మనాక్ సాయంతో పంచాంగముద్రణ చేస్తుండేవాడు. ఈ పంచాంగం గురించి వివరణ పంచాంగమనే అధ్యాయంలో చూడవచ్చును. అయితే పంచాంగ గణితానికి సంబంధించి ఎటువంటి రచనను చేయలేదు.

-డా|| రేమెళ్ల అవధానులు

జంతువుల నుంచి నేర్చుకోవాలి

చాణక్యం




శ్లో|| సింహాదేకం బకాదేకం శిక్షే చ్చి త్వారి కుక్కుటాత్!
వాయసాత్పంచ శిక్షేచ్చ షట్ శున స్త్రీణి గర్దభాత్||

మనుష్యుడు సింహం నుండి ఒక గుణం, కొంగ నుండి ఒక గుణం, కోడి నుండి నాలుగు గుణాలు, కాకి నుండి ఐదు గుణాలు, కుక్క నుండి ఆరు గుణాలు, గాడిద నుండి మూడు గుణాలు నేర్వవలెనని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో చెప్పారు. మనుష్యుడు తాను చేయదలచిన పని పెద్దది కాని, చిన్నదికాని దానిని పూర్తి చేయుటకు సర్వశక్తులను ఉపయోగించి అన్ని విధాల ప్రయత్నించాలి. ఈ విషయంలో సింహానికి పోలిక తెలియచేస్తున్నారు. సింహం తాను వేటాడటానికి శక్తినంతా ఉపయోగిస్తుంది. అది తుపాకి గుండుకు కూడా ఎదురువెళ్లగలదు. అదే విధంగా మనిషి కూడా పనిచేయటంలో శక్తినంతా ఉపయోగించినచో ఆ పని సఫలమవుతుంది. అదే విధంగా కొంగ నుండి ఒక గుణం అంటే దాని ఏకాగ్రతను నేర్చుకోవాలి. మనుష్యుడు కొంగవలె ఏకాగ్రచిత్తుడై ఇంద్రియాలను వశపరచుకుని ఉండాలి. దేశ,కాల,మాన పరిస్థితులతో పాటు తన బలాన్ని కూడా బేరీజు వేసుకొని కార్యాన్ని సాధించాలి. శ్రీరాముడు కూడా ఒకానొక సమయంలో ధ్యానముద్రలో ఉన్న కొంగను చేసి లక్ష్మణునితో పంపా సరోవరంలో పరమధార్మికమైన ఆ కొంగను చూడమని చెప్పి అది జీవహింస అవుతుందోనేమోనని ఆందోళనతో శంకంతో మెల్లమెల్లగా పాదాలను ఎలా తన్నుతున్నదో గమనించుము అంటారు. ఈ లోపల ఒక చేప ఈ విధంగా అంటోంది. ఈ కొంగ నా కుటుంబాన్ని చంపి నన్ను కుటుంబం లేనిదానిగా చేసింది. అట్టి దానిని రామా! పొగుడుతున్నావు. తోటివారి చరిత్ర తోటివాడే ఎరుగుతాడని చేప ఆవేదనతో అంది.అలాగే కోడి గురించి చెబుతూ ఒకే సమయంలో నిద్రలేస్తుందనియు, పోరాటానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని, బంధువులకు ఉపకారం చేయడం, ఏదైనా ఆహారం కనబడినంతనే వెంటనే భుజిస్తుందని ఈ నాలుగు అంశాలను కోడి నుండి నేర్చుకోవాలని అంటున్నారు. అదే విధంగా గాడిద నుండి మనుష్యుడు నేర్చుకోవాల్సింది అది ఎంత శ్రమకైననూ చేయడానికి సిద్ధపడి ఉంటుంది. ఎంతెంత బరువులనైనా అది సునాయాసంగా మోయగలదు. కాబట్టి మనుష్యుడు కూడా అలాంటి కష్టతరమైన పనులను కూడా గాడిద స్ఫూర్తితో చేయాల్సి ఉంటుంది.

- యామిజాల సుబ్రహ్మణ్యం


ధర్మ సందేహాలకు సమాధానాలు

శ్రీరాముడు ఆంజనేయుణ్ణి 'నీవు నాకు భరతునితో సమానం' అన్నాడు కదా? వాళ్ళిద్దరి మధ్య రక్త సంబంధం ఉందనడానికి ఏదోకథ ఉందని విన్నాం. నిజమేనా?



ప్రచారంలో ఉన్న ఈ కథలో శ్రీరాముడు తెలిసి అన్నాడా! తెలియక అన్నాడా! అనేది చెప్పలేం కాని ఆంజనేయునిపై కల వాత్సల్యంతో అన్నది మాత్రం నిజం. దశరథుడు పుత్రకామేష్టి చేసి యజ్ఞపురుషుని ప్రసాదాన్ని తన ముగ్గురు భార్యలకు పంచాడు. పూర్వజన్మలో అప్సరస శాపానికి గురై పక్షి రూపంలో వచ్చి కైక భాగంలో కొంత ఎత్తుకెళ్ళి సుపుత్రుడు కలగాలని తపస్సు చేస్తున్న అంజనాదేవి ఒళ్ళో వేసింది. అంజనాదేవి ఆ ప్రసాదం స్వీకరించింది. రుద్రాంశతో, వాయు తేజస్సుతో పాటు ఈ యజ్ఞపురుష ప్రసాదం కూడా హనుమంతుని జననానికి తోడైందనే కథ ప్రచారంలో ఉంది.

-డా|| పి. భాస్కరయోగి



మురిపాల లోగిళ్లలో ముత్యాల ముగ్గులు

ముత్యంమంతా పసుపు ముఖమంత ఛాయ.. ముత్తైదు కుంకుమ బ్రతుకంతా ఛాయ.. ముద్దుమురిపాలొలుకు ముంగిళ్లలోన మూడు పువ్వులు ఆరు కాయల్లు కాయ.. అంటూ భారతదేశ సంప్రదాయంలో భాగంగా అత్తవారింటికి వెళ్లిన ఆడపిల్ల ఎలా ఉండాలో సినీ గేయ రచయత డా|| ఆరుద్ర పాట విశదం చేస్తుంది. అత్తవారింటికి వెళ్లిన ఆడపిల్లకి తొలి ప్రశంసనిచ్చేది ముగ్గే. నగుమోమును చూసి వివాహమాడినప్పటికీ ఆమె తీరుతెన్నులను తెలిపేది ఆమె వేసిన ముగ్గు. ఇంటి ముందు తీరైన ముగ్గు ఉందంటే ఆ ఇంట్లో అనురాగవల్లి ఉందని అర్థం. ఎవరైన ఇంటికి వచ్చినప్పుడు ముంగిట కళ్ళాపి చల్లి వేసిన ముగ్గునే చూస్తారు. ఆ ముగ్గులో ఉన్న పాజిటివ్ వైబ్రెషన్స్ వారిలో ఉన్న చెడు ఆలోచనలు పోయి వారి మనస్సు కూడా ప్రశాంతతను ఆవరించుకుంటుంది. ముగ్గు వెనుక ఉండే అంతరార్థం ఏమిటో?.. ఎలాంటి ముగ్గులు ఎప్పుడెప్పుడు వేయాలో తెలుసుకుందాం..



మన హిందూ సంప్రదాయంలో ప్రతి రోజు స్త్రీలు ఉదయం ఇళ్ళముందు ముగ్గులు వేస్తారు. ముగ్గులు వేయమని చెప్పడానికి ఆరోగ్య కారణాలున్నాయి. శరీరంలో నడుము భాగానికి తగిన వ్యాయామం లేకపోతే అది దీర్ఘకాలంలో అనేకానేక వెన్ను సమస్యలకు దారి తీస్తుంది. రాత్రంతా పడుకున్న సమయంలో వెన్ను నిటారుగా ఉంటుంది. ఉదయం లేవగానే నడుముకు సంబంధించిన వ్యాయామం చేయడం సత్ఫలితాలనిస్తుందని గమనించారు మన పెద్దలు.

ఉదయమే నడుముకు సంబంధించిన వ్యాయామంలో భాగమే స్త్రీలు ముగ్గు వేయడం. ముగ్గులు వేయాలంటే నడుమువంచాలి. చుక్కలు పెడతారు, అవి కలపడానికి అటు, ఇటు చేతులు, నడుము కదపాలి. ఈ విధంగా నడుముకు సంబంధించిన వ్యాయమం చేసినవారవుతారు. దీని కారణంగా దీర్ఘకాలంలో నడుము నొప్పులు రావు. అందుకే ఉదయమే ముగ్గులు వేయడం మన సంప్రదాయంలో భాగంగా పెట్టారు. అట్లాగే వంగినప్పుడల్లా శ్వాస నిదానంగా పీలుస్తూ ఉండడం ఒక విధమైన ప్రాణాయామం అవుతుంది. ఈనాటి కాలంలో ఒక్కసారి గమనిస్తే, పెయింట్లు పెట్టేసి చేతులు దులిపేసుకుంటున్నాం. నడుం వంచి పనిచేసే అవసరం లేక దీర్ఘకాలంలో వెన్నుపూసకు సంబంధించిన రుగ్మతలను కారణం అవుతుంది.

స్త్రీలే వేయాలా అంటే కాదు అనే చెప్పాలి. గర్భగుడిలో భగవంతుని వద్దకు పూజారి మాత్రమే వెళ్తాడు. దేవుడి వద్ద శుభ్రపరిచి, ఆయనే వేస్తారు(ఎందుకంటే గర్భ గుడిలోనికి పూజారి తప్ప వేరే వారు ప్రవేశించరు కనుక). అలాగే సూర్య భగవానుడికి సంబంధించిన పూజలు చేసే సమయంలో, ఇతర దేవతాపూజలలోనూ కొన్ని రకాల యంత్రాలను వేయవలసి ఉంటుంది. అప్పుడు కూడా ఉపాసకులే వేస్తారు. స్త్రీలకు సృజనాత్మకత ఎక్కువ. వారిలోని సృజనాత్మకతను బయట ప్రపంచానికి తెలియపరుస్తుంది ముగ్గు.

ముగ్గును ఏవిధంగా వేయాలంటే..

ఇంటి ముందు ముగ్గులో భాగంగా గీసే రెండు అడ్డగీతలు ఇంటిలోనికి దుష్టశక్తులను రాకుండా నిరోధిస్తాయి. ఇంట్లోఉన్న లక్ష్మీదేవి బయటకు వెళ్ళకుండా చూస్తాయి.

ముగ్గువేసి దానికి నాలుగువైపులా రెండేసి అడ్డగీతలు గీస్తే అక్కడ శుభాకార్యాలు, మంగళకరమైన పనులు జరుగుతున్నాయని గుర్తు. పండుగల సమయంలో ఈ విధంగా ఖచ్చితంగా వేయాలి. ఏ దేవతపూజ చేస్తున్నా దైవాన్ని ఉంచే పీట మీద మధ్యలో చిన్న ముగ్గు వేసినా, నాలుగు వైపులా రెండేసి గీతలను తప్పక గీయాలి.

కోణాలలో రహస్యం

నక్షత్రం ఆకారం వచ్చేలా గీతలతో వేసిన ముగ్గు భూత, ప్రేత, పిశాచాలను ఆ దరిదాపులకు రాకుండా చూస్తుంది. అంతే కాదు, మనం వేసే పద్మాలు, చుక్కల ముగ్గులలో కూడా మనకు తెలియని అనేక కోణాలు దాగి ఉన్నాయి. అవి కేవలం గీతలే కాదు, యంత్రాలు కూడా. యంత్ర,తంత్ర శాస్త్ర రహస్యాలతో కూడి ఉండడం వల్ల మనకు హాని కలిగించే చెడ్డశక్తులను దరిచేరనీయవు. అందుకే ఏ ముగ్గునైనా తొక్కకూడదు.



అష్టదళపద్మం

తులసి మొక్క వద్ద అష్టదళపద్మం వేసి దీపా రాధాన చేయాలి. యజ్ఞయాగాదులలో యజ్ఞ గుండం మీద నాలుగు గీతలతో కూడిన ముగ్గు లేయాలి. దైవకార్యలలో కూడా నాలుగు గీతలతో కూడిన ముగ్గులు వేయాలి.

ప్రేమకు చిహ్నం



నూతన వధూవరులు తొలిసారి భోజనం చేసే సమయంలో వారి చుట్టుప్రక్కల లతలు, పుష్పాలు,తీగలతో కూడిన ముగ్గులు వేయాలి.

దేవతా రూపాలను, ఓం, స్వస్తిక్, శ్రీ గుర్తులను పోలిన ముగ్గులు వేయకూడదు. ఒకవేళ వేసినా వాటిని తొక్కకూడదు.

ముగ్గుతో అయిదవతనం

ఏ స్త్రీ అయితే దేవాలయంలోనూ, అమ్మవారు, శ్రీ మహావిష్ణు ముందు నిత్యం ముగ్గులు వేస్తుందో, ఆ స్త్రీకి 7 జన్మలవరకు వైధవ్యం రాదని, సుమంగళిగానే మరణిస్తుందని దేవి భాగవతం, బ్రహ్మాండపురాణం చెబుతున్నాయి.

ముగ్గుతో పాజిటివ్‌నెస్

ఏ రోజుకారోజు బియ్యపు పిండితో ముగ్గు పెట్టాలి.

నిత్యం ఇంటి ముందు, వెనుక భాగంలో, తులసి మొక్క వద్ద, దీపారాధన చేసే ప్రదేశంలో ముగ్గు వేయాలి. ముగ్గు పాజిటివ్/దైవ శక్తులను ఇంట్లోకి ఆకర్షిస్తుంది.

ముగ్గుతో శభాఅశుభ సూచకాలు



ముగ్గులు ఒకప్పుడు సూచకాలుగా పనిచేసేవి. పూర్వం రోజూ సాధువులు, సన్యాసులు, బ్రహ్మచారులు ఇల్లిల్లూ తిరిగి బిక్ష అడిగేవారు. ఏ ఇంటి ముందైనా ముగ్గు లేదంటే ఆ ఇంటికి వేళ్ళేవారు కాదు. వారే కాదు అడుక్కునేవారు కూడా ముగ్గు లేని ఇళ్ళకు వెళ్ళి అడుక్కనే వారు కాదు. ముగ్గు లేదంటే అక్కడ అశుభం జరిగిందని గుర్తు. అందుకే మరణించినవారికి శ్రాద్ధకర్మలు చేసే రోజున ఉదయం ఇంటిముందు ముగ్గు వేయరు. శ్రాద్ధకర్మ పూర్తైన వెంటనే, అది మధ్యాహ్నమైనా ముగ్గు వేస్తారు.

ముగ్గుల వెనుక సామాజిక, మానసిక, ఆరోగ్య, ఆధ్యాత్మికమైన అనేక రహస్య కోణాలు దాగి ఉన్నాయి. మనం ఆచరించే ఏ ఆచారం మూఢనమ్మకం కాదు. మన ఆచార, సంప్రదాయాలన్నీ అనేకానేక అర్థాలు, పరమార్థాలతో కూడినవి.

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. దేవకీదేవిగా జన్మించింది ఎవరు?
2. యజ్ఞపశువుని పులి చంపగా కేశిధ్వజుడు ప్రాయశ్చిత్తం కోసం ఎవరిని కోరతాడు?
3. బ్రహ్మసూత్రాలను రాసిందెవరు?
4. హనుమంతుడు ఎవరి కొడుకు?
5. గౌతముడు బోధి సత్వుడుగా మారిన స్థలం
6. ధుర్యోధనుని అసలు పేరు?
7. కార్తికేయుని మరో పేరు?
8. కనకదుర్గా దేవి వాహనం?
9. శ్రీరాముని సంతానం?
10. అంబ ఎవరిని ప్రేమించింది?

సమాధానాలు

1. అదితి
2. ఖాండిక్యుడు
3. వేదవ్యాసుడు
4. వాయుదేవుడు
5. గయా
6. సుయోధనుడు
7. కుమారస్వామి
8. సింహం
9. లవకుశులు
10. సాళ్వరాజుని

ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం

విజయక్రాంతి, కూకట్‌పల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతీ కార్యకర్త శాయశక్తులా కృషి చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓ గార్డెన్స్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీ ధర్ రావు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలనీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి విజయం కోసం కష్ట పడాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం అని అన్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ గెలుపు ఓటమి సహజం అని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు గల్లంతైన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీంరావు, శ్రీకర్‌రావు, రవి కుమార్ గౌడ్, రామ్ మోహన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు అన్యాయంపై ప్రత్యామ్నాయ వేదిక

- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్
- ఇప్పుడు పోరాడకపోతే బీసీలకు బానిసత్వమే
- క్లిష్ట సమయమిది.. బీసీలందరూ ఏకం కావాలి
- రాహుల్ గాంధీ నిర్ణయాలు బీసీలకు ఆశాజనకం

విజయక్రాంతి, హైదరాబాద్: బీసీలకు జరుగుతున్న అన్యాయాల్పై రాజకీయ పోరాటానికి ప్రత్యామ్నాయ వేదిక సిద్ధం కానుందా... కాంగ్రెస్ పార్టీతో సహ మిగతా పార్టీ నేతలు ఆ దిశగా కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. తాజా రిజర్వేషన్ల కుదింపుపై బీసీ నేతల్లో తీవ్ర కలవరపాటు, ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో ఆ పని కుదరని పక్షంలో ప్రత్యామ్నాయ వేదికను సైతం వెనకాడేది లేదంటున్నారు సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్‌తో విజయక్రాంతి మాటా మంతీ..

బీసీ రథయాత్ర చేపడతా..

బీసీలకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రంలో బీసీ రథయాత్ర చేపడతా. అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తా. అన్ని వర్గాల మద్దతు కూడగడతా. వివిధ బీసీ సంఘాలను, పార్టీల నేతలను ఏకతాటిపైకి తేవటం ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహిస్తే ఆ పార్టీ ఆధ్వర్యంలోనే పోరాడతా. లేనిపక్షంలో ప్రత్యామ్నాయ వేదిక నిర్మిస్తా. ఇప్పటికే టీడీపీ నుంచి ఎల్.రమణ, బీజేపీ నుండి డాక్టర్ లక్ష్మణ్‌తో సంప్రదించటం జరిగింది. వారినుంచి సానుకూల స్పందన వచ్చింది. బీసీలను కూడగట్టి రాబోయే రోజుల్లో అధికారం చేపడతాం. ఇలాగే వదిలేస్తే బీసీలకు మళ్లీ బానిసత్వమే దాపురించే ప్రమాదముంది. ఒకసారి ఎస్సీ వ్యక్తి సీఎం అయ్యారు. బీసీ సీఎం రావాలనేదే నా కల.

బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై కేసీఆర్ దొంగదెబ్బ కొట్టారు

గతంలో ఏ సీఎం చేయనివిధంగా కేసీఆర్ బీసీలను దొంగదెబ్బ కొట్టారు. రాజకీయ ప్రాధాన్యతను తొలిమెట్టుగా భావించే పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లను తగ్గించి రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారు. కేసీఆర్‌కు రెండు రూపాలున్నాయి. ఎన్నికలకు ముందు, తరువాత సమగ్ర కుటుంబ సర్వే చేసి బీసీల బలాన్ని గుర్తించి వారిని ఆకట్టుకోవటానికి ఓ పథకం ప్రకారం పావులు కదిపారు. వారికి నిర్మాణాత్మకంగా ఉపయోగపడే నిర్ణయాలను వదిలేసి కురుమలకు గొర్లు, యాదవులకు బర్లు, జాలరులకు చేపల పంపకం ప్రారంభించారు. వారిని వృత్తులకే పరిమితం చేసి రాజ్యాధికారం వైపు ఆలోచించకుండా చేయటం ఆయన ఉద్దేశం. అంతటితో ఆగకుండా కులాల వారీగా ఆత్మగౌరవ భవనాలను ప్రకటించారు. కొందరికి ఐదెకరాలు, ఐదు కోట్లు, కొందరికి ఒకటి, రెండు ఎకరాలు, కోట్లు ప్రకటించారు. ఈ రకంగా బీసీలను వాడుకున్నారు.

సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కోర్టుకు ఎందుకు ఇవ్వలేదు

రిజర్వేషన్లు 50శాతంపై ఎవరో కొందరు కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టుల్లో న్యాయపరంగా సరైన వాదన వినిపించకపోవటం ఒకటైతే, బీసీ జనగణన లెక్కలు కోర్టుకు సమర్పించకుండా దాటవేయటం వంటివి కుట్రపూరితమైన చర్యలే. కరీంనగర్ కార్పొరేషన్‌లో 19 స్థానాలుంటే ఇప్పుడు 5 స్థానాలు కూడా దక్కేలా లేవు. రాజకీయంగా ఎదిగే మూలాలపై దెబ్బకొట్టడం జరిగింది. ఇలాంటి నిర్ణయాలు నిర్ణయాలు తీసుకోవటానికి రాజ్యాంగం ప్రకారం ఓ విధానం ఉంది. అవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం జరిగింది.

ఓబీసీలకిచ్చిన హామీలు గాలికేనా

బీసీలో బాగా వెనకబడినవారున్నారని ఆయనే ఓబీసీ విభాగాన్ని ఏర్పాటు చేసారు. ఇప్పుడు వారికి ఎలా న్యాయం జరుగుతుంది. ఖమ్మం లాంటి ఏజెన్సీ ప్రాంతంలో బీసీలు కూడా ఉంటారు. వారికి రాజకీయ ప్రాధాన్యం ఎలా దొరుకుతుంది.

బీసీ నేతగా పోరాడుతున్నా

బీసీ నేతగా ఎప్పుడు బీసీలకు ఆపద వచ్చినా తాను ముందుండి పోరాడుతా. గతంలో బీసీల కోసం పథకాలు రావటానికి కృషిచేశాను. తాజాగా కేసీఆర్ పంచాయతీ రాజ్ రిజర్వేషన్ల తగ్గింపుపై సుప్రీం కోర్టులో సవాలు చేయటానికి సిద్ధమైన తరుణంలోనే నోటిఫికేషన్ విడుదల కావటంతో విఫలమయ్యాను. ఈ విషయంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీసీలను చైతన్యం చేస్తా. తనకు గతంలో రెండు సార్లు సీఎం కావటానికి అవకాశం వచ్చినా బీసీ నేతల్లో ఐకమత్యం లేకపోవటం వల్లే దూరమైంది. 1990లో సీఎం, 2008లో కేంద్రమంత్రి కాకుండా అడ్డుపడ్డారు.

జంతర్ మంతర్ ధర్నా ఏమైంది

బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని, కేంద్రం సహకరించకపోతే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తానని గతంలో మాట్లాడిన సీఎం కేసీఆర్ మాటలు నీటి మూటలేనా. దళిత సీఎం చేస్తానని లేకుంటే తలనరుక్కుంటానని పచ్చి అబద్ధాలు మాట్లాడి ప్రజలను మోసం చేయటం కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. తమిళనాడులో మాదిరిగా రిజర్వేషన్లు సాధించి తీరుతానన్నారు.

విభేదాలు మరిచి బీసీలంతా ఏకం కావాలి

బీసీలకు క్లిష్టమైన కాలమిది. ఈ పరిస్థితిని ఎదుర్కోవటానికి విభేదాలు పక్కన పెట్టి, బీసీ సంఘాలు, రాజకీయ నేతలు ఏకతాటిపైకి రావాలి. అందరితో మాట్లాడి వారిని ఉద్యమంలో కలుపుకపోయేందుకు చొరవ తీసుకుంటాను. తనకు ఎవరి పట్లా వ్యతిరేకత లేదు. కానీ ఓ బీసీ నేత నిజాం గ్రౌండ్‌లో బీసీ గర్జన పెట్టి బీసీ నేతలను పిలువలేదు. అప్పుడు తనతో పాటు పొన్నాల లక్ష్మయ్య బహిష్కరించాం. బీసీలను వాడుకోవటానికి చూస్తే కేసీఆర్ లాంటివారు పుట్టుకొస్తారు.

బీసీ సంఘాలు విఫలం

బీసీ సమస్యలపై రాజకీయ పోరాటం చేయటంలో బీసీ సంఘాలు విఫలమయ్యాయి. కేంద్రంలో బీసీలకు ఉద్యోగ విద్యారంగాలలో 27 శాతం రిజర్వేషన్ల అమలు వెనక తన కృషి ఉంది. అప్పట్లో కేంద్ర మంత్రి అర్జున్ సింగ్ హయాంలో పోరాడి సాధించాను. ఓబీసీ ఎంప్లీస్ కన్వీనర్‌గా క్రీమీలేయర్ ఎత్తివేయాలని పోరాడాను. ఆ ఫైలు పెండింగ్‌లోనే ఉంది. దీని ఫలితంగా రిజర్వేషన్లు పూర్తిగా అందుకోవటంలో ఇబ్బందిగా మారింది. రిజర్వేషన్ల అమలుపై పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయించగలిగాం. దాంతో రిజర్వేషన్ల అమలు తీరు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఎప్పటికప్పుడు తెలుసుకొని, తగిన చర్యలు తీసుకునే వీలు ఏర్పడింది.

సంఘాల నేతలు వైఖరి మార్చుకోవాలి

కొందరు నేతలు ఇష్టానుసారంగా బంద్‌కు పిలుపు ఇచ్చి బీసీ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. కొందరు అధికార పార్టీ కనుసన్నల్లో కార్యక్రమాలు నడిపిస్తూ ఐకమత్యాన్ని దెబ్బతీస్తున్నారు, వారంతా తమ వైఖరి మార్చుకుంటేనే బీసీల్లో ఐకమత్యం సాధ్యమవుతుంది. వ్యక్తిగత ప్రయోజనాలను వదిలేసి జాతి ప్రయోజనాల కోసం ఐకమత్యంతో పనిచేయాలి. ఆర్.కృష్ణయ్య లాంటి వారు మరింత పరిణతితో వ్యవహరించాలి.

బీసీ కమిషన్‌కు రాజ్యాంగహోదా

బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతూ వచ్చాం. ఓబీసీ ఎంప్లీస్ కన్వీనర్‌గా పలుమార్లు ప్రధాని మోడీని కలిసి, దీని అవసరాన్ని వివరించాము. దాని ఫలితంగానే ఇటీవల రాజ్యాంగ హోదా దక్కింది.

రాహుల్ గాంధీ నిర్ణయం బీసీలకు ఆశాజనకం

రాజస్థాన్ రాష్ట్రంలో బీసీలను సీఎం, డిప్యూటీ సీఎంగా, ఛత్తీస్‌గఢ్‌కు సీఎంగా బీసీలను నియమించటం శుభపరిణామం. ఇది మాకు నైతికంగా బలాన్నిస్తుంది. రాహుల్ గాంధీ ఆలోచనలో మంచి మార్పు వచ్చింది.

పది రోజుల్లో పీసీసీకి కొత్త కమిటీలు

- ఎన్నికల కోసం ఐదు కమిటీలు
- యుద్ధ ప్రాతిపదికన కమిటీల నియామకం
- ఐదుగురితో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ టీమ్...
- అన్ని పీసీసీలకు ఏఐసీసీ ఆదేశం




విజయక్రాంతి, హైదరాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్ కొత్త కమిటీలతో యుద్ధానికి సిద్ధం అవుతోంది. 3వ తేదీన ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జ్‌ల సమావేశంలో ఏఐసీసీ తీసుకున్న నిర్ణయాలను ఆర్గనైజేషన్ కమిటీ అన్ని పీసీసీలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా అన్ని పీసీసీలను తిరిగి నియమించాలని, వాటితో పాటు ఎన్నికల కోసం కొత్తగా ఐదు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఇచ్చిన ఆదేశాలతో కాంగ్రెస్‌లో తిరిగి ఎన్నికల కమిటీల నియామకం తప్పనిసరి అయింది. అలాగే సంస్థాగతంగా కమిటీల నియామకం చేయనుండడంతో నాయకులు మళ్ళీ పదవుల కోసం పరుగులు తప్పనిసరి అయ్యేలా ఉంది. ఏఐసీసీ ఆర్గనైజేషన్ కార్యదర్శి జె.డి శీలం పీసీసీలకు పంపిన లేఖలు, టైమ్ షెడ్యూల్ ప్రకారం కమిటీలను పూర్తి చేసి ఏఐసీసీకి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ప్రధానంగా జనవరి 8వ తేదీలోగా ఎన్నికల కోసం పీసీసీ స్థాయిలో 5 కమిటీలను ఏర్పాటు చేయాలి. అందులో కో ఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ, ప్రచార (కాంపెయిన్) కమిటీ, పబ్లిసిటీ కమిటీ మరియు మీడియా కో ఆర్డినేషన్ కమిటీలను నియమించాలని, 15వ తేదీ నుంచి ఈ కమిటీలు పనులు ప్రారంభించాలని ఆదేశించింది. అలాగే ప్రధానంగా సంస్థాగతంగా పీసీసీ, డీసీసీ, సిటీ కమిటీలు, బ్లాక్ మరియు వార్డు కమిటీలను జనవరి 15వ తేదీ లోగా నియమించాలని, బూత్ కమిటీలు అన్ని జనవరి 30వ వరకు పూర్తి చేయాలని, ఫిబ్రవరి నెలాఖరు నాటికి కొత్తగా నియామకమైన బూత్, బ్లాక్, అసెంబ్లీస్థాయి కమిటీలకు శిక్షణ పూర్తి చేయాలని ఏఐసీసీ ఆదేశించింది. కొత్తగా బూత్ లెవల్ నుంచి పీసీసీ లెవల్ కమిటీల నియామకానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని, పూర్తి వివరాలను ఫార్మెట్ రూపంలో ఫిబ్రవరి 5వ తేదీ లోగా ఏఐసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శికి సమర్పించాలని ఆదేశించింది. అలాగే ఎన్నికల సంఘం సవరించిన ఓటర్ల లిస్టు జాబితా విషయంలో పార్టీ లోతుగా పరిశీలించాలని, మార్పులు చేర్పులు చేసేందుకు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ఆ జాబితాను జనవరి 25వ తేదీలోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఆదేశించారు.

ఎన్నికలు సమీపిస్తుండడంతో పీసీసీ కమిటీలలో ఉన్న కార్య నిర్వాహక అధ్యక్షుకులకు, ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజన చేసి బాధ్యతలు అప్పగించాలని, అలాగే ప్రతి పీసీసీ కమిటీలో ఐదుగురితో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఎన్నికలకు సంబంధించి డీసీసీలతో, ఏఐసీసీలతో పనుల బాధ్యతలను నిర్వహించేలా చూడాలని ఏఐసీసీ ఆదేశించింది. అలాగే పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశాలు, డీసీసీల నుంచి సిఫారసులు తదితర కార్యక్రమాలు చేపట్టాలని, అలాగే ఈ నెల 15న పీసీసీ స్థాయిలో ముఖ్య నాయకులతో సమావేశాలు పెట్టి భవిష్యత్తు కార్యచరణ అమలు చేయాలని, శక్తి యాప్‌కు సంబంధించి అత్యంత ప్రాధాన్యత, కో ఆర్డినేటర్ల నియామకం, తదితర ప్రధాన పనులు జనవరి 30వ తేదీలోగా పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని ఏఐసీసీ ఆదేశాలు ఇచ్చింది.

సంస్థాగత కమిటీలకు సంబంధించిన పనులను పూర్తి చేయడం, లోక్ సభ ఎన్నిలకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేయడం, పీసీసీ అధ్యక్షుడికి సంబంధించిన పనులలో కమిటీలు సంపూర్ణ మద్దతు ఇవ్వడం, అలాగే ప్రచార ప్రణాళికలను, మ్యానిఫెస్టో అంశాలకు సంబంధించిన సలహాలు, సూచనలను కూడా అనుబంధ విభాగాలు, కమిటీలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఇది ఎలాంటి జాప్యం లేకుండా, నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా, ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని పీసీసీలను ఏఐసీసీ ఆదేశించింది.

పల్లెల్లో 'పంచాయతీ' వేడి...

- మేడ్చల్ జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు, 596 వార్డులు
- నాలుగు మండలాల పరిధిలో రెండు విడతల్లో ఎన్నికలు
- కొత్త పంచాయతీలతో పెరిగిన ఆశావహులు
- వ్యక్తిగత పోటీ, అయినా తెర వెనుక పాత్ర పార్టీలదే...



విజయక్రాంతి, మల్కాజ్‌గిరి: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో మరోసారి ఎన్నికల వేడి రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లోనే పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో స్థానిక రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పంచాయతీ, వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎవరు ఎక్కడినుంచి పోటీ చేయాలనే దానిపై స్పష్టత వచ్చింది. కొత్త పంచాయతీల ఆవిర్భావంతో ఎన్నికల్లో పోటీచేయాలనే ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నప్పటికీ తెర వెనుక పాత్ర పార్టీలదే కావడం విశేషం. ఒక్కసారైనా సర్పంచ్ కావాలనే కోరిక ఉన్న ఆశావహులు ఆయా పార్టీల తరపున రంగంలోకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

అధికారుల కసరత్తు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రెండు విడతల ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు, 596 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. కీసర మండలంలోని 11 పంచాయతీల్లో 23,669 మంది ఓటర్లు ఉన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో 32,203మంది, మేడ్చల్ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 47,634మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలాల వారీగా ఈ ఓటర్ల జాబితాను పంచాయతీలకు అందజేసిన అధికారులు జిల్లా మొత్తంలో దాదాపు ఎనిమిది వందల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల అధికారులను నియమించిన జిల్లా యంత్రాంగం ఇప్పటికే వారికి శిక్షణా కార్యక్రమాన్ని కూడా పూర్తి చేసింది. ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో ఎన్ని బ్యాలెట్ పేపర్లు అవసరం, ఎన్నికల నిర్వహణ ఖర్చు తదితర అంశాలను జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించింది.

పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన

పోలింగ్ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుండి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఉప సర్పంచ్ ఎన్నిక కౌంటింగ్ ముగిసిన తర్వాత వార్డు సభ్యులందరూ కలిసి ఎన్నుకుంటారు. పోలింగ్‌లో ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనేలా చేసి ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని వివిధ విభాగాల అధికారులు పల్లెల్లో ప్రచారాన్ని చేపట్టారు.

నీటిని వృథా చేస్తున్న బిల్డింగ్‌కు నల్లా కనెక్షన్ కట్

- నగరంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



విజయక్రాంతి, హైదరాబాద్: రోడ్లపై పారుతున్న మురుగు నీరు, తెల్లారేసరికల్లా రహదారులకు ఇరుపక్కలా భవన నిర్మాణ వ్యర్థాల కుప్పలు, పెద్ద భవనాల నుంచి వృధాగా, బాధ్యతా రహితంగా యజమానులు నీటిని వదలడం పట్ల కమిషనర్ దాన కిషోర్ కన్నెర్ర చేశారు. శుక్రవారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాల్లోపారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ దాన కిషోర్ ఆకస్మిక తనిఖీలు జరిపారు. మెహిదీపట్నం జంక్షన్‌లోని బస్టాప్, రైతుబజార్, ప్రధాన రహదారిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. మెహిదీపట్నం రైతుబజార్ నుంచి మురుగునీరు సమీపంలోని బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై పారి వందలాది మందికి అసౌకర్యంగా ఉండడాన్ని గమనించి వెంటనే మురుగునీరు లీకేజీని అరికట్టి శాశ్వత పరిష్కారాన్ని చేపట్టాలని జలమండలి అధికారులను ఆదేశించారు. రైతుబజార్‌లో ఉత్పత్తయ్యే తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయడానికి కంపోస్ట్ పిట్లు ఏర్పాటు చేసేలా వెంటనే చర్యలు చేపట్టాలని రైతుబజార్ మేనేజర్‌ను కోరారు. రైతుబజార్ పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నుంచి దుకాణదారులు పెద్ద ఎత్తున చెత్తను రోడ్డుపై వేయడాన్ని దానకిషోర్ గ్రహించి, ప్రతి షాప్ వద్ద ప్రత్యేకంగా డస్ట్ బిన్లను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. రైతుబజార్ పక్కనే ఉన్న గార్బేజ్ పాయింటును ఎత్తివేయడం లేదా డస్ట్‌బిన్ల నుంచి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలను చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. అనంతరం టోలీచౌకి మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న బహుళ అంతస్తు భవనం కింద నల్లా నీటిని రోడ్డుపైకి వృథాగా వదలడాన్ని గమనించి ఆ భవన యజమానికి భారీ జరిమానా విధించడంతో పాటు నల్లా కనెక్షన్‌ను తొలగించాలని ఆదేశించారు. అనంతరం అత్తాపూర్ మార్గంలోని కార్వాన్ రింగ్ రోడ్ నుంచి జియాగూడ కబేళా, పురానాపూల్ మార్గాన్ని తనిఖీచేశారు. ఈ మార్గం గుండా రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని పేర్కొన్నారు. అనంతరం జియాగూడ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు.

అక్కడ ఔషధ మొక్కలను పెంచాలని సూచించారు. కమిషనర్ తో పాటు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ముషారఫ్ అలీ, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

చైనీస్ మాంజా వాడకం, అనర్థాలపై సమావేశం

విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి. కానీ పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలి. చైనీస్ మాంజా (చైనా దారం) వాడకం వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నాయి. కైట్స్ ఎగరవేసేందుకు గ్లాస్ కోటింగ్‌తో ఉన్న నైలాన్, సింథటిక్ తాడు వాడుతున్నారు. దారంలో చిక్కుకున్న పక్షులు విలవిల్లాడి చనిపోతున్నాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో కూడా చైనా మాంజా వినియోగాన్ని నిషేధించామని పీసీసీఎఫ్ పీ.కే.ఝా. తెలిపారు. ఇతర శాఖలతో సమన్వయంతో మాంజా వాడకాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్జీవోల సహకారంతో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. వారితో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించాం. చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా ఐదేళ్ళు జైలు శిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా. మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3 నుంచి 7 ఏళ్ల దాకా జైలు శిక్ష, పదివేల జరిమానా ఉంటుందని చెప్పారు. చైనా దారం అమ్మకం గురించిన వివరాలు తెలిస్తే .. అటవీ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లకు (040–23231440, 18004255364) తెలియచేయాలని కోరారు. సమావేశంలో పీసీసీఎఫ్ పీ.కే.ఝా తో పాటు పృధ్వీరాజ్, అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర, స్వర్గం శ్రీనివాస్, అటవీ శాఖ ఓఎస్డీ శంకరన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు

విజయక్రాంతి, హైదరాబాద్: వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు మాజీ మంత్రి, టీపీసీసీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్ దాస్ చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. వచ్చే నెలలో రాహుల్ గాంధీ అధ్యక్షతన ఢిల్లీలో జాతీయ బీసీ గర్జన జరగనుందని చెప్పారు. బీసీలని బలహీన పరిచేందుకే కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని చిత్తరంజన్ దాస్ మండిపడ్డారు. బీసీల రిజర్వేషన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామన్నారు. బీసీలను బలహీన పరిచేందుకే కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

విజయక్రాంతి, బోడుప్పల్: ఈ నెల 8, 9 తేదీల్లో జాతీయ కార్మిక సంఘాల అధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కార్మిక సంఘాల దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పలువురు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు బోడుప్పల్‌లో శుక్రవారం నాడు బోమ్మక్ శంకరయ్య గార్డెన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను ఎలా విజయవంతం చేయాలనే దానిపై కార్మికులకు ఆవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా చర్యలకు పూనుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొమటి రవి, చింతల యాదయ్య, మైసగళ్ల బాల్ నర్సింహ్మ, సృజన, ఐఎన్‌టీయూసి గోద మల్లేష్ గౌడ్, ఏఐటీయూసి నాయకులు వీబీ బాల్ రాజు, మార్టిన్, రచ్చ కిషన్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హమారా షహర్



నేరేడ్‌మెట్‌లో ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు పుట్‌పాత్‌లకు టైల్స్ వేసి అందంగా తయారు చేసారు. ఇక్కడి మిఠాయి షాప్ యజమాని ఏకంగా ఈ స్థలాన్ని కబ్జా చేసి తన వ్యాపార విస్తరణ కోసం ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇలా ఫుట్‌పాత్ ఆక్రమించినా అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపించారు. విశ్వ నగరంలో ఇలాంటివి మామూలేనా, చర్యలు ఉంటాయా అని ప్రశ్నిస్తున్నారు.

హస్త కళల ప్రదర్శన ప్రారంభం



విజయక్రాంతి, ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని హస్త కళలను, చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం, అభివృద్ధి పరచడంతో పాటు వాటి అమ్మకం ద్వారా రాష్ట్రంలో వివిధ హస్త కళలలో నైపుణ్యం గల సుమారు లక్ష మంది కళాకారుల సంక్షేమం కోసం పనిచేయడం సంస్థ ప్రాథమిక లక్ష్యమని గోల్కొండ క్రాఫ్ట్ బజార్ చైర్మన్ సంపత్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బ్యాంకు నాబార్డ్, నేషనల్ జ్యూట్ బోర్డుల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన గోల్కొండ క్రాఫ్ట్ బజార్ ఎగ్జిబిషన్‌ను బొల్లం సంపత్ కుమార్ గుప్తా, నాబార్డు సీజీఎం విజయ్ కుమార్, నేషనల్ జ్యూట్ బోర్డు మెంబర్ నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన ద్వారా తెలంగాణ హస్తకళలు, చేనేత వస్త్రాలతో పాటు ఇతర ప్రాంతాల కళాకారులు వారి ఉత్పత్తులను వస్తువులను వారే నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ క్రాఫ్ట్ బజార్ సంస్థ మేనేజర్ మహ్మద్ మసూద్ అలీతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్‌రావు

విజయక్రాంతి, ముషీరాబాద్: శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న టెక్నాలజీ, మార్పులను వ్యాపారులు, పరిశ్రమల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సూచించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని మాత డీజే ప్రెస్‌ను ఎమ్మెల్యే హరీష్ రావు, ముఠా గోపాల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ ప్రెస్‌కు చెందిన రమణారెడ్డి, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, శేఖర్ మాట్లాడుతూ తెలంగాణలో మొట్టమొదటిగా ఫోటో ఆల్బమ్స్ తయారీ మిషన్ అందుబాటులోకి తీసుకొచ్చామని ఈ మిషన్ ద్వారా తయారు చేసిన ఫోటో ఆల్బమ్ లైఫ్ టైం రెండు వందల సంవత్సరాలు ఉండటం దీని ప్రత్యేకత అని తెలిపారు.

నెహ్రూ యువకేంద్రాన్ని యువత ఉపయోగించుకోవాలి

- బీజేపీ కార్యవర్గ సభ్యులు జ్ఞానేంద్ర ప్రసాద్

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు జ్ఞానేంద్ర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం శేరిలింగంపల్లి చందానగర్‌లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిరుద్యోగ యువతను నెహ్రూ యువకేంద్రం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, వారికి కావాల్సిన రంగాల్లో శిక్షణనిచ్చి యువతను మంచి నైపుణ్యతగల వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తుందని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని కోరారు.

ఫ్యాషన్ రంగంలో నూతన మార్పులు

విజయక్రాంతి, సికింద్రాబాద్: ఫ్యాషన్ రంగంలో వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తార్నాకలోని ఆర్నిత ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ డైరెక్టర్ జెన్నీ పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాకలోని శిక్షణా కేంద్రంలో ఫ్యాషన్ డిజైన్స్ ఉత్పత్తులకు సంబంధించిన ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ డిజైన్ డైరెక్టర్ జెన్నీ మాట్లాడుతూ.. విద్యార్థులు పాట్ మేకింగ్, ఫ్యాబరిక్ పెయింటింగ్, ఆక్సిసరీ డిజైనింగ్, ఖాళీ బాటిల్స్ పైన డిజైన్లతో చేసిన వస్తువులను, వివిధ రకాల ఫ్యాషన్ దుస్తులను ఈ ప్రదర్శనలో పెట్టామని తెలిపారు. ఆర్నిత ఇన్స్టిట్యూట్ విద్యార్థులు శిక్షణ పొంది స్వంతంగా బోటిక్స్ పెట్టుకుని వారు తయారు చేసిన వస్తువులు, దుస్తులు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంధ్య, న్యూజెట్, శ్రీలక్ష్మి, మానస, అరుణ, సన్నీ, మౌనిక, శిల్ప తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ రెండవసారి విఫలమైతే ప్రజలు క్షమించరు: గూడూరు

విజయక్రాంతి, హైదరాబాద్: మొదటిసారి విఫలమైతే కేసీఆర్‌ను క్షమించి రెండవసారి అవకాశమిచ్చిన ప్రజలు ఈ సారి క్షమించరని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి హెచ్చరించారు. బీబీనగర్‌లో ఎయిమ్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను 2009లో కాంగ్రెస్ మంజూరు చేయడమే కాకుండా రూ.100 కోట్లను కూడా మంజూరు చేసిందన్నారు. 2014 నాటికి 160 ఎకరాల్లో విస్తరించిన 7 లక్షల చదరపు అడుగుల భవనాలు సిద్ధమయ్యాయన్నారు. ఇక్కడ ఆసుపత్రి అందుబాటులో రావడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. టీఆర్ఎస్ గాని, స్థానిక భువనగిరి ఎంపి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఈ దిశగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించలేకపోయిన కేసీఆర్ దేశాన్ని ఉద్ధరిస్తానని బయలుదేరుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

అవసరమైతే విలీన గ్రామాలకూ ఎన్నికలు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లోని వివిధ గ్రామాలను సమీపంలోని మున్సిపాల్టీలు/మున్సిపల్ కార్పొరేషన్లల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేసిన కేసును తెలంగాణ హైకోర్టు విచారించింది. దాదాపు 95కిపైగా నమోదు అయిన పలు కేసులు శుక్రవారం విచారణకు రాగానే ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని.. గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోరాదని, ఒకవేళ ఈ కేసులో కనుక హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తే విలీనం చేసిన గ్రామాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తే 21 రోజుల్లోగా విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ అదనపు ఏజీ రామచంద్రరావు హామీ ఇచ్చారు. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం రికార్డు చేసుకుంది. గ్రామాల విలీనాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.



ఆర్టీసీ నష్టాలకు.. సర్కారే కారణం

- టికెట్ ధరలు పెంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలి
- అధ్యయన కమిటీకి సంఘాల సూచనలు

విజయక్రాంతి, హైదరాబాద్: ఆర్టీసీ నష్టాలకు సర్కారు విధానాలే కారణం. పన్నుల భారం పెరిగిపోయింది. ఈ కారణంగా సంస్థపై అప్పుల భారం పెరిగింది. సర్కారు సహకరించి ఈ భారాన్ని తగ్గించినట్టయితే.. ఆర్టీసీ లాభాల్లోకి వస్తుంది.. అని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. దశాబ్దాల తరబడి ఆర్టీసీ నష్టాల్లో నడుస్తుండానికి కారణాలను అన్వేషించడానికి సర్కారు 9 మంది సభ్యులతో కూడిన ఒక అధ్యయన కమిటీని గతేడాది ఆగస్టులో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ కమిటీ పలుమార్లు గుర్తింపు సంఘం టీఎంయూతో చర్చలు జరపడంతోనే సరిపెట్టింది. ఇతర కార్మిక సంఘాలను పరిగణలోకి కూడా తీసుకోలేదు. ఈ అంశంపై అన్ని కార్మిక సంఘాలు తమ నిరసన వ్యక్తం చేయడంతో.. కార్మిక సంఘాలతో అధ్యయన కమిటీ శుక్రవారం ఎంజీబీఎస్‌లో వేర్వేరుగా సమావేశమైంది. సమావేశంలో నష్టాలు రావడానికి గల కారణాలను ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు వివరించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను అధ్యయన కమిటీకి కార్మిక సంఘాల ప్రతినిధులు అందించారు.

సర్కారు నుంచి సహకారం లేకపోవడం వల్ల దాదాపు రూ. 3 వేల కోట్ల అప్పులో సంస్థ నడుస్తోందని తెలిపారు. 2014 నాటికి ఆర్టీసీకి రూ. 2057 కోట్ల నష్టాల్లో ఉండగా.. 2018 నాటికి అది రూ. 2883 కోట్లకు పెరిగిందన్నారు. అయితే ఈ నాలుగేళ్లలో అసలు, వడ్డీ కలుపుకొని రూ. 2939 కోట్లను సంస్థ చెల్లించిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి నాటికి ఆర్టీసీకి సర్కారు రూ. 2208 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చెల్లించడం వల్ల సంస్థ కోసం చేసిన అప్పులకు వడ్డీ భారం పెరిగిపోయిందని వివరించారు. చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లించినట్టయితే.. అప్పుల నుంచి సంస్థకు విముక్తి లభిస్తుందని తెలిపారు. పక్క రాష్ట్రాల్లో రవాణా సంస్థలకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని, ఇక్కడ మాత్రం అది కొరవడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంస్థను ఆదుకోవడానికి బడ్జెట్‌లో 1 శాతం కేటాయించాలని కోరారు. ప్రధానంగా ఆర్టీసీపై పన్నుల భారం పెరిగిపోయిందని తెలిపారు.

వస్తున్న ఆదాయంలో 19.44 శాతం పన్నులుగా సంస్థ చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. వీటిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయివేటు వాహనాల కారణంగా సంస్థకు భారీగా నష్టం చేకూరుతోందని, వీటిని నియంత్రించడంలో అటు సర్కారు, ఇటు యాజమాన్యం పూర్తిగా విఫలయ్యాయని పేర్కొన్నారు. ప్రయివేటు వాహనాలను పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు నిర్వహించే బందేల కారణంగా బస్సులకు కలిగే నష్టాన్ని ఆయా సంస్థల నుంచి రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఏటా టికెట్ల రేట్లు పెంచుకునే అవకాశాన్ని సంస్థకు ఇవ్వాలన్నారు. కనీసం 5 నుంచి 6 శాతం టికెట్ల రేట్లను పెంచుకునే విధంగా ఉండాలని సూచించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న సర్వీసుల కారణంగా కలుగుతున్న నష్టాన్ని సర్కారే భరించాలని కోరారు. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి చేర్చడం ద్వారా డీజిల్ ధర తగ్గుతుందని, తద్వారా నష్టాలు తగ్గుతాయని తెలిపారు. పోలీస్ శాఖకు 11 వేలకు పైగా వాహనాలు కొనుగోలు చేయడానికి సాయం చేసిన సర్కారు.. ఆర్టీసీ విషయంలో మాత్రం చిన్నచూపు చూస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీకి కనీసం వెయ్యి బస్సులను కొనుగోలు చేయడానికి సహకారం అందించాలని కోరారు. రిక్రూట్‌మెంట్ విషయంలోనూ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవరిస్తోందన్నారు. 2014 నుంచి ఇప్పటివరకూ 5 వేల మంది కార్మికులు పదవీ విరమణ చేసినా భర్తీ మాత్రం చేయడం లేదన్నారు. అయినప్పటికీ.. కార్మికుల మాత్రం చిత్తశుద్ధితో విధులు నిర్వహించడం ద్వారా ఎక్కువ మందిని రవాణా చేసిన సంస్థగా నిలిచిందని చెప్పారు.

అధికారులకు లాగా కార్మికులకు అలవెన్సులు, వేతనాలు, సౌకర్యాలు లభించడం లేదని తెలిపారు. కార్మికులకు అత్యున్నత వైద్యం అందించే విధంగా ఆర్టీసీ ఆసుపత్రిని తీర్చిదిద్దాలని కోరారు. ఉద్యోగ భద్రతకు ఆటంకం కలగకుండా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సంస్థకు జోనల్, డివిజన్ వ్యవస్థలు భారంగా మారాయని, ఈ వ్యవస్థలను చేయడం ద్వారా రూ. 70 కోట్లు ఆదా అవుతాయని పేర్కొన్నాయి. సంస్థకు చెల్లించాల్సిన రాయితీలను ప్రతి నెల సర్కారు చెల్లించడం వల్ల అప్పులు తేవాల్సిన అవసరం ఉండదన్నారు. ఖాళీగా ఉన్న భవనాలు, స్థలాలను లీజు, లేదా అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి రిసెర్చ్, డెవలప్‌మెంట్ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కోరారు. తమ సలహాలు, సూచనలు, అభిప్రాయాలను సర్కారుకు పూర్తి స్థాయిలో నివేదిక రూపంలో అందించాలని అధ్యయన కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. సమావేశంలో అధ్యయన కమిటీ సభ్యులు నాగరాజు, హనుమంతరావు సహా తొమ్మిది మంది, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, అధ్యక్షుడు ఎస్ బాబు, కార్య నిర్వాహక అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ఎన్ఎంయూ చైర్మన్ నాగేశ్వరరావు, అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, అశోక్, ఎస్‌డబ్ల్యుఎస్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, పీఆర్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు..

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపించడానికి చర్యలు తీసుకోనుంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు, పక్క రాష్ట్రమైన ఏపీకి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్తారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా దాదాపు 1400 అదనపు సర్వీసులు నడిపించాలని ఆర్టీసీ చూస్తోంది. 11 నుంచి 13వ తేదీ వరకూ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రత్యేక చర్యలు తీసుకోనుంది.

అయ్యప్పను దర్శించుకున్న మూడో మహిళ

(మొదటి పేజీతరువాయి) గురువారం బంద్ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆ రాష్ట్ర పోలీసులు సుమారు 1369 మంది ఆందోళనకారులను అరెస్ట్ చేయడంతోపాటు 801 మందిపై కేసులు నమోదు చేశారు. 717 మందిని ముందస్తు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా శుక్రవారం ఉదయం మలబార్ దేవస్వామ్ బోర్డు సభ్యుడి ఇంటి వద్ద నాటు బాంబులు విసిరారు. పథానంతిట్ట ప్రాంతంలో కూడా అలాంటి బాంబులు పేలాయని, ఇలాంటి మరికొన్ని ఘటనలు జరిగాయని పోలీసులు తెలిపారు. కన్నూరులోని బీజేపీ కార్యాలయాన్ని తగలబెట్టారు. తిరువనంతపురం, పాలక్కాడ్, మలపురం, కన్నూర్, కోజికోడ్ తదిరత ప్రాంతాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీ ఛార్జీ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. పలు చోట్ల ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి.

రఫేల్‌తో మళ్లీ.. మోదీ అధికారంలోకి



(మొదటి పేజీతరువాయి) 2007లో రూ.526 కోట్లు కోట్ చేశారని, 2011లో కానీ, 2014లో కానీ అదే విధంగా ధర ఉంటుందా? అని నిలదీశారు. ధరల పెరుగుదల, ఎక్స్ఛేంజ్ రేట్ వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపారు. సాధారణ విమానం ధరను ఆయుధాలతో కూడిన అత్యాధునిక విమానం ధరతో పోల్చరాదని చెప్పారు. అయితే అప్పటి ధర రూ.526 కోట్లను రూ.737 కోట్లతో పోల్చవచ్చునన్నారు.

మరో పదినెలల్లో తొలి రఫేల్ విమానం ఇండియాకు..

భారత్ కొనుగోలు చేసిన తొలి రఫేల్ యుద్ధ విమానం 2019 సెప్టెంబరు నెలలో దేశానికి వస్తుందని, మిగిలిన ఎయిర్‌క్రాఫ్ట్స్ 2022 నాటి కల్లా అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారం పూర్తవడానికి 14నెలల సమయం పట్టిందన్నారు. డిఫెన్స్ డీలింగ్స్‌కు, డీలింగ్ ఇన్ డిఫెన్సుకు తేడా ఉందని వ్యాఖ్యానించారు. తాము డిఫెన్స్ డీలింగ్స్ చేయమని అన్నారు. దేశ భద్రతను, ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకునే ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు.

పొరుగుదేశాలైన చైనా, పాకిస్థాన్లు రక్షణ సంబంధ విషయాల్లో దూకుడుగా ఉంటే, అప్పట్లో యూపీఏ ప్రభుత్వం కేవలం 18 యుద్ధవిమానాలను మాత్రమే కొనుగోలు చేసి, భారత్‌ను ఎటూ కదల్లేని స్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో తగిన సామగ్రిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే దీన్ని అత్యవసరంగా గుర్తించామని తెలిపారు.

విపక్షంలో ఉన్నా దేశ భద్రత మరువరాదు: రక్షణ మంత్రి

ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో నిర్మలా సీతారామన్ వారికి గట్టిగానే చురకలంటించారు. తన సమాధానం వినేందుకు కూడా ప్రతిపక్ష సభ్యులు ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, యుద్ధ విమానాల కొనుగోలు దేశ భద్రతకు సంబంధించిన విషయమని అందరు గుర్తుంచుకోవాలన్నారు. అనిల్ అంబానీని ఉద్దేశిస్తూ ఏఏ కోసమే యుద్ధ విమానాల కొనుగోలు చేశామని కాంగ్రెస్ భావిస్తే, ప్రతి 'ఏఏ' వెనుక ఒక 'క్యూ (ఖత్రోకీని ఉద్దేశిస్తూ)', 'ఆర్వి(రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ)' ఉన్నారంటూ నిర్మలా సీతారామన్ విమర్శించారు.

రఫేల్ మీ హక్కు, దాన్ని మీరే తయారు చేయాలి' అని బెంగళూరు హెచ్ఏఎల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. హెచ్ఏఎల్‌కు ఎందుకు ఇవ్వలేదో రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని, హెచ్ఏఎల్ గొప్పలే కాదు, లోపాలనూ గుర్తించాలన్నారు. తేజస్ విషయంలో హెచ్ఏఎల్ వేగంగా పనిచేయలేదన్నారు. హెచ్ఏఎల్ విషయంలో కాంగ్రెస్ మొసలికన్నీరు కారుస్తోందని విమర్శించారు. తాము హెచ్ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఒప్పందాలు అప్పగించామన్నారు.

"రఫేల్ వ్యవహారంలో కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఈ వ్యవహారంపై ఆ పార్టీ చెప్పేవన్నీ అబద్ధాలే. జాతీయ భద్రతను కాంగ్రెస్ గాలికొదిలేసింది. ప్రధాని పట్ల అభ్యంతరకర పదజాలం వాడారు. వాయుసేన అధిపతిని సైతం అబద్ధాలకోరుగా చిత్రీకరిస్తున్నారు. మెక్రాన్తో రాహుల్‌గాంధీ మాట్లాడలేదని కాంగ్రెస్ చెప్పింది. మా హయాంలో హాల్ సామర్థ్యాన్ని మెరుగుపరిచాం. చాపర్ల కొనుగోలు సమయంలో హెచ్ఏఎల్ను పక్కన పెట్టారు. డసో, హెచ్ఏఎల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. హెచ్ఏఎల్ ఏడాదికి ఎనిమిది విమానాలకు మించి తయారు చేయలేదు. మీ హయాంలో హెచ్ఏఎల్ను పక్కన పెట్టి అగస్టాతో ఎందుకు ఒప్పందం చేసుకున్నారు." అని ప్రశ్నించారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు ఎన్ఐఏకు

- ఏపీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. విశాఖపట్నం విమానాశ్రయంలో జగ్న జరిగిన హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు అప్పగించినట్లు ఏపీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. డిసెంబర్ 31న ఈకేసును ఎన్ఐఏకి బదిలీ చేశామని, కేంద్ర ప్రభుత్వ హోం శాఖ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపింది ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్ ఖాన్ను నియమించినట్లు కూడా కేంద్రం హైకోర్టుకు తెలిపింది. కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా అమరావతిలోని ఏపీ హైకోర్టు శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ జగ్న జరిగిన హత్యాయత్నం కేసు శుక్రవారం ఏపీ హైకోర్టు విచారణకు వచ్చింది.

కేంద్రం సమాచారాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ ప్రవీణ్కుమార్తో కూడిన డివిజన్ బెంచ్ నమోదు చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

రక్షణశాఖకు చెందిన తూర్పు నావికాదళం పర్యవేక్షణలోని విశాఖపట్నం ఎయిర్పోర్టులోని వీఐపీ లాంజ్లో అక్టోబర్ 25న వైఎస్ జగన్మోహన్రెడ్డి హత్యాయత్నం జరిగింది. ఎయిర్పోర్టు వీఐపీ లాంజ్ వద్ద ఉన్న ఫ్యూజన్ఫుడ్స్ రెస్టారెంట్లో పనిచేసే శ్రీనివాసరావు అనే వ్యక్తి జగన్తో సెల్ఫీ తీసుకుంటామని చెప్పి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో జగన్ త్రుటిలో తప్పించుకున్నారు. విమానాశ్రయాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, అక్కడ జరిగే ఘటనలపై కేంద్రమే దర్యాప్తు చేయాలని, కాబట్టి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించాలని కోరుతూ వైఎస్ జగన్ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. కేంద్ర ప్రభుత్వ చట్టాల ప్రకారం హత్యాయత్నం కేసును ఎన్ఐఏకి బదిలీ చేయాలని మొదటి నుంచీ వైఎస్ జగన్ తరపు లాయర్ హైకోర్టులో వాదిస్తున్నారు. కేసు దర్యాప్తు ఆలస్యమైతే సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని, ఎన్ఐఏకి అప్పగించాలనే ప్రతిపాదనపై గతంలోనే హైదరాబాద్లోని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు కేంద్ర, రాష్ట్రాల వాదనలను విచారించింది. ఎయిర్పోర్టు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని కేంద్రం హైకోర్టుకు చెప్పింది. తాము చేస్తున్న దర్యాప్తు సక్రమంగానే సాగుతోందని ఏపీ ప్రభుత్వం చెప్పింది. దీనిపై జగన్ తరపు లాయర్ స్పందిస్తూ.. జగ్న హత్యాయత్నం జరిగిన గంటలోపే ఏపీ డీజీపీ విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కేవలం ప్రచారం కోసం శ్రీనివాసరావు చిన్న కత్తితో దాడి చేశారని తేల్చేశారన్న విషయాన్ని హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఘటన జరిగిన రోజునే ఏపీ సీఎం చంద్రబాబు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి.. కత్తితో దాడి రాజకీయమని, కేంద్రంజగన్ కలిసి ఆడుతున్న నాటకమని చెప్పడాన్ని కూడా జగన్ లాయర్ అప్పుడు హైకోర్టు దృష్టికి తెచ్చారు. అత్యున్నత పదవుల్లో ఉన్న సీఎం, డీజీపీలే కేసును నీరుగార్చేలా చెప్పారని, వారి నేతృత్వంలోని పోలీసుల దర్యాప్తు సజావుగా సాగబోదని, కేంద్ర హోం శాఖ ఆధీనంలోని ఎన్ఐఏతో దర్యాప్తునకు ఆదేశించాలని మొదటి నుంచి జగన్ హైకోర్టును కోరుతున్న నేపథ్యంలో శుక్రవారం కీలక ఆదేశాలు వెలువడ్డాయి.

కొండా దంపతులకు తాత్కాలిక ఊరట

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే దంపతులకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. కొండా మురళి, కొండా సురేఖలకు ఉన్న పోలీసు భద్రతను నాలుగు వారాల పాటు కొనసాగించాలని శుక్రవారం హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. కొండా మురళికి 2+3, కొండా సురేఖకు 2+2 భద్రతను యథాతథంగా కొనసాగించాలని న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు ఆదేశాలిచ్చారు. తమకు ఉన్న భద్రతను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భద్రత తగ్గిస్తే తమ ప్రాణాలకు ముప్పు ఉందని వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర ఆదేశాలు వెలువడ్డాయి. విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

13,487 జేఈ తదితర పోస్టులకు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల

విజయక్రాంతి, హైదరాబాద్ : రైల్వేలో జూనియర్ ఇంజనీర్లు తదితర 13,487 పోస్టుల భర్తీ కోసం ప్రకటన విడుదల చేసింది. పోస్టుల్లో జూనియర్ ఇంజనీర్లతో పాటు జూనియర్ ఇంజనీర్లు (ఐటి), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ (డీఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ (సిఎంఏ) పోస్టులున్నాయి. నియామకాల కోసం తొలి దశలో సీబీటీ ఉంటుందని, ఆ తర్వాత అభ్యర్థన పత్రాల పరిశీలన ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం చివరి తేదీ జనవరి 31గా నిర్ణయించారు. 7వ పే స్కేల్ ప్రకారం పోస్టుల స్కేలు రూ.35,400 నుంచి రూ.1,12,400 (లెవల్ –6) కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్.బి.ఐ) వెబ్‌సైట్ ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులు వివిధ రైల్వే జోన్లు, రాష్ట్రాలలో విస్తరించి ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు సమర్పించడానికి గుర్తింపు పొందిన విద్యా సంస్థలు జారీ చేసినవై ఉండాలి. రైల్వే శాఖ సూచించిన సబ్జెక్టుల్లో మూడేళ్ల డిప్లొమా లేదా వివిధ రకాల సబ్జెక్టులు కలిగిన ప్రాథమిక ఇంజనీరింగ్ డిప్లొమా కలిగి ఉండాలి. డిపో స్టోర్ సూపరింటెండెంట్ ఉద్యోగానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా విద్యా సంస్థ నుంచి ఏదైనా సబ్జెక్టులో 3 సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లొమా కలిగి ఉండాలి. ఇంజనీరింగ్ పట్టభద్రులు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూనియర్ ఇంజనీర్ (ఐటి) పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా విద్యా సంస్థ జారీ చేసిన ఏదైనా 3 సంవత్సరాల కోర్సు లేదా తత్సమానమైన పిజిడిసిఏ/బియస్సీ (కంప్యూటర్స్)/బి.టెక్ (కంప్యూటర్ సైన్స్)/డిఓఇఏసీసీ బి లెవల్ కోర్సు చేసి ఉండాలి. కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా విద్యా సంస్థ నుంచి కనీసం 45 శాతం మార్కులతో భౌతిక, రసాయన శాస్త్రాల్లో బ్యాచిలర్ డిగ్రీ, వివిధ ఉద్యోగాలకు వైద్య సంబంధ ప్రమాణాలు ఏ3, బి1, బి2, సి1 ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 18 సంవత్సరాల నుండి 33 సంవత్సరాల మధ్య ఉండాలి.

చేతులారా.. చేజార్చుకున్నాం



(మొదటి పేజీతరువాయి)
జహీరాబాద్, వరంగల్ ఎంపీ స్థానాల పరిధిలో చర్చించారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్.సీ.కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు సంబంధిత ఎంపీ స్థానం పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలతో పాటు రాబోయే పంచాయతీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలపై చర్చించారు. ఆలస్యంగా అభ్యర్థులను ప్రకటించడంతో పాటు ఓటర్ల గల్లంతు కూడా కారణమని పలువురు అభ్యర్థులు సమీక్షలో వెల్లడించినట్టు తెలుస్తుంది. ధర్మపురి లాంటి నియోజకవర్గాల్లో తక్కువ మార్జిన్‌తో ఓటమి పాలయ్యాయమని, ఎన్నిసార్లు కోరినప్పటికీ వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించలేదని తక్కువ మార్జిన్‌తో ఓడిపోయిన అభ్యర్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఇతర పార్టీలతో పొత్తుల్లో భాగంగా సీట్ల సర్దుబాటుపై జరిగిన సాగతీత కూడా ఇబ్బందికరంగా మారిందని, తమ నియోజకవర్గాలను మిత్రపక్షాలకు కేటాయిస్తారనే ప్రచారంతో చివరి వరకు టికెట్ల కోసం వేచి చూడాల్సి వచ్చిందన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా పోటీ చేస్తుందనే నియోజకవర్గాల్లో సైతం ఎవరికి టికెట్టు వస్తుందనే టెన్షన్ చివరి వరకు కొనసాగిందన్నారు. ఒకవైపు టీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ దాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోయామని పలువురు అభ్యర్థులు వాపోయినట్టు సమాచారం. వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపు తిరస్కారంపై ఖచ్చితంగా న్యాయపోరాటం చేయాలని పలువురు సూచించారు. రాబోయే పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా సాధ్యమైనంత ముందుగా అభ్యర్థులను ప్రకటిస్తే ఖచ్చితంగా గెలిచే అవకాశముందని పెద్దపల్లి ఎంపీ స్థానం పరిధిలో తక్కువ మెజారిటీతో ఓడిపోయిన ఒక అభ్యర్థి సూచించారు. మరో అభ్యర్థి తన టికెట్‌ను చివరి దశలో ప్రకటించడంతో కనీసం నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో తిరిగి ఓట్లడిగేందుకు కూడా సమయం సరిపోలేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చూడాలని వారు సూచించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని, అందుకు తగినట్టు పార్టీ ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వారు కోరారు.

తెలంగాణ గొంగడి గోస.. సర్కారుకు లేదు ధ్యాస..

- ఉన్ని మండలి (ఊల్ బోర్డు) ఉసురు తీసిన పాలకులు.
- చిత్తశుద్ధిలేక ఖాయిలా పడిన గొంగడి మిల్లులు.
- రోడ్డుపాలైన ఉన్ని కార్మికులు "కురుమ"లు.
- ఉన్నిగొర్ల లేమితో మరింత ప్రమాదంలో "జీవవైవిధ్యం"
- తెలంగాణ వచ్చినా బాగుపడని ఉన్ని పరిశ్రమ.
- సీఎం ఇలాఖాలోనే ఖాయిలా పడిన ఉన్ని మిల్లు..





విజయక్రాంతి, హైదరాబాద్: గ్రామీణ ఉపాధిలో ప్రధానమైన వృత్తిలో ఒకటిగా ఉన్న ఉన్నిపరిశ్రమ ప్రభుత్వాల అలసత్వంతో అడుగంటి పోయింది. ఉన్ని సంఘాలు ఖాయిలా పడ్డాయి. వ్యవసాయానుబంధ పరిశ్రమగా గ్రామీణ ప్రజల జీవనాధారంతో పాటు అక్కడి జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారింది. తెలంగాణకే ప్రత్యేకంగా నిలిచిన నల్లజాతి గొర్రెలు అంతరించటంతో వ్యవసాయానికి సేంద్రియ ఎరువు కరువవుతూ రసాయన ఎరువులు పెరుగుతూ సమాజాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్లింది. తెలంగాణ వస్తే పరిస్థితి మారుతుందనుకున్న తెలంగాణ సమాజానికి నిరాశే ఎదురువుతోంది.

కేవలం ఉపాధిగానే కాకుండా ప్రకృతి సమతుల్యాన్ని కాపాడే వృత్తిగా సామాజిక వేత్తలు ఉన్ని పరిశ్రమను గుర్తించి మరోసారి దీన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని ప్రజలకు చాటుతున్నారు. ఇందులో భాగంగా దక్కనీ గొర్రెల పెంపకం దారుల సంఘంగా ఏర్పడి గత కొన్నేళ్లుగా ఒంటరి పోరాటం చేస్తున్నారు. ప్రతియేటా ప్రదర్శనలతో ఉన్నిపరిశ్రమ, నల్లగొర్రెల ప్రత్యేకతను వివరిస్తున్నారు. ప్రతి సభలో గొంగడిని కప్పుకొని, గొర్రెపిల్లను పట్టుకొని ఫోటోలకు ఫోజులిస్తున్న పాలకులకు, నేతలకు మాత్రం ఈ గోడు చెవికెక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎప్పటిలాగా ఓ స్వచ్ఛందసంస్థ దారం వేదికగా మరోసారి ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఖాయిలా పడిన ఉన్ని పరిశ్రమ

తెలంగాణ పది జిల్లాల్లో దాదాపు 600 ఉన్ని సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలు గొంగడి నేతను ప్రోత్సహిచటంతో పాటు, ఉన్ని, గొంగడి మిల్లులకు ఉన్నిని సరఫరా చేసేవి. ఒక్కో సంఘంలో సుమారు 500 నుంచి 1000 మంది సభ్యులున్నారు. ప్రత్యక్షంగా ఒకటి నుంచి ఐదు లక్షల మంది, పరోక్షంగా మరో ఐదు లక్షలమంది మొత్తం పది లక్షల కుటుంబాలు ఆర్థికంగా భరోసా పొందేవి. వరంగల్, మెదక్, నల్గొండలో గ్రామీణ ప్రజలకు ఉపాధిని అందించాయి. కాలానికి తగిన విధంగా వాటిని ఆధరించక పోవటంతో అవిక్రమంగా ఖాయిలా పడ్డాయి. ప్రస్తుతం జోగిపేటలో ఉన్ని మిల్లులో మాత్రమే పని జరుగుతుండగా మిగతావన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. దాంతో గ్రామీణ యువత కొన్నాళ్లుగా ఉపాధికి దూరమై వలసబాట పడుతున్నారు.

ప్రమాదంలో జీవ వైవిధ్యం

ఈ ఉన్నిని అందించే గొర్రెలతో సేంద్రియ ఎరువు, మాంసం ఉత్పత్తులు అదనంగా ఉండేవి. సేంద్రియ ఎరువుతో రసాయనాల ఎరువుల వాడకం అదుపులో ఉండేది. ఈ పరిశ్రమను ప్రభుత్వాలు చిన్నచూపు చూడటంతో మొత్తం జీవ వైవిధ్యమే ప్రమాదంలో పడిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిశ్రమలో ఒక శిక్షణా కేంద్రంతో పాటు 10 ఉన్ని మిల్లులు ఉన్నాయి. మహబూబ్ నగర్,

సీఎం ఇలాకా గజ్వేల్‌లో ఖాయిలా పడిన ఉన్నిమిల్లు

తాజాగా తెలంగాణ ప్రభుత్వంతో దాదాపు రూ.4 వేల కోట్లతో చేపట్టిన గొర్రెల పంపిణీలో ఉన్నిజాతిగొర్లు లేకపోవటం ఉన్నిపరిశ్రమపై ఆధారపడిన కురుమలను నిరాశపరుస్తోంది. గతంలో సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ ఉన్నిపరిశ్రమలో ముందంజలో ఉండేది. ఇక్కడ మిల్లులో తయారైన రగ్గులు (మరమగ్గాల నేత గొంగడి) జైళ్ల శాఖ, రక్షణ శాఖకు అందించేది. అక్కడి నుంచి రెండుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీఎం కేసీఆర్ ఈసారైనా దాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కురుమలు కోరుతున్నారు.

కబ్జాలు, కాలుష్యంతో కనుమరుగైన గడ్డిభూములు: షేక్

గ్రామాల్లో అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసంతో కాలుష్య పరిశ్రమలు వచ్చాయి. పత్తిపంటల విస్తీర్ణం వెర్రితలలు వేస్తోంది. వాటికోసం వాడే పురుగు మందులు, పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో గడ్డభూములు విషతుల్యంగా మారి కోలుకోని రోగాలు సోకి చాలా దక్కనీ జాతిగొర్రెలు అంతిరించిపోయాయి. మరోవైపు బంజరు భూములు, గుట్టలు కబ్జాల పాలయ్యాయి. ఈ పరిణామాలను అడ్డుకొని పర్యావరణ సమతుల్యానికి తగిన విధానాలు రూపొందించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి.

నెల్లూరు గొర్లతో అంతరించిపోయిన దక్కనీ గొర్లు–యాదగిరి

తెలంగాణ పరిస్థితులకు భిన్నంగా 2017 నుంచి నెల్లూరు జాతి గొర్రెల పంపిణీతో పాలకులు ఈ పరిశ్రమను మరింత కుంగదీశారు. అప్పటి వరకు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న ఉన్ని పరిశ్రమ ఈ నిర్ణయంతో కోమాలోకి జారుకుంది. ఉన్ని ఉత్పత్తి తగ్గిందన్న నెపంతో ఉన్ని మండలిని, చేనేత ఆప్కోనుంచి రద్దు చేయటంతో జాతీయ ఉన్ని మండలి నిధులు, పథకాలు ఉన్నికార్మికులకు దూరమయ్యాయి.

ప్రభుత్వాలు ఆదుకోవాలి–సామాజిక ఉద్యమకారిణి సాగరి

ప్రభుత్వాల తప్పిదాలతో ప్రజల ఆహారసార్వభౌమత్వం దెబ్బతింటోంది. దీనితో అనుబంధమైన దక్కనీ గొర్లు, ఉన్ని పరిశ్రమపై తాము అధ్యయనం చేశాము. ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన ఉన్ని పరిశ్రమను కాపాడుకోవాలసిన అవసరం ఉంది. మెదక్ జిల్లా ఇప్పుడు మెదక్ జిల్లా మంజీరానది పరివాహక ప్రాంతం నర్సాపూర్ అటవీ పరిసరాల్లోని కొన్ని గ్రామాల్లో 600 కుటుంబాలు మాత్రమే ఈ పరిశ్రమను కాపాడుతున్నాయి. ప్రభుత్వం ఆదుకొని రాష్ట్రమంతా ఈ జాతి గొర్లను విస్తరింపచేసి ఉన్ని పరిశ్రమకి జీవం పోయాలి. ఆ దిశగా ప్రభుత్వం విధానాలు రూపొందించాలి.

నేటి నుంచి నగరంలో గొంగడి ప్రదర్శన

ఈ నెల 5, 6 తేదీల్లో రెండు రోజుల పాటు నగరంలో బేగంపేటలో చేనేత ఎన్జీవో "దారం" గొంగడి పరిశ్రమకు వేదిక కానుంది. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని దక్కనీ గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం ప్రతినిధులు సాగరి, షేక్, యాదగిరి తెలిపారు.

వైభవంగా శ్రీవారి 'పుష్పయాగం'

విజయక్రాంతి, కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలోని ప్రాచీన ఆలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా శుక్రవారం వైభవంగా శ్రీవారికి 'పుష్పయాగం' జరిపారు. ఈ సందర్భంగా శ్రీవారు, దేవేరుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధానార్చకులు బీర్నంది లక్ష్మీనర్సింహా చారి నేతృత్వంలో శాస్త్రోక్తంగా అభిషేకార్చనలు జరిపి, పలు రకాల పుష్పాలతో సామూహిక లక్ష పుష్పార్చన నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన, బల్దియా చైర్మన్ శీలం వేణుగోపాల్ సతీమణి జయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో నిర్వాహకులు తమసుల రాజశేఖర్, కోటగిరి నరేశ్, బొమ్మ రాజేశం, రాచకొండ నరేశ్, జిల్లా శ్రీనివాస్, చింత శ్రీరాం, చింతకింది దాము, ఆలయ సిబ్బంది పి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐరిష్‌తోనే వందశాతం పారదర్శకత!

- జిల్లాలోని 343 చౌకధర దుకాణాల్లో ఐరిష్ విధానం అమలు
- రేషన్ పంపిణీని పరిశీలించిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

విజయక్రాంతి, సిరిసిల్ల: కంటిపాపు (ఐరిష్) ఆధారంగా రేషన్ సరుకుల పంపిణీతో వందశాతం పారదర్శకత సాధ్యపడుతుందని, అర్హులకే నిత్యావసర సరుకులు అందుతాయని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2017 నుండి బయోమెట్రిక్ ఆధారిత ఈపాస్ విధానంలో రేషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈపాస్ విధానంలో వేలిముద్ర వేస్తేనే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఇచ్చే పద్ధతి ఉండటంతో వేలిముద్రలు అరిగిన వృద్ధులు, శ్రామికులు కొన్ని దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి సరుకులు తీసుకోలేని పరిస్థితి నెలకొందని దీనికి సైతం పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం కంటిపాపు ఆధారంగా సరుకుల అందించే ఐరిస్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని 344 చౌకధర దుకాణాల్లో ఐరిస్ విధానంను జనవరి 1 నుంచి అమలు చేస్తున్నామన్నారు. కాగా ఐరిస్ ప్రక్రియ అమలు తీరును జిల్లాలో పరిశీలించేందుకు అకున్ సబర్వాల్ జిల్లాలో పర్యటించారు. ఐరిస్ అమలు తీరు జిల్లాలో బాగుందని జెసి, పౌర సరఫరాల అధికారులను కమిషనర్ అభినందించారు. పౌరసరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జెసి యాస్మిన్ బాషా మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంతో రేషన్ ఇవ్వలేని లబ్ధిదారులకు ఐరిస్ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదే విధంగా జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించామన్నారు. ఖరీఫ్ మొత్తం 1,12,000 ఎంటి ధాన్యం వస్తుందని అంచనా వేయగా లక్షా 43వేల ఎంటి ధాన్యం ఉత్పత్తి అయిందన్నారు. ఈ మొత్తం ధాన్యంను జిల్లాలోని 31వేయి 500 రైతుల నుండి సేకరించామన్నారు. ధాన్యం ప్రక్రియ సజావుగా నిర్వహించినందుకు కమిషనర్ ప్రశంసించారు. అనంతరం కమిషనర్ అకున్ సబర్వాల్ కలెక్టర్ కార్యాలయానికి రాగా ఎస్పీ రాహుల్ హెగ్డే శిక్షణ కలెక్టర్ రాహుల్ శర్మ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఆయన వెంట పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి శ్రీకాంత్, రెవెన్యూ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తికి హాని కల్గించే చట్టాలను రద్దు చేయాలి

- ఐఎంఏ సభ్యుల డిమాండ్

విజయక్రాంతి, మిర్యాలగూడ: కన్‌జ్యూమర్ ప్రొటక్షన్ బిల్లు 2018 పేరుతో ప్రభుత్వం వైద్యులను బ్లాక్‌మెయిల్ చేస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షులు, వైద్యులు శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఐఎంఏ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 1986లో ఏర్పాటు చేసిన కన్‌జ్యూమర్ ప్రొటక్షన్ యాక్ట్‌లో వైద్య నిపుణులను సభ్యులుగా చేర్చినప్పటికీ కొన్ని సవరణలతో 20 డిసెంబర్ 2018 లోక్‌సభ ప్రవేశపెట్టిన సీపీఏ బిల్లులో వైద్యులకు వ్యతిరేకమైన అంశాలను చేర్చారన్నారు. జిల్లాస్థాయి కన్‌జ్యూమర్ ఫోరంలో పరిహారాన్ని రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకూ పెంచారని, రాష్ట్రస్థాయిలో రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకూ పెంచినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం కన్‌జ్యూమర్ కమిషన్‌లో జ్యుడీషియల్ సభ్యులను కూడా చేర్చలేదని వాపోయారు. రోగి కాకుండా అతని బంధువులు సైతం కన్‌జ్యూమర్ ఫోరంలో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని కల్పించిందన్నారు. వైద్య నిపుణులకు తావు లేకుండా ప్రభుత్వం కన్‌జ్యూమర్ కమిషన్ సభ్యులను నియమించడంతో ప్రభుత్వం డాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసేవిధంగా ఉందన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు, వైద్యులు జాడి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కన్‌జ్యూమర్ ప్రొటక్షన్ బిల్లుతో సాధారణ జబ్బుల వైద్యం కోసం వచ్చే రోగులకు కిడ్నీ, బీపీ, షుగర్, రక్త పరీక్షలతో పాటు, తదితర పరీక్షలు జరిపిన తర్వాతనే చికిత్స చేయాలనే నిబంధన ఉందని, దీంతో పేద, మధ్యతరగతి రోగులపై ఆర్థికభారం పడే అవకాశముందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులను పటిష్ట పర్చే విధంగా ప్రభుత్వ నిర్ణయాలున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వైద్యవృత్తికి హాని కల్గించే జీవోలను రద్దుపర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి, వైద్యులు మాధవ్‌కుమార్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

- ఎంపీడీవో ఆర్.మమతాబాయి వెల్లడి

విజయక్రాంతి, దేవరకొండ: స్థానిక ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణకు క్లస్టర్ల ఏర్పాట్లు జరిగాయని ఎంపీడీవో ఆర్.మమతాబాయి అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయ సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలో నామినేషన్ పత్రాల స్వీకరణకు 9 క్లస్టర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని ఒక క్లస్టర్‌కి 4 గ్రామ పంచాయతీలను నామినేషన్ కోసం కేటాయించడం జరిగిందన్నారు. అవి గొడకొండ్ల క్లస్టర్‌కు గొడకొండ్ల, పాల్యంతండా, బోటిమీది తండా, రోటిగడ్డ తండా, రెండో క్లస్టర్ పోలేపల్లి రాంనగర్, మదనాపురం, చాకలి, శేరిపల్లి, ఉమ్మాపురం,మూడవ క్లస్టర్ కుర్మేడు, తకళ్ళపల్లి, గొళ్ళపల్లి, ప్రశాంతపూరి తండా, నాల్గవ క్లస్టర్ కుర్మపల్లికి కుర్మపల్లి, ఎంమల్లేపల్లి, సాయిరెడ్డి గూడెం, పి.కెమల్లేపల్లి, ఐదవ క్లస్టర్ వింజమూర్‌కు, వింజమూర్, ధైర్యపురి తండా, కిష్టరాయినిపల్లి,రాయినిగూడెం,ఆరవ క్లస్టర్ చింతపల్లికి, చింతపల్లి, వర్కాల, నసర్లపల్లి, ఏడవ క్లస్టర్‌కి ఘడియ గౌరారంకు, ఘడియ గౌరారం, ఉప్పరపల్లి, హరిజనా పురం, ఎనిమిదల క్లస్టర్ తీదేడుకు, తీదేడు, దేన్యతండా, నెల్వలపల్లి, తిరుమలాపురం, తొమ్మిదవ క్లస్టర్ మల్లారెడ్డిపల్లికి, మల్లారెడ్డిపల్లి, బోత్యతండా, హోమంతాలపల్లి, జర్పుల తండాగ్రామాలను కేటాయించడం జరిగింది. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎస్సీ , ఎస్టీ, బీసీ అభ్యర్థులు వార్డు సభ్యుల పదవికి నామినేషన్ కోసం 250రూ॥ ఇతరులు 500రూ॥లు సర్పంచ్ పదవికి పోటీ చేయు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు 1000రూ॥ ఇతరులు 2000రూ॥ ధరావత్ చెల్లించాలని ఎంపీడీవో తెలిపారు.



కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

- కార్మిక సంఘాల పిలుపు

విజయక్రాంతి, హుజూర్‌నగర్: దేశ ప్రజల కార్మిక,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై దేశ వ్యాప్తంగా జనవరి నెల 8,9వ తేదీలలో సార్వత్రిక సమ్మె జరపాలని కార్మిక వర్గం పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి,సిఐటియు,ఐఫ్‌టియు,టిఆర్‌ఎస్‌కెయు, టిఎన్‌టియుసి ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో స్థానిక వర్తకసంఘం భవనంలో భారీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి యాదగిరి రావు,ఐఫ్‌టియు జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు, తదితర నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు అనుకూలంగా చట్టాలు చేస్తూ కార్మిక హక్కులను హరించివేస్తుందని, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు,మన హక్కుల సాధన కోసం ఈనెల 8,9వ తేదీలలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు బెల్లంకొండ గురవయ్య,పాశం రామరాజు,మేళ్ళచెరువు ముక్కంటి, రామూర్తి, సావిత్రి, ముస్తఫా, నర్సింహరావు, సిఐటియు నాయకులు యల్క సోమయ్య గౌడ్,మల్లయ్య, శివకృష్ణ, ఐఫ్‌టియు నాయకులు నర్సింహరావు, గురవయ్య, విజయ్, టిఎన్‌టియుసి నాయకులు పండ్ల హుస్సేన్, అంజి, టిఆర్‌ఎస్‌కెయు నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం

- పట్టుబడుతున్నా.. పట్టువదలని అక్రమార్కులు..



విజయక్రాంతి, పెద్దపల్లి: పేదలు, సామాన్య కుటుంబాలకోసం పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం అక్రమ రవాణా ఇటీవలి కాలంలో జోరందుకుంది. పక్కాసమాచారం ఉంటేనే బియ్యం రవాణాకు అడ్డుకట్ట పడుతోంది. క్షేత్రస్థాయిలో సబ్సిడీ బియ్యం అక్రమ వ్యాపారానికి నియంత్రణ లేకపోవడం వల్ల అక్రమార్కుల దందాలకు అడ్డుకట్ట పడటంలేదు. గ్రామాల నుండి సేకరించే బియ్యం టన్నులకొద్ది ప్రతీరోజు రాష్ట్ర సరిహద్దులు దాటి పోతోంది. లారీల ద్వారా దర్జాగా రాత్రిపూట బియ్యం రవాణ అవుతున్నా నియంత్రించే అధికార యంత్రాంగానికి పక్కా సమాచారం ఉంటే తప్ప పట్టుబడటం లేదు. పలు చోట్ల చెక్ పోస్టులు ఉన్నపపటికీ, పోలీస్ వాహనాల పెట్రోలింగ్ జరుగుతున్నప్పటికి బియ్యం రవాణాకు బ్రేకులు పడటం లేదు. లబ్ధిదారునికి కిలోకు రూ.1కి లభించే బియ్యం మధ్య దళారులు రూ. 8నుండి 9వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. వీటిని దళారులు తిరిగి రూ. 10నుండి 13వరకు బడావ్యాపారులకు విక్రయిస్తున్నారు. తాజాగా పెద్దపల్లి సమీపంలోని బందంపల్లి వద్ద బీయ్యం లారీని పోలీసులు పట్టుకున్నారు. సుమారు 5.40లక్షల విలువ చేసే 210క్వింటాళ్ళ ప్రజాపంపిణి బియ్యాన్ని పోలీసులు పట్టుకుని బాద్యులైన వ్యక్తులను అరెస్టుచేశారు. కొద్దిరోజుల క్రితం కూడా కాల్వశ్రీరాంపూర్ నుండి మాహా రాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న 100క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గత డిసెంబర్ 18న సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి వద్ద మహరాష్ట్రకు తరలిస్తున్న 250 క్వింటాళ్ళ బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేశారు.

రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్..

సబ్సిడి బియ్యంను కొనుగోలు చేస్తున్న బడా వ్యాపారులు ఈ బియ్యాన్ని తిరిగి రైస్ మిల్లులకు చేరవేస్తున్నారు. పలు మిల్లుల్లో రీ సైక్లింగ్ చేసిన అనంతరం ఇవే బియ్యాన్ని కస్టంమిల్లింగ్ కింద తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. మహారాష్ట్రలో సబ్సిడి బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల ఆరాష్ట్రానికి ఎక్కువగా రవాణాచేయడం జరుగుతోంది. గతంలో పట్టుబడిన అక్రమార్కులే ఈ దందాను తిరిగి నడిపిస్తున్నారు. కేసులు మాత్రం ప్రత్యక్షంగా పట్టుబడిన వారి పైనే నిలబడుతున్నాయి. తెరవెనుక దందాలు నడిపించేవారు తప్పించుకు పోతున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. పోలీసు అధికారులు బియ్యాన్ని పట్టుకున్న ప్రతీసారి అక్రమ వ్యాపారులపై పీడీయాక్ట్ కేసులు పెడుతామని ప్రకటిస్తున్నప్పటికి అక్రమరవాణా ఆగటం లేదు.

భక్తాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న శ్రీధర్‌బాబు

విజయక్రాంతి, మంథని: మంథని నియోజకవర్గం పరిధిలోని కాటారం మండలం గంగారం గ్రామంలో శుక్రవారం శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథనికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పౌనూర్ రమేష్ శర్మ వీణ దంపతులు ఈ దేవాలయాన్ని పునః నిర్మించగా, శుక్రవారం వేద పండితుల మంత్రోత్సవాల మధ్య ఆలయ మహా సంప్రోక్షణ చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పారిశ్రామికవేత్త డాక్టర్ రమేష్‌ను కొరగా, పరిశ్రమల స్థాపన ముందడగు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంభట్ల శ్రీనివాస్, కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముపూరి ప్రభాకర్‌రెడ్డి, బండం వసంతరెడ్డి, గట్టు నాగయ్య, సుగుణ, రాజేశ్వర్‌రావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ డి. అమయ్ కుమార్

విజయక్రాంతి, సూర్యాపేట: జిల్లాలో సాగు నీరు, జాతీయ రహదారుల విస్తరనకు అవసరమున్న భూములను గుర్తించి అట్టి భూముల సేకరణకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలసిందిగా జిల్లా కలెక్టర్ డి. అమయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రహదారుల, దేవాదుల యసార్ఎస్పీ ఇంజినీర్లు మరియు రెవెన్యూ, అధికారులతో జిల్లా సంయుక్త కలెక్టర్ డి. సంజీవ రెడ్డితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దేవాదుల మరియు యస్ఆర్ఎస్పీ కాలువల నిర్మాణాలకు, జాతీయ రహదారుల విస్తీర్ణ పనులకు ఇప్పటికే సేకరిచిన భూములను వెంటనే ఆయా శాఖలకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే పై అవసరాలకు ఇంకా అవసరమున్న భూములకు సంబంధించి బిడ్లు పిలిచి అంచ నాలు రూపొందించి రెవిన్యూ అధికారులకు అప్పగించాలని, సంబంధిత శాఖల ఇంజనీర్లను ఆదేశించారు. అంతేగాక అదనముగా అవసరమున్న భూములకు వచ్చే ప్రతిపాదనలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసిందిగా సూర్యాపేట, మరియు కోదాడ ఆర్‌డిఓ లను కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పి. చంద్రయ్య, సూర్యాపేట, కోదాడ ఆర్.డి.ఓ ఎస్. మోహన్‌రావు, యల్. కిశోర్‌కుమార్, ఏడి లాండ్, సర్వేయర్ శ్రీనివాసులు, యస్ఆర్ఎస్పీ, దేవాదుల, జాతీయ రహదారుల ఇఇలు, డిఇలు, ఏఇలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ సమావేశం రసాభస

విజయక్రాంతి, అశ్వారావుపేట: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించే విధంగా ప్రణాళిక రచించేందుకు శుక్రవారం ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ మండల సమావేశం రసాభసగా ముగిసింది. స్థానిక శ్రీ సత్యసాయి కళ్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షులు బండి పుల్లారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ పొంగులేటి వర్గీయుల మధ్య విబేధాలు రచ్చకెక్కాయి. నియోజకవ్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లును తప్పించాలంటూ ఎంపీ వర్గీయులు డిమాండ్ చేశారు. ఆయన వ్యక్తిగత వ్యవహార శైలి కారణంగానే నియోజకవర్గంలో టీఆర్ఎస్ ఓటమి పాలైందని, కానీ ఎంపీ పొంగులేటిపై అసత్య ఆరోపణలు చేయటం సరికాదని అన్నారు.

'తాటి' వల్లనే పార్టీకి నష్టం జరుగుతోందని, కావున ఆయనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించటం సరికాదంటూ తేల్చి చెప్పారు. తాను పార్టీలోనే ఉంటాయని, కానీ 'తాటి' పార్టీలో ఉన్నంత కాలం ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనలేనని పేర్కొన్నారు. ఈ నేపద్యంలో తుమ్మల, పొంగులేటి వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ పర్యవసానంతో ఆందోళనకు గురైన ఎంపీ పొంగులేటి ప్రధాన అనుచరుడు జూపల్లి రమేష్ సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. దీనితో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

మిషన్ భగీరథ పైపులైన్ లీకు

- వృథాగా పోతున్న నీరు..
- పట్టించుకోని అధికారులు

విజయక్రాంతి, అశ్వారావుపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ పథకం ప్రారంభానికి ముందే లీకుల పాలవుతోంది. దీనితో నీరు వృథాగా పోతోంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వం నిర్మిస్తున్న మిషన్ భగీరథ పైపు లైన్ నిర్మాణ పనులు అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి శుక్రవారం చేరాయి. పనులు జరుగుతుండగానే పైప్ లైన్ లీకైంది. వృధా నీరంతా సమీప ఇళ్ళల్లోకి చేరింది. దీనితో గ్రామంలోని ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రూ.కోట్లతో నిర్మిస్తున్న మిషన్ భగీరధ పనులు మధ్యలోనే దెబ్బతినటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును ప్రభుత్వం నాసిరకం పనులతో దుర్వినియోగానికి పాల్పడుతుందంటూ మండిపడుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా కనీసం స్పందించటం లేదని పెదవి విరుస్తున్నారు. వృథా నీరు ఇళ్ళలోకి చేరి బురదగా మారుతుందని వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మిని వివరణ కోరేందుకు 'విజయక్రాంతి' ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు.



న్యూ డెమోక్రసీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అరెస్ట్

విజయక్రాంతి, ఇల్లందు: సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ (చంద్రన్న వర్గం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, అజ్ఞాత దళనేత రామన్న అలియాస్ సింగరబోయిన రాము అరెస్ట్ అయ్యాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఎన్నారం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున మహబూబాబాద్ పోలీసులు అరెస్టు చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సమావేశాలు, ఇతర పనుల కోసం వచ్చి, రామన్న ఎన్నారం గ్రామంలో ఒకరి ఇంటి వద్ద షెల్టర్ తీసుకున్నారు.

కాగా పక్కా సమాచారం అందుకున్న మహబూబాబాద్ పోలీసులు వ్యూహాత్మకంగా వల పన్ని షెల్టర్ తీసుకున్న ఇంటిపై దాడిచేసి ఆయనను అరెస్టు చేసినట్లు తెలిసింది. రామన్నతో పాటు మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామన్న భార్య సింగరబోయిన సునీత, ఆయన బంధువులు అదే ఎన్నారం గ్రామానికి చెందిన మల్లెబోయిన రాములు, ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామానికి చెందిన నాగేశ్వరరావులను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామన్నను పోలీసులు అరెస్టు చేయడం పట్ల ఆ పార్టీ వర్గాలు ఖండించాయి. వెంటనే రామన్నకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలని వారు పోలీసులను వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయనతో పాటు అరెస్టు చేసిన రామన్న భార్య సునీత, బంధులు రాములు, నాగేశ్వరావులను బేషరతుగా విడుదల చేయాలని పార్టీ డిమాండ్ చేసింది.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- విక్రయదారులపై రూ.50వేలు జరిమాన

విజయక్రాంతి, దేవరకొండ: చింతపల్లి మండలం వింజమూరు తండాకు చెందిన వాంకుడోతు జాను(32)మరియు వాంకుడోతు అంజి (46) అనే ఇద్దరిని గతంలో సత్‌ప్రవర్తన నిమిత్తమై చింతపల్లి తహశీల్దారు ముందు బైండోవర్ చేయడం జరిగింది. కాగా సదరు నిందితులు తిరిగి ఎక్సైజ్ నేరము చేస్తూ పట్టు బడడంతో తిరిగివారిని తహశీల్దారు ముందు హాజరుపరుచగా జైలుకు వెళ్లడానికి నిరాకరించి చెరో రూ.25వేలు జరిమానాను శుక్రవారం చలానా రూపంలో చెల్లించడం జరిగిందని ఎక్సైజ్ సిఐ మాధవయ్య తెలిపారు. సిఐ మాట్లాడుతూ సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఈదాడుల్లో నల్గొండ టాస్క్‌ఫోర్స్ సిఐ రాజ్యలక్ష్మి, నాంపల్లి ఎస్ఐ జయసుధ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకన్న

విజయక్రాంతి, మిర్యాలగూడ: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గునగంటి వెంకన్నగౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పాలకులు అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాల వల్ల అన్ని రంగాల్లో బీసీలు నేటికీ వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. సంఘం పటిష్టతతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రస్తుత జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల సైదులుగౌడ్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి భాస్కర్, పట్టణాధ్యక్షులు శివరామకృష్ణ, కొండలు, విష్ణు, బొంగరాల వెంకటయ్య, మోహన్‌లాల్, రవి, రషీద్ పాల్గొన్నారు.

ఓటర్ల ప్రసన్నం కోసం అభ్యర్థుల తంటాలు

- గ్రామాల్లో మొదలైన ఎన్నికల కోలాహలం..

విజయక్రాంతి, వేములవాడ: పల్లెల్లో సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు తేదీలు ఖరారు కావడంతో స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఇప్పటి నుంచే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా కుల సంఘాల ఓటర్లకు ప్రసన్నం చేసుకునేందుకు పెద్ద మనుషులతో మంతనాలు జరుపుతున్నారు. అంతేకాకుండా ఆయా పార్టీల నాయకులు తాము బలపరిచే అభ్యర్థులను గెలిపించుకునేందుకు గ్రామాల్లో ఇప్పటి నుండే పచారాలు జరుపుతున్నారు. జరిగిన శాసన సభ ఎన్నికల్లో అంతటా టీఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేయగా, అదే జోరులో స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కుల సంఘాల ఓటర్ల కోసం తంటాలు..

వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సర్పంచ్ స్థానాలను ఎక్కువగా దక్కించుకునేందుకు ఆయా రాజకీయ పార్టీల నేతలు సిద్దమవుతున్నారు. ఇప్పటికై గ్రామాల్లో ప్రజాదరణ ఉండి, పలుబడి ఉన్న వ్యక్తుల వివరాల సేకరణలో పడ్డారు. అంతేకాకుండా ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో పోటిలో నిలిచే ఆశావహులు కుల సంఘాల పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. కుల సంఘాల ఓట్లు తమకే పడేలా ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవంగా కుల సంఘా నాయకులు మద్దతు ప్రకటిస్తున్నారు.



అన్నిచోట్ల ఫోన్ల చార్జింగ్ మంచిది కాదు

మీ స్మార్ట్ ఫోన్లను ఎక్కడపడితే అక్కడ చార్జింగ్ చేసుకుంటుంటే మీరు కష్టాలను కోరి తెచ్చుకున్నట్లే. ముఖ్యంగా ఎయిర్ పోర్టులు, రైల్వే, బస్ స్టేషన్లతోపాటు చాలా షాపింగ్ మాళ్లలో ఉండే స్మార్ట్‌ఫోన్ చార్జింగ్ స్టేషన్లలో చార్జింగ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీలయినంత వరకు ఇలాంటి చోట్ల చార్జింగ్ చేయకపోవటమే మంచిది. హ్యాకర్లు అక్కడి యూఎస్బీ పోర్టులను మార్చేస్తారు. ఆ పోర్టుకు ఫోన్లు, ల్యాప్‌టాప్ కనెక్ట్ చేస్తే గాడ్జెట్లు చార్జ్ అవుతాయి, అయితే, అదే సమయంలో వాటిలోని వివరాలను హ్యాక్ చేసేస్తారు. హ్యాకర్లు మార్చేసిన యూఎస్బీ పోర్టులోనే సమాచారాన్ని తస్కరించేందుకు, స్టోర్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉంటాయి. లేదంటే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లోకి దురుద్దేశపూర్వకమైన మాల్వేర్‌ను జొప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ మాల్వేర్ ద్వారా డేటా మొత్తాన్ని లాక్ చేసేసి ఓపెన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తారు. సమాచారం సేకరణతో సంబంధితుల బ్యాంక్ ఖాతాలోకి లాగిన్ అయి డబ్బులు కాజేసేందుకూ అవకాశం ఉంటుంది. దీన్నే జ్యూస్ జాకింగ్ అంటారు. సైబర్ ప్రపంచంలో జ్యూస్ జాకింగ్ పేరు వినపడటం మొదలైంది ఈ మధ్యనే అయినప్పటికీ 2011లోనే కొంతమంది టెకీలు ఈ ప్రక్రియను ప్రదర్శించటంతో పాటు పేరును కూడా ఖాయం చేశారు. ఇటీవల ఢిల్లీలో ఒక యువకుడి స్మార్ట్‌ఫోన్‌ను హ్యాకర్లు ఇలా జ్యూస్ జాక్ చేశారన్న వార్తలు రావడంతో దీనిపై మళ్లీ చర్చ మొదలైంది. ఈ ఇబ్బందుల బారిన పడకుండా ఉండాలంటే ఎక్కడపడితే అక్కడ చార్జింగ్ చేసుకోకపోవటమే ఉత్తమం. వీలైనంత వరకూ ఫోన్, ల్యాప్‌టాప్ ఇంట్లోనే పూర్తిగా ఛార్జింగ్ చేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో చార్జింగ్ చేసుకోవాల్సి వస్తే చార్జింగ్ స్టేషన్లలోని యూఎస్బీ పోర్టులను ఉపయోగించకుండా అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ ప్లగ్‌ల ద్వారా సొంత చార్జర్‌తో చార్జ్ చేసుకోండి. ఎందుకంటే విద్యుత్తు ప్రవహించే చోట్ల డేటా ట్రాన్స్‌ఫర్ సాధ్యం కాదు. ఒకవేళ పబ్లిక్ యూఎస్బీ పోర్టు ద్వారానే చార్జ్ చేసుకోవాల్సి వస్తే మీ గాడ్జెట్‌ను ఆఫ్ చేసేయండి. దీంతో కూడా డేటా ట్రాన్స్‌ఫర్ జరగదు కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఎద్దు పుండు కాకికి ముద్దా?

అగ్రరాజ్యం అమెరికా ఇప్పుడు ప్రపంచ పెద్దన్నగా ఉండబోవడం లేదు. ముందు తన ఆర్థిక గోచీని సర్దుకోకపోతే అసలుకే మోసం వస్తుందని ఇప్పుడు అమెరికాకి అర్థం అవుతోంది. అందుకే అఫ్ఘనిస్తాన్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. అంతవరకూ సరే. కానీ తాను పోతూ పోతూ పాలేరు బాధ్యత భారత్‌కు అప్పగించాలనుకోవడమే విడ్డూరం. అఫ్ఘనిస్తాన్‌లో తాను మాత్రం తప్పుకుంటుందట. కానీ భారత్ మాత్రం మరింత బాధ్యతగా పనిచేసి, అఫ్ఘన్ శాంతి పరిరక్షణలో పాత్ర పోషించాలట. ఇది 'ఒళ్లు నాది కాకపోతే ఈత చెట్టుకు ఎదురు దేకమన్నట్టు'గా ఉంది.

అఫ్ఘనిస్తాన్‌లో భారత్ మరింత క్రియాశీలకమైన పాత్ర పోషించాలని పెద్దన్నగారు కోరుకుంటున్నారు. భారత్ ప్రాంతీయ శక్తిగా ఎదగాలని సలహా ఇచ్చింది. సూటిగా చెప్పాలంటే భారత్ తన సైన్యాన్ని అఫ్ఘనిస్తాన్‌కి పంపాలి. అంటే గతంలో శ్రీలంకలో శాంతి స్థాపన కోసం ఐపీకేఎఫ్ పేరిట సైన్యాన్ని పంపి చేతులు కాల్చుకున్నట్టుగానే మళ్లీ అఫ్ఘనిస్తాన్‌లో సైన్యాన్ని కాబూల్‌కు కాపలాగా నిలబెట్టాలట. నిజానికి ఇప్పటికే పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ప్రోత్సాహంతో తాలిబాన్లు కాబూల్, హేరత్, మజారె షరీఫ్, కాందహార్, జలాలబాద్‌లలోని మన దౌత్య కార్యాలయాలపై బాంబుదాడులకు పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో భారత సైన్యాన్ని తనకు అవసరం లేని యుద్ధంలోకి తోసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో భారత్ ముందు ప్రమాదాలూ ఉన్నాయి, అవకాశాలూ ఉన్నాయి. ప్రమాదాలను గుర్తించి, అవకాశాలను ఉపయోగించుకోగలిగే పరిపక్వతను భారత్ ప్రదర్శించాల్సి ఉంటుంది.

నిజానికి 2001 సెప్టెంబర్ 11 వరల్ ట్రేడ్ సెంటర్‌పై ఒసామా బిన్ లాడెన్ సారథ్యంలో జరిగిన దాడుల నేపథ్యంలో అమెరికా అఫ్ఘనిస్తాన్‌లోకి ప్రవేశించింది. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు పేరిట జార్జి బుష్ ఆదేశాల మేరకు అమెరికన్ సైన్యాలు అఫ్ఘనిస్తాన్‌లో ఆపరేషన్లు ప్రారంభించాయి. 'అఫ్ఘనిస్తాన్ దాటేందుకు చాలా సులువు, కానీ గెలిచేందుకు మహా కఠినం' అన్న మాట మరో సారి నిజం అయింది. పదిహేడేళ్ల పోరాటంలో అమెరికా సాధించింది గోరంత, కోల్పోయింది కొండంత. 2372 మంది అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గాయపడ్డారు. ఈ యుద్ధాన్ని చేయడం ఇప్పటికే కుదేలైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు పెనుభారమైపోయింది. అందుకే రక్తమోడే ముక్కుతో అమెరికా అఫ్ఘనిస్తాన్ నుంచి వెనక్కివెళ్లిపోతోంది. తన దేశానికి చెందిన 14000 మంది సైనికుల్లో ఏడు వేల మందిని వెనక్కిపిలిపించుకుంటోంది. మిగతా వారినీ కూడా దశలవారీగా ఉపసంహరించుకుంటోంది. తాను ప్రారంభించిన యుద్ధం నుంచి తానే తప్పుకుంటూ, మరో వైపు బ్రిటన్, ఇటలీ, జార్జియా, రుమానియా, టర్కీ, చెక్ రిపబ్లిక్, పోలండ్, ఆస్ట్రేలియాల సైనికులను మాత్రం ఇంకా పోరాటాన్ని కొనసాగించమనే చెబుతోంది. అంతే కాదు. భారత్ కూడా ఈ పోరాటంలో క్రియాశీలకపాత్ర వహించాలని కోరుతోంది.

భారత్ మొదట్నుంచీ అఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణంలో కీలక పాత్ర వహిస్తూ వస్తోంది. సైన్యానికి శిక్షణనివ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడం, ఆయుధాలు అందచేయడం వంటి విషయాల్లో సహకరిస్తోంది. కాబూల్‌లోని పార్లమెంటు భవన నిర్మాణం, నిమ్రోజ్ ప్రాంతంలో డెలారం జరంజ్ రహదారి, చిష్తీ షరీఫ్‌లో సల్మా ప్రాజెక్టుల నిర్మాణం వంటివి భారత్ చేపట్టింది. నిజానికి భారతదేశం ప్రయత్నాలు పాజిటివ్ దృక్పథంతో కొనసాగుతున్నాయి. అమెరికా ఇప్పుడు చేతులు దులుపుకోవడం వల్ల మన పునర్నిర్మాణ ప్రయత్నాలకు పెను సవాళ్లు ఎదురవుతాయి. అంతే కాదు, అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్లు, పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలు అమెరికా అఫ్ఘనిస్తాన్ నుంచి వైదొలగిన నేపథ్యంలో కశ్మీర్‌లోకి, పంజాబ్‌లోకి చొరబడే ప్రమాదం ఉంది. దీని వల్ల ఉగ్రవాద సంఘటనలు పెరిగే అవకాశం ఉంది. మన భద్రతా దళాలకు కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ పరిస్థితుల్లో అఫ్ఘనిస్తాన్‌లో దుస్సాహసం సాధ్యమేనా అన్నది అసలు ప్రశ్న! ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం చాలా పరిపక్వతతో, దూరదృష్టితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అమెరికా తమ బందూకు మన భుజాన పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎద్దు పుండు కాకికి ముద్దు కాదన్న విషయాన్ని మనం గమనించాల్సి ఉంటుంది.

భాషా పండితులకు ప్రమోషన్లు ఇవ్వరా?

దేశ భాషలందు తెలుగు లెస్స. తెలుగు భాష తియ్యనైనది, కమ్మనైనది, అమృత భాష. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాషా బోధన చేసే వారికి 30 ఏళ్ళుగా అడుగడుగున అన్యాయం జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. భాషా పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ భాషా బోధకులుగా ఉండి వివిధ భాషల వికాసానికి కృషి చేస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో భాషా పండిట్లకు శిక్షణ పొందిన అర్హతను నిర్ణయించి, సెకండరీ గ్రేడ్ టీచర్ల వేతన స్కేలును ఇస్తూ, స్కూల్ అసిస్టెంట్లతో సమానమైన పనిని లాంగ్వేజ్ పండిట్లతో చేయించుకుంటున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్ల పదోన్నతి ఇచ్చినట్లు లాంగ్వేజి పండిట్లకు 1985న పదోన్నతులు ఇవ్వటం మరిచిపోయారు. స్కూల్ అసిస్టెంట్లు, గణితం, సైన్సు, సోషల్, ఆంగ్లం, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజెస్ అనే కొత్త పోస్టులను ప్రాథమికోన్నత పాఠశాలల్లో అప్‌గ్రేడ్ చేయాలని కొత్తగా సృష్టించారు. స్కూల్ అసిస్టెంట్లు (భాషలు) నియామకాలు, ప్రమోషన్లలో డిగ్రీ స్థాయిలో సంబంధిత సబ్జెక్టు తప్పనిసరిగా చదివిన వారికే ప్రమోషన్లు ఇచ్చే విధంగా జీవోలు 11,12లకు తగిన సవరణ చేయాలి. గణితం,సైన్సు వంటి ఐచ్చిక సబ్జెక్టుల వారికి ఒక న్యాయం తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలు బోధించే వారికి మరొక న్యాయమా? అర్హతలు ఉన్న ఉద్యోగికి పదోన్నతి హక్కు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావటం లేదు. భారత రాజ్యాంగం ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సూత్రాన్ని దశాబ్దాలుగా అమలు పర్చటం లేదు. టీచర్ల సర్వీస్ రూల్స్ తప్పుల తడకగా ఉండటం. ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం కృషి చేస్తామని 'వాక్' దానాలు చేసిన వారు పత్తా లేకుండా పోయారు. ఐచ్చిక సబ్జెక్టుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు పొందుతున్నారు. ఆర్థికంగా, సామాజిక లబ్ధిని పొందుతున్నారు. గత 30 ఏళ్ళుగా తెలుగు పండితులుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్ లేకుండా పదవి విరమణ పొందుతున్నారు. వేతనంలో నష్టం, పించను పొందటంలో నష్టాన్ని చవిచూస్తున్నారు. 2001నుంచి సుమారు 75 వేల సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా స్థాయి పెంచిన పాలకులు ఒక్క లాంగ్వేజి పండిట్ పోస్టును కూడా లాంగ్వేజీ స్కూలు అసిస్టెంట్ పోస్టుగా మార్చక పోవటం తెలుగు భాషలతో సహ ఇతర భాషల మీద పాలకులకు ఉన్న చిన్న చూపుకు నిదర్శనం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఐచ్చిక స్కూలు అసిస్టెంట్లు ఉండగా 8,9,10 తరగతులకు స్కూలు అసిస్టెంట్స్ (లాంగ్వేజీలలో) బోధించటం లేదు. తెలంగాణలో అక్షరాస్యతను పెంచాల్సి ఉంది. జీవో నెంబర్ 11,12లను వెంటనే సవరించి ప్రమోషన్లు కల్పించాలి. ప్రాథమికకోన్నత, హైస్కూళ్ళలో భాషా పండిట్ పోస్టులను స్కూలు అసిస్టెంట్లుగా స్థాయి పెంచాలి. ప్రాథమిక పాఠశాలల్లో కూడా భాషా పండిట్ల పోస్టులను మంజూరి చేయాలి. పండితులకు కూడా ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలి. ఎం.ఏ తెలుగు చదివిన సీఎం కేసీఆర్ స్పందించి వెంటనే పండితులకు ప్రమోషన్లు ఇప్పించాలి.

– రావుల లావణ్య రాజేశం,
లెక్చరర్, జిమ్మికుంట

సంతోషకరమైన జీవితానికి ప్రార్థన ముఖ్యం

బ్రతకటానికి ఆహారం ఎంత ముఖ్యమో, సంతోషకరమైన జీవితానికి ప్రార్థన అంత ముఖ్యం. మనకు అన్నీ ఇచ్చిన పరమాత్మకు కృతజ్ఞత చెప్పటమే పూజ, భక్తి. భక్త కబీర్‌ను అవమానించాలని ఓ తుంటరి, కబీర్ పేరుతో ఊళ్ళోవాళ్ళందరినీ కబీర్‌కు చెప్పకుండా, కబీర్ ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. విందుకు వచ్చినవారిని చూసి, కబీర్ కలవరపడకుండా, తన ఇష్ట దైవం శ్రీరాముడిని తలచుకుంటూ పూజాగదిలో ప్రార్థిస్తూ కూచుంటే, కబీరు వేషంలో శ్రీరాముడు అందరికీ విందుభోజనం తినిపించాడు. మీరాబాయికి విషం ఇచ్చి త్రాగమని ఆజ్ఞాపిస్తే, తన ఇష్టదైవం శ్రీకృష్ణుడిని ప్రార్థించి విషం త్రాగినా క్షేమంగా ఉంది. అది దైవం మీద భక్తికి విశ్వాసానికి తార్కాణం.

తృప్తి ఉన్నవాడే సంపన్నుడు

ఉన్నదానితో తృప్తిపడేవాడు సంపన్నుడు. ఎంత ఉన్నా లేనిదానికోసం మధన పడేవాడు దరిద్రుడు. జ్ఞానంలో తనకంటే ఉన్నతుడితో పోల్చుకోవాలి. కష్టపడి శ్రద్ధాసక్తులతో శ్రమించి సాధించాలి. ధనంలో తనకంటే క్రింది వారితో పోల్చుకొని ఉన్నదానితో తృప్తి పడాలి. తృప్తి, సంతోషం ఉన్నవాడే సంపన్నుడు. అయితే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ప్రయత్నించటంలో తప్పు లేదు. కాని ఉన్నవారిని చూసి అసంతృప్తి పడకూడదు. అసంతృప్తి పడటం ఒక మానసిక బలహీనత.

మనం రోజూ ఎంతో మంది కళ్ళు లేని వాళ్ళను, కాళ్ళులేని వాళ్ళను బజార్లో చూస్తుంటాము. భగవంతుడు మనకు అన్ని అవయవాలు సక్రమంగా ఇచ్చి ఉండటానికి ఇల్లు, కట్టుకోవటానికి బట్ట, తినటానికి తిండి ఇచ్చినందుకు సంతృప్తి పడాలి. ఆరోగ్యమే జీవితం, అనారోగ్యమే మరణం. ఏ అవయవం సరిగ్గా లేకపోయినా దాన్ని సరిచేసుకోవటానికి ఖర్చు, శ్రమ. కిడ్నీ మొదలు ఏ అవయవం మార్చుకోవాలన్నా కొన్ని లక్షలు ఖర్చు. ఈ లెక్కన మన శరీరం విలువ కొన్ని కోట్లుంటుంది. అంతటి విలువు కలిగిన శరీరాన్ని కలిగి ఉన్నందుకు సంతోషించాలి. కష్టపడి పని చేసి తృప్తిగా ఆనందంగా జీవించాలి. అందరి దేహములలో ఆత్మ అనే చైతన్యం ప్రతిష్ఠితమై ఉన్నది. ఆ చైతన్యం ఉంటూ శివం (మంగళం), లేకపోతే శవం.



ఉన్నదానితో తృప్తి చెందుతూ, ఉన్నత స్థితికి ప్రయత్నించాలి

కథ : ఒక రాజుగారికి మనసులో తాను చక్రవర్తి కాలేదే అన్న దిగులుండేది. కాని కారణం ఎవరికీ చెప్పక, ఎల్లప్పుడూ దిగాలుగా ఉండేవాడు. ఒక గొప్ప జ్ఞాని ఆ ఊరికి వచ్చాడని తెలుసుకొని, రాజుగారు ఆయన దగ్గరకు వెళ్ళి తన సంతోషంగా ఉండటానికి మార్గం చెప్పమంటాడు. అప్పుడు 'నీ రాజ్యంలో అత్యంత సంతోషంగా ఉన్నవాడి చొక్కా నీవు ధరిస్తే నువ్వు సంతోషంగా ఉంటావు' అని ఆ జ్ఞాని చెప్పాడు. మంత్రిగారు రాజ్యమంతా వెతికించి, ఒకడు ఎప్పుడూ సంతోషంగా కేరింతలు కొడుతూ ఉంటాడని తెలుసుకొని, వాడిని రాజుగారి ముందుంచాడు. వాడిలో అదురూ, బెదురూ లేదు. నీకేం కావాలి అని అడిగితే నాకేం అక్కరలేదని జవాబు చెప్పాడు. నిశ్చింతగా అమాయకంగా నవ్వుముఖంతో నిలబడ్డాడు. వాడిని చొక్కా అడుగుదామంటే, వాడికి చొక్కాయే లేదు. అప్పుడు రాజుగారికి అర్థం అయింది – అన్నీ ఉన్నా తనకు సంతోషం లేదని, వాడికి ఏమీ లేకపోయినా సంతోషంగా ఉన్నాడు, తన కోరికే తన దిగులుకు కారణం అని, కోరికలు లేనివాడే సంతోషంగా ఉండగలడు అని అర్థమయింది. అప్పటి నుండి దిగులుపడటం మానేసి, సంతృప్తితో రాచకార్యాలు చక్కదిద్ది, రాజులందరిలో మంచి పేరు తెచ్చుకొని చక్రవర్తి అయ్యాడు. కొద్ది కాలంలో కోరికలు తీరితే ఆనందం అనేది భ్రమ, కోరికలు ఆరితేనే ఆనందం అనేది సత్యం.

సాధన వలన సమకూరు పనులు

సాధన వలన సమకూరు పనులు ఇలలోన. సాధన చేసి పనులు సాధించాలి. ఒక్కో అడుగువేస్తుంటే, చీమైనా గమ్యం చేరుతుంది. ఉన్నచోట నుంచి ఎగరక పోతే, పెద్ద గద్ద అయినా గమ్యం చేరలేదు.

విద్యా-వివేకం 9

కథ : ఒక మంద బుద్ధి బాలుడు, తనకు చదువు అబ్బదని విచారించి గురువు వద్ద నుంచి వెళ్ళిపోతూ దారిలో ఒక నూతిదగ్గర దాహం తీర్చుకుందామని ఆగాడు. అప్పుడు ఆ బావి దగ్గర బిందెలు పెట్టటం వలన రాయిమీద ఏర్పడ్డ గుంతను చూసి, కఠినమైన రాయే ఆ విధంగా తరుచూగా దాని మీద పెట్టిన బిందెల రాపిడికి అరిగినపుడు, నేను పాఠాలను మళ్ళీ మళ్ళీ వల్లె వేస్తే నా మెదడులో గుర్తు పడి అవి నోటికి రావా అని తర్కించుకొని వెనక్కు వచ్చి గురువుగారు చెప్పిన పాఠాలు పట్టుదలతో అదే పనిగా వల్లె వేసి, నిరంతర సాధనతో కొద్దికాలంలో పండితుడైనాడు. కనుక వైఫల్యాలకు బెదరక, వాటిని విజయానికి సోపానాలుగా మరల్చుకోవాలి.

అవినీతి ఒక జాడ్యం

అడ్డదారులు త్రొక్కి అందినకాడికి దోచుకోవాలన్న అత్యాశే అవినీతికి కారణం. మన దేశంలో నేరస్తులకు శిక్షలు తక్కువ. ప్రజలకు సహనం ఎక్కువ. శిక్షలు పడ్డా కూడా ధన, పదవీ, అధికార గర్వంతో ఆ శిక్షల నుంచి తప్పించుకోవటానికి బెయిలు మీద విడుదలయి ఏళ్ళ తరబడి స్వేచ్ఛగా తిరగచ్చు అన్న భరోసా కొంత కారణం. మన న్యాయ వ్యవస్థలో కేసులు తేలి, శిక్ష అమలు కావటానికి కొన్ని దశాబ్దాలు పట్టటం, నేరస్థుల పాలిటివరం.

లంచం మరిగిన వారు నోట్లకట్టలను లాకర్లలో ఉంచి అవి చెదలు పట్టేటట్లు చేస్తే, లక్ష్మీదేవి వారిని కటకటాల వెనక్కు పంపించటమేగాక, మరణానంతరం వారికి యముడు సలసలకాగే నూనెలో వేయిస్తాడు. మరుజన్మలో కాసులు అడుక్కునే బిచ్చగాళ్ళుగా జన్మిస్తారు.

చిన్నప్పుడే అవినీతి ఒక పాపం అని, లంచం ఇవ్వటం, పుచ్చుకోవటం అధర్మమని పిల్లలకు ఇంటిలో, పాఠశాలలో బోధిస్తే వారి మనసులలో నాటుకొనిపోయి, వారు జీవితాంతం సన్మార్గులుగా నడుచుకునే అవకాశం ఉంది.

మూడో కంటి వాడికి తెలియకుండా అధర్మాలు చెయ్యచ్చేమో గాని, మూడు కన్నుల వాడికి తెలియకుండా ఏదీ చేయలేమని, ఎందుకంటే ఈశ్వరుడు మన హృదయం లోనే చిత్రంగా ఉండి గమనిస్తూ, గుప్తంగా అన్నీ పదిల పరుస్తుంటారు. ఈ లోకంలో శిక్ష తప్పించుకోవచ్చేమో గాని పై లోకంలో ఆ చిత్రగుప్తుడు మనం చేసిన నేరాల చిట్టా విప్పినప్పుడు, శిక్ష తప్పించుకోలేమని, పిల్లలకు మనసులో గట్టిగా నాటేటట్లు చేయగలిగితే, జీవితాంతం వారు ధర్మాత్ములుగా నడిచే అవకాశం ఉంది.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

ఆందోళనకు అన్ని పార్టీల మద్దతు

ఉద్యోగులకు కల్పించిన రక్షణలలో అనేక ఉల్లంఘనలు జరిగినవంటూ, ఇక్కడి వారికొరకు ప్రత్యేకించిన ఉద్యోగాలలో బైటివారిని నింపారని 1969లో కమ్యూనిస్ట్ నాయకుడు వై.వి. కృష్ణారావు కూడా బహిరంగ ప్రకటనలో ఒప్పుకున్నారు. నిజాం నిరంకుశ పాలనలో అణగారిపోయిన తెలంగాణ ప్రాంతం, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పన్నెండేండ్ల అనంతరం కూడ వెనుకబడి ఉన్నదని ఆవేదనను వ్యక్తంచేస్తూ పాపభూయిష్టమైన కాంగ్రెస్ పరిపాలనయే ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య సమైక్యత పెంపొందకుండా ఉండేందుకు కారణభూతమైందని విమర్శించారు.

ఆ వారంలోనే జన సంఘం కూడ ఒక పత్రికా ప్రకటన చేస్తూ తెలంగాణకు ఘోరమైన అన్యాయాలు జరిగినందున ఈ ప్రాంత ప్రజలు చేసే ఆందోళన సహేతుకము సమంజసమైనదేనని అంగీకరించినది. కమ్యూనిస్టుల వలెనే వీరు కూడ ప్రభుత్వాన్ని నిందించారు. సంయుక్త సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం కూడా 1969 మార్చి 13వ తేదీ సమావేశంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలు సహించవీలులేని స్థితికి చేరుకొనినవని అభిప్రాయపడింది. తమకు జరిగిన అన్యాయాలను ప్రతిఘటిస్తున్నందుకు యువకులను విద్యార్థులను అభినందిస్తూ కార్యవర్గం కొన్ని సూచనలు చేసినది. తన వాగ్దానాలను పాటించే శక్తి లేనందున ఆనాటి మంత్రి వర్గం రాజీనామా చేయాలని కోరారు. ప్రాంతీయ సంఘాన్ని చట్టబద్ధమైన సంస్థగా గుర్తిస్తూనే దాని అధికారాలను విస్తృత పరచాలని సూచించారు.

ఏప్రిల్, జూన్ మాసాలలో వారాల తరబడి రవాణా సౌకర్యాలు పూర్తిగా నిలిపివేయబడినవి. రాజధాని నగరంలో ప్రత్యేకించి సికింద్రాబాద్‌లో ఏకబిగిన పదిరోజుల వరకు దుకాణాలు తదితర వ్యాపార సంస్థలన్నీ మూసి ఉంచబడిన ఉదంతాలు ఎన్నో ఉన్నవి. తెలంగాణా ప్రజలకు తమ జన్మహక్కు, పరమ లక్ష్యమైనటువంటి రాష్ట్ర సాధన జీవన్మరణ సమస్య. ఈ పవిత్ర ధ్యేయాన్ని సాధించేందుకు ఈ ప్రాంతపు ప్రజలు ఏ త్యాగాలకైనా సిద్ధంగానే ఉన్నారు. ఎంత కష్ట నష్టానికైనా సంతోషంతో సహిస్తారు.

జనవరి 16వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో కాకరవాణి ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన సందర్భంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే నినాదాన్ని ఖండించిన ప్రాంతీయ సంఘం తొలి అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన శ్రీ అచ్యుత్‌రెడ్డి కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తప్ప సమస్యకు వేరే పరిష్కార మార్గంలేదని మార్చి 27వ తేదీన బహిరంగ ప్రకటన చేశారు. రక్షణల అమలు గురించి అంతకు ముందే సుమారు నెల, నెల పదిహేను రోజులు ఆయన ముఖ్యమంత్రితో బహిరంగంగానే వాగ్వివాదం పెట్టుకున్నారు. ప్రజాసమితిలో చేరిన తొలి కాంగ్రెస్ శాసనసభ్యులలో శ్రీ అచ్యుత్‌రెడ్డి ముఖ్యులని చెప్పుకొనవచ్చును. ఆ తర్వాత శ్రీ చెన్నారెడ్డి, శ్రీ కొండాలక్ష్మన్ ప్రభావం వల్ల కూడా పలువురు ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుత పాత్రను నిర్వహించారు.

రమారమి అదే రోజులలో నల్లగొండలో జరిగిన ఒక ఘోరమైన దురదృష్ట సంఘటన ఆంధ్రప్రాంత ప్రజలలో ఉద్రేకాన్ని రెచ్చగొట్టింది. సర్వే శాఖలో పని చేస్తున్న ఒక ఉద్యోగిని అతని శత్రువులు కొందరు, (లైంగిక వ్యవహారాల గొడవలో) హత్య చేయాలన్న ప్రయత్నంలో కిరసనాయిలు పోసి తగులపెట్టారు. కాకతాళీయంగా అతను ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాడవటం వలన, ఆంధ్ర తెలంగాణా గొడవలలో నేరం తమపై పడకుండా తప్పించుకొనవచ్చునని హంతకులు భావించగా, నేరపరిశోధన పూర్తిఅయి నిందితులు పట్టుబడే వరకు తెలంగాణా వాళ్ళు ఆంధ్ర వ్యక్తినే చంపారనే ప్రచారం ఊరూర ముమ్మరంగా జరిగింది. కొందరు తెలంగాణా ద్రోహులు కావాలనే ఈ ప్రచారం చేశారు. అవవచ్చునని కూడా కొందరు నమ్మారు. ఆ తర్వాత పట్టుబడిన నిందితులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారేనని తేలింది. అప్పటికే దుష్ప్రచారాన్ని నమ్మిన ప్రజలు కొందరు అసలు విషయం వినిపించుకునే స్థితిలో కానీ పట్టించుకునే ధోరణిలో కానీ లేకుండిరి. సర్వే శాఖవారు తమ సహచరుడిని తెలంగాణా వారు చంపారని తొందరపాటుతో చేసిన ప్రకటనలకు విజయవాడ పత్రికలు కొన్ని అత్యంత ప్రాధాన్యతను ఇచ్చాయి. ఆ వార్తలు చదివిన ఆంధ్ర ప్రాంతీయులలో ప్రతీకారేచ్ఛ చోటు చేసుకున్నది.

ఈ పరిస్థితులలో ఒకనాడు ఆంధ్ర ప్రాంతం కృష్ణా జిల్లా విజయవాడ నుండి ఈ ప్రాంతం నల్గొండ జిల్లాకు కుటుంబంతో వస్తున్న ఒక తహసీల్దారును విద్యార్థులని చెప్పుకొన్న కొందరు సంఘ విద్రోహులు ఆంధ్ర ప్రాంత గ్రామమైన 'నందిగామ' వద్ద దౌర్జన్యానికి గురిచేశారు. అతని భార్యని అవమానపరచి వివస్త్రను చేయగా కొందరు పెద్దలు వారిని ఆదుకొని వారి పరువు ప్రాణాలు కాపాడారు. మర్నాడే ఈ దుస్సంఘటన నల్గొండ, వరంగల్ జిల్లాలో దావానంలా వ్యాపించింది. ఆగ్రహావేశాలకు లోనైన తెలంగాణా విద్యార్థులు, ప్రజలు ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళే బస్సులను లారీలను సరిహద్దున ఉన్న కోదాడ వద్ద నిలుపుచేసి తమ తీవ్ర నిరసనను తెలియచేశారు. రౌడీలు సంఘ విద్రోహులు కొందరు ఆంధ్రులపై దౌర్జన్యాలు కూడ చేశారని వార్తలు వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాదులలో ఒకరైన యలమంచి విశ్వేశ్వరరావు గారు కూడ ఆ రోజు హైదరాబాదు నుండి విజయవాడకు ప్రయాణం చేస్తూ మార్గమధ్యంలో ఆపుదలకు గురైన వాహనదారులలో ఉన్నారు. 'తెలంగాణ వారు వాహనాలు ఆపి నినాదాలు చేశారే తప్ప, ఎవరిపై చేయి చేసుకొనలేదు. దౌర్జన్యం చేశారనే వార్తలు కేవలం కల్పితాలు' అని విశ్వేశ్వరరావుగారు ఈ రచయితకు ఎన్నో సందర్భాలలో స్పష్టం చేశారు. ఉద్యమాలు, పత్రికలలో వార్తల ప్రస్తావన ఎప్పుడు ఎక్కడ వచ్చినా ఆయన ఈ ఉదంతం గురించి ప్రస్తావిస్తూ ఉంటారు. ఆయన బందరు వాస్తవ్యులు, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ, హైదరాబాద్‌లో నివాసం ఏర్పరుచుకున్నాడు. ఏదో సాకుతో ఉద్యమం చేసే వారినీ, తమ ప్రత్యర్థులను వంచన చేయాలనుకున్న అధికారముఠాకు ఈ సంఘటన వల్ల చక్కటి అవకాశం దొరికింది. వారి హంగుదార్లు వరంగల్ మొదలగు పట్టణాలలో దోపిడీలు, గృహదహనాలకు, కొందరు సంఘ విద్రోహులను ప్రోత్సహించి ఈ నేరాలన్నింటినీ తాము శత్రువులుగా భావిస్తున్న తెలంగాణా ఉద్యమకారులపై నెట్టారు.

పాలకుల ఆశీర్వచనంతో పట్టపగలే ఎన్నో అఘాయిత్యాలు జరుగుతుంటే శాంతి భద్రతలు పరిరక్షించవలసిన పోలీసులు తమకవేమీ పట్టనట్టు ప్రవర్తించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న కొందరు దుండగులు మహిళలను అవమానించారు. వ్యక్తిగత కక్షలు సాధించుకొనేందుకు కొందరు (తమకు గిట్టని) మరికొందరిపై దాడి చేశారు. దుర్మార్గులకు గురి అయిన బాధితులలో ఇరుప్రాంతాలవారు ఉన్నప్పటికీ కేవలం ఆంధ్రులపైననే అత్యాచారం జరిగినట్లు కొందరు ముమ్మరంగా ప్రచారం సాగించారు.

అయితే చివరకు, మానవతావాదులు, పరోపకార పరాయణులైన వరంగల్ పురప్రజలు, విద్యార్థులే కొందరు, ఆంధ్రులను ఆపదలో ఆదుకొని ఆశ్రయం కల్పించారు. తమ పట్టణం రాజధానిగా చరిత్ర ప్రసిద్ధికెక్కిన అనేక తెలుగు సామ్రాజ్యాలను పాలించి గణుతికెక్కిన సామ్రాట్టుల ఘనతకు మచ్చ రాకుండా చూడగలిగారు వరంగల్ ప్రజలు. ఈ సంఘటనలను విజయవాడ నుండి వెలవడే కొన్ని పత్రికలు వాస్తవాలను ప్రతిభింభించగా మరికొన్ని ఆంధ్రపక్షపాత పత్రికలు వక్రంగా చిత్రించి, ఆంధ్ర ప్రజల హృదయాలలో కోపాగ్ని జ్వాలలను రేకెత్తించగా ఆ తరువాత చాలా తీవ్రమైన పరిణామాలు సంభవించాయి.

విజయవాడ, పరిసర ప్రాంతాల నుండి కిరసనాయిలు, పెట్రోలుతో నింపిన డబ్బాలను, రాళ్ళు, కత్తులు, తుపాకులు, కర్రలు పుచ్చుకొని కొన్ని వేల మంది ఆగ్రహావేశ పరులైన ప్రజానీకం సుమారు 60 లారీలలో కోదాడ తదితర సరిహద్దు గ్రామాలపై దాడి చేసి, వాటిని దహనం చేసేందుకు వచ్చారు. వీరిని మార్గమధ్యంలో పెక్కుచోట్ల పోలీసులు నిరోధించారు. చివరకు కొన్ని లారీలు కోదాడ పొలిమేరల వరకు రాగా పోలీసులు తుపాకీ కాల్పులు జరిపి వాటి పురోగమనాన్ని అరికట్టి ఒక మహోపద్రవాన్ని నివారించగలిగారు. ఈ సందర్భంలో కోదాడ నాటి పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ జితేందర్‌రెడ్డి దూరదృష్టితో, చాలా సాహసోపేతమైన భూమికను నిర్వహించినట్లు పలువురు ప్రశంసించారు. ఇదిలా ఉండగా మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ఆంధ్ర ప్రాంతం కర్నూలు జిల్లావైపు పనిచేస్తున్న కార్మికులు కత్తులు, కర్రలు, ఇతర మారణాయుధా లతో కొన్ని లారీలలో ఎక్కి తెలంగాణా ప్రాంతం మహబూబ్‌నగర్ జిల్లాలో ఈగలపెంట గ్రామంపై దాడికి రాగా అక్కడ కూడా పోలీసులు కాల్పులు జరిపి ప్రమాదం నివారించారు. ఒక శత్రుదేశంపై దాడివలె ఒక నిర్ణీత పథకం ప్రకారం నలువైపుల ఈ దాడులకు ప్రయత్నాలు జరిగాయి అని అభిప్రాయం కలిగేట్టు మరొక సంఘటన జరిగింది. దీనిలో, నాగార్జున సాగర్ కుడివైపున గుంటూరు జిల్లా గ్రామాల నుండి ఎడమవైపు తెలంగాణా ప్రాంతం నల్గొండ జిల్లాలో విజయపురిపై అనేక మంది విద్యార్థులు, ప్రజలు దాడి జరిపారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

కాంగ్రెస్‌కు జవసత్వాలందించిన రాహుల్

రాహుల్‌గాంధీ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటి (ఎఐసీసీ) అధ్యక్షుడు అయినతర్వాత కాంగ్రెస్‌కు జన సత్వాలనందిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయాలనందుకుంది. తర్వాత జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో అధికారం చేపట్టింది. భారత ప్రజలు మతతత్వాన్ని, నిరంకుశ పాలనను అంగీకరించరని ఈ ఎన్నికల ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటానికి, సార్వభౌమత్వాన్ని సమున్నతంగా నిలబెట్టడానికి కాంగ్రెస్ మాత్రమే చేయగలుగుతుందని ప్రజలు నమ్మి పట్టం కట్టారు. భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని, అంబేద్కర్ రాజ్యాగం స్ఫూర్తిని పరిరక్షించే పార్టీలకే ఓటువేసి గెలిపిస్తారని ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి. అందుకే అంబేద్కర్ సామాజిక న్యాయ భావజాలంతో ఉన్న బీయస్పీ, ఎస్పీ, ఆర్‌జెడి లాంటి పార్టీలు, కాంగ్రెస్‌తో చేయికలిపి పనిచేయడం వల్ల మరిన్ని విజయాలు సాధించవచ్చని గత ఆరేడు నెలలుగా దేశంలో జరిగిన ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. అందుకోసం యువనేత రాహుల్ భావస్వామ్యంగల లౌకిక, ప్రజాస్వామిక పార్టీలతో పొత్తు పెట్టుకొని విజయపరంపరను కొనసాగిస్తున్నారు. ఈ విజయపరంపర 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ కూటమికి విజయాన్ని అందించే అవకాశాలున్నాయి. లభించిన ఈ విజయాలతో పొంగిపోకుండా ఇదివరకటి వినయంతోనే పొత్తులు చెదిరిపోకుండా చూసుకోవాలి. భారత ప్రధానిగా సింహాసనాన్ని ఆక్రమించే అర్హత మాయావతి, మమత, శరద్‌యాదవ్ లాంటి అనేకమందికున్నా ఈ సారి మాత్రం అది యువనేత రాహుల్‌కే దక్కవచ్చు. ఎందుకంటే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కేడర్ ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. తనకు బలంలేని చోట సామాజిక, బహుజన, ప్రగతిశీల శక్తులతో కలిసి బీజేపీని రాహుల్ సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు.

బీజేపీ పాలనలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పాలన తేవడంలో రాహుల్ విజయం సాధించారు. శక్తి సామర్థ్యాలనుపయోగించి, సమయోచిత నిర్ణయాలు తీసుకుని పార్టీని విజయతీరాలకు చేర్చారు. లౌకిక, ప్రజాస్వామిక, రాజ్యాంగ పరిరక్షణకై, ప్రజల భౌతిక అవసరాలను తీర్చడానికి కాంగ్రెస్, మిత్రపక్షాలకు ఓటేయ్యాలన్న విషయాలను ప్రజల మెదల్లల్లోకి చొప్పించగలిగారు. మూడు రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రుల పాలనను ఎండగట్టడంలో రాహుల్, అక్కడి కాంగ్రెస్ నాయకులు విజయం సాధించారు కాబట్టే కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. గిట్టుబాటు ధర అడిగినందుకు రైతులను చితకబాదిన బీజేపీ ప్రభుత్వాల పాలనకు భిన్నంగా రైతు ఫ్రెండ్లీ ప్రభుత్వాల నందిస్తామని ప్రజలకు నమ్మకం కల్గించడం వల్లనే ఈ విజయం సాధ్యమైంది. వీటన్నింటినీ ఎండగట్టి ఆయా రాష్ట్రాల్లోని ప్రజాస్వామ్య, సామాజిక పార్టీలతో కలిసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ విజయం సాధించి దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తారనడంలో సందేహం లేదు. మిజోరాం, తెలంగాణ లాంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాల నేర్పరచలేకపోయింది. అయితే బీజేపీ కంటే మెరుగైన ఫలితాలను సాధించి రెండవ స్థానంలో నిలిచింది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. జాతీయ పార్టీలకున్నట్టు ప్రాంతీయ పార్టీలకు సువిశాలమైన జాతీయ భావముండదు. తన ప్రాంతం, తన భాస, తన జిల్లా, తన కుటుంబం, తన రాష్ట్రం... ఆయా ప్రయోజనాలు ఇంతవరకే. ఇలాంటి ప్రాంతీయ భావాలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. లోకల్ కాంగ్రెస్ నాయకులు, జాతీయ నాయకులు ఈ సమస్యలను విడమర్చి చెప్పి అందుకు తగ్గ మ్యానిఫెస్టో, ప్రచారసరళిని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాయి. పోతే ప్రాంతీయ పార్టీల్లా కాంగ్రెస్‌కు సెంటిమెంట్లను రెచ్చగొట్టడం సాధ్యం కాలేదు. అందు వల్ల జాతీయ పార్టీ కాంగ్రెస్ ఈ రాష్ట్రాల్లో అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. వీటన్నింటినీ అధిగమించి తనను తాను సరిచేసుకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ రాష్ట్రాల్లోనూ అద్భుత ఫలితాలను సాధిస్తుంది. ఏదేమైనా దేశమంతటా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయన్నది వాస్తవం. ఎస్పీ, బీయస్పీ, ఆర్‌జెడి, జెడి లాంటి సామాజిక పార్టీలతో పొత్తు వల్ల దేశమొత్తంగానూ ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో అద్భుత ఫలితాలు సాధిస్తుంది. దక్షిణాది రాష్ట్రాలలో తెలుగుదేశం, డియంకె, జేడియులలో పొత్తుతో, ఈశాన్య రాష్ట్రాలలో వామపక్ష పార్టీలతో పొత్తుతో మెజారిటీ సీట్లను సాధించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ, మహారాష్ట్రలో కాంగ్రెస్ ఉండనే ఉన్నాయి. ఏదేమైనా యువనేత సమయోచిత నిర్ణయాలతో, భావస్వామ్య పార్టీల పొత్తులతో కాంగ్రెస్‌ను గెలుపుబాటలో నడిపించే అవకాశాలున్నాయి.

–డా॥ కాలువ మల్లయ్య
9182918567

రామప్ప హుండీ ఆదాయం రూ. 3,42,746

విజయక్రాంతి, ములుగు: ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయం హుండీ ఆదాయం రూ.3,42,746 వచ్చినట్లు ఆలయ ఈవో చిందం శ్రీనివాస్, గుడి ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వెంకటాపురం మండలంలోని రామప్ప దేవాలయం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత ఐదు నెలలుగా దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని హుండీలో వేసిన ఆదాయం ఈ రోజు ఉదయం 11 గంటలకు లెక్కింపు ప్రారంభించగా పూర్తయ్యే సరికి 3,42,746 వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాంబయ్య, సంతోష్, గుడి అయ్యగార్లు ఉమాశంకర్, హరీష్‌శర్మ తదితరులు ఉన్నారు.



ములుగు జిల్లా గెజిట్ జారీ చేసిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు

- ములుగు జిల్లా సాధన గౌరవ అధ్యక్షులు డాక్టర్ పోరిక రవీందర్

విజయక్రాంతి, ములుగు: ములుగు జిల్లా ఏర్పాటుకు గెజిట్ జారీ చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ములుగు జిల్లా సాధన గౌరవ అధ్యక్షులు డాక్టర్ పోరిక రవీందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సాధన సమితి అధ్యక్షులు ముంజాల భిక్షపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్ర పటానికి సాధన సమితి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం జిల్లా సాధన సమితి నాయకుల ఆధ్వర్యంలో ములుగు జిల్లా సాధన గౌరవ అధ్యక్షులు పోరిక రవీందర్‌కు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ జిల్లా సాధన కోసం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతితో కలిసి నాలుగు సంవత్సరాల క్రితమే ఒక ప్రణాళిక ప్రకారం ముందువెళ్లి, ముందుగా విద్యార్థులతో ఉద్యమం ప్రారంభించామని, అదే విధంగా అన్ని కుల సంఘాలు, వివిధ పార్టీలతో జేఏసీగా ఏర్పడి నాలుగు సంవత్సరాలుగా ఉద్యమాన్ని కొనసాగించామని ఆయన తెలిపారు. కాగా సీఎం కేసిఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ములుగును జిల్లాగా ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. ఇప్పటికే ఎన్నో రకాలుగా వెనకబడుతున్న ములుగు జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి పరంగా ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, సాధన సమితి నాయకులు నూనె శ్రీనివాస్, సాధన సమితి ప్రధాన కార్యదర్శి కలువల సంజీవ, గుండెబోయిన వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి పుష్పాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: ఎన్నారై టీఆర్‌ఎస్ సెల్ యూకే బాధ్యులు శానబోయిన రాజ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్నారై టీఆర్‌ఎస్ సెల్ దుగ్గొండి విభాగం సభ్యులు వెంకటాపురం, దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి పొగాకు బాలకృష్ణ సహకారంతో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మల్రిపల్లె, చాపలబండ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మాస కుమారస్వామి, ఇటుకల దేవేందర్ సహకారంతో నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, కంపాక్స్ బాక్సులను అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జీ.రత్నాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, చాపలబండ హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, దొగ్గ్రాయి హెచ్‌ఎం కుమారస్వామి, ఎన్నారై టీఆర్‌ఎస్ సెల్ మిత్ర బృందం పొగాకు బాలకృష్ణ, అంబర్ రమేష్, బొంతల సాయికుమార్, మామిడాల వేణు, గోనె రాజు, ధరావత్ రాజశేఖర్, బండ రాము, బలభద్ర ఉదయ్, ఇనుముల కిషోర్, బాసాని అనిల్, కక్కెర్ల ప్రమోద్, యాదగిరి సుధాకర్, పాలడుగుల శివ, రొట్టె రాజేందర్, టీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు పోయిన శీను, సద్ది మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో క్యాలెండర్ అవిష్కరించిన ఎంపీ కల్వకుంట్ల కవిత

విజయక్రాంతి, నిజామాబాద్అర్బన్: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా టేబుల్ క్యాలండర్‌ను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిజామాబాద్ టీఎన్‌జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆలుక కిషన్, సంగం అమృత్‌కుమార్ అధ్వర్యంలో టీఎన్‌జీవో నేతలు ఎంపీ కవితను కలిసి పుష్పగుచ్చాలు అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత నూతన సంవత్సర క్యాలండర్‌ను అవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందచెయ్యడంలో ఉద్యోగులు వారధిలాగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులతో ఫ్రెండ్లీగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.దయానంద్, వెంకట్‌రెడ్డిలతో పాటు జిల్లా సహఅధ్యక్షులు నారాయణరెడ్డి, కేంద్ర సంఘం బాధ్యులు బండి నరహరి, కార్యనిర్వహక కార్యదర్శి పోల శ్రీనివాస్, జాఫర్, జాకీర్‌హుస్సేన్, సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల సంగీత విభావరిని విజయవంతం చేయాలి



విజయక్రాంతి, నిజామాబాద్అర్బన్: జలగం తిరుపతిరావు ఫౌండేషన్ సమర్పించు పాటల పద్మశ్రీ ఘంటసాల సంగీత విభావరి 'మనసు పరిమళించెనే' కార్యక్రమం జిల్లా కేంద్రంలో ఈ నెల 6న జరుగుతుందని, సంగీత అభిమానులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేటీఆర్ పౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జలగం తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అదివారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జేటీఆర్ ఫౌండేషన్ సమర్పించు సంగీత విభావరిని రాగమాలిక, శ్రీపాద నాటక కళాపరిషత్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, సీతారామయ్య సంగీత సేవాట్రస్ట్‌ల సహకారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. వ్యాఖ్యాతగా ఎస్‌వి రామారావు వ్యవహరిస్తుండగా ఆర్కెస్ట్రాలో సీతారామయ్య, మోహన్ తబలా డోలక్‌లను అనిల్, ప్యాడ్స్ దయాకర్, గిటార్‌ను రవికిరణ్‌లు వాయిస్తారని పేర్కొన్నారు. గాయనీ గాయకులు శ్రీపాదకుమార శర్మ, వన్నేల్‌దాస్ లింబాద్రి, వి.ఎ. లక్ష్మి, టి.విజయలక్ష్మి, డాక్టర్ నీలి రాంచందర్, శంకర్‌గౌడ్, చంద్రకళ, వేముల శేఖర్, నాగారాజు శర్మ, రేణుకలు ఘంటసాల పాటలను అలపిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ చరిత్రకారులు, సీనియర్ పాత్రికేయులు ఎస్వీ రామారావుకు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సంగీతాభిమానులు హాజరు కావాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

విజయక్రాంతి, అచ్చంపేట: ప్రజా సంక్షేమం, కార్మిక హక్కుల రక్షణ, ఆర్థిక స్వావలంబనను కాపాడేందుకై ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెను అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సమ్మె వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

మత్తు పదార్థాల అడ్డాగా కామారెడ్డి..?

- గతంలో భారీగా పట్టుబడ్డ వైనం
- రాష్ట్ర స్థాయి అధికారుల ప్రత్యేక దృష్టి
- జిల్లా అధికారులు ఏం చేస్తున్నట్టు..?

విజయక్రాంతి, కామారెడ్డి: జిల్లా కేంద్రంగా మారిన నాటి నుంచి అనేక విధాలుగా అభివృద్ధి చెందాల్సిన కామారెడ్డి మత్తు పదార్థాల సరఫరాకు అడ్డాగా మారిందా..? జిల్లా కేంద్రం అడ్డాగా మత్తు పదార్థాల సరఫరా సాగుతోందా..? దీనిపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడిందా..? జిల్లా కేంద్రం తప్ప సరిహద్దు ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టడంలో అధికారులు విఫలమౌతున్నారా..? ఈ ప్రశ్నలన్నింటికి అవుననే సమాధానం వస్తోంది. ఎందుకంటే గతంలో జరిగిన పరిణామాలు, రెండు రోజుల క్రితం రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాలో మకాం వేసి మరీ పక్క సమాచారం మేరకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 2 కోట్ల 40 లక్షల విలువ చేసే 40 కిలోల అల్ఫాజోలంను పట్టుకోవడం ఆ ప్రశ్నలకు మరింత బలాన్నిస్తుంది. ఈ నెల 2వ తేదీన దొరికిన అల్ఫాజోలం విషయం జిల్లా అంతటా వ్యాపించి చర్చనీయాంశంగా మారింది. సరిహద్దులు దాటుతున్న మత్తు పదార్థాల విషయంలో జిల్లా అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రవాణాకు అధికారులు ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ భారీగా..

కామారెడ్డి నియోజకవర్గంలో గతంలో భారీగా మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో ఆబ్కారీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి అల్ఫాజోలంను పట్టుకున్నారు. ఆ సమయంలో పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో ఒకరు, నిజామాబాద్‌లో ఒకరిని పట్టుకుని విచారించగా 2 కిలోల మత్తు మందును వారి నుంచి స్వాధీనపరుచుకున్నారు. మరోసారి రైలులో తరలిస్తున్న మత్తు పదార్థాలను అధికారులు పట్టుకున్నారు. గత 2 సంవత్సరాల నుంచి ఆబ్కారీ శాఖ అధికారులు తనిఖీలపై దృష్టి పెట్టకపోవడంతో మత్తు పదార్థాల అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది.

జిల్లా అధికారులకు తెలియకుండా సరఫరా..?

ఈ మత్తు పదార్థాల సరఫరా జిల్లా అధికారులకు తెలియకుండానే సాగుతోందా అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన అధికారులు 2 సంవత్సరాలుగా పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా జిల్లా అధికారులకు సమాచారం లేకుండా రాష్ట్ర స్థాయి అధికారులే నేరుగా రంగంలోకి దిగడం పలు అనుమానాలకు తావిస్తోంది. పక్కా సమాచారం ప్రకారమే రాష్ట్ర స్థాయి అధికారులు కామారెడ్డి బైపాస్ రోడ్డుపై మాటు వేసినట్టు తెలుస్తోంది. జిల్లా అధికారులకు తెలియకుండా రవాణాకు సంబంధించిన సమాచారాన్ని



సేకరించి 40 కిలోల అల్ఫాజోలంను పట్టుకున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాకు వచ్చి అక్రమ రవాణాను అడ్డుకోవడం జిల్లా అధికారుల చేతకానితనానికి నిదర్శనమని ప్రజలు భావిస్తున్నారు.

అధికారుల నిఘా తప్పనిసరి

రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా నలుమూలలా అధికారులు తనిఖీలు చేపట్టాలి. గత ఎన్నికల్లో అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా నామమాత్రంగానే తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర చరిత్రలోనే 2 కోట్ల 40 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను పట్టుకున్న సందర్భాలు లేవు. ఇలాంటి నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న మత్తు పదార్థాల సరఫరాకు అధికారులు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సామాన్యుడికి కలగానే సర్పంచ్ పదవి

- ఎన్నికల్లో ధన ప్రవాహానిదే హవా
- లక్షలు కుమ్మరిస్తున్నా పట్టించుకోని అధికారులు

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: సర్పంచ్ పదవి సామాన్యులకు కలగానే మిగిలిపోనున్నది. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు కోటీశ్వరులే పోటీ చేస్తుండగా గ్రామాల్లో ఉండే సర్పంచ్ పదవిని దక్కించుకోవాలనుకుంటున్న సామాన్యులకు ఆ పదవి సైతం దక్కించుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీచేసి గెలుపొంది గ్రామానికి సేవ చేద్దామనుకుంటున్న యువకులు ఎన్నికల్లో ఖర్చును చూసి వామ్మో అంటున్నారు. ధన ప్రవాహం ముందు సామాన్యులు ఓడిపోతున్నారు. పదవి దక్కించుకోవడానికి డబ్బున్న వారు పోటీపడి వేలం పాటల్లో దక్కించుకుంటుండగా మరికొందరు ఎన్నికల్లో నిలబడి లక్షలు కుమ్మరించి పదవులను కైవసం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ధన ప్రవాహం ఏరులై పారనున్నది.



డబ్బున్న వాడికే పదవి వచ్చేలా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఏకగ్రీవాల పేరుతో లక్షల రూపాయలు కుమ్మరించి పదవులను దక్కించుకుంటున్నారు. డబ్బున్నోడికే సర్పంచ్ పదవులు దక్కుతుండటంతో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది.

డబ్బు ఎంతైనా ఫర్వాలేదు.. గెలిచి తీరాలి..

వేలం పాటలో సర్పంచ్ పదవి దక్కకపోతే డబ్బు ఎంతైనా ఫర్వాలేదు.. పదవి దక్కించుకోవాలనే వ్యూహరచనలో డబ్బున్న వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా మొదట గ్రామాల్లో సెంటిమెంట్లను రగుల్చుతున్నారు. ఏకగ్రీవాలైతే ప్రభుత్వం నుంచి చేయూత అందుతుందని, ఆ డబ్బుతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని కుల సంఘాల పెద్దలకు, గ్రామంలోని చోటా మోటా నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ వినకపోతే డబ్బుతో చోటా, మోటా నాయకులను, కులసంఘాల నాయకులను కొనేందుకు యత్నిస్తున్నారు. ఒకవేళ అన్నీ విఫలమైనా ఎన్నికల బరిలో నిలబడి లక్షలు కుమ్మరించి సర్పంచ్ పదవిని కైవసం చేసుకోవాలని డబ్బున్న వారు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సామాన్యులు పోటీకి సైతం సాహసించే పరిస్థితులు కనిపించడం లేదు. ఇలాంటి వారు గ్రామానికి ఏం అభివృద్ధి చేస్తారో... ప్రజలకు ఎలాంటి న్యాయం చేస్తారో ఒక్కసారి ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కళాశాల వసతి గృహాల్లో కష్టాలెన్నో...

- అద్దె భవనాలతో అవస్థలు
- నీటి వసతి లేక విద్యార్థుల నిరసన
- పక్కా భవనాలకు ప్రణాళిక లేదా?

విజయక్రాంతి, బాన్సువాడ: గతంలో 10 వతరగతి విద్యార్థులకు మాత్రమే హాస్టల్‌లు ఉండేవి. కానీ ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని ఒక మంచి ఆలోచన చేసి వాటిని ఏర్పాటు చేసింది. వివిధ కళాశాలల్లో చదివే విద్యార్థులకు వసతి ఏర్పాటు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణాలలో ఉండి చదివేందుకు ఎలాంటి ఆటంకాలు లేని పరిస్థితి నెలకొంది. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అందరూ హర్షం వ్యక్తం చేశారు. దీనికి విద్యార్థుల నుంచి కూడా మంచి స్పందన వచ్చి వసతి గృహాలలో చేరడానికి ఆసక్తి చూపించారు.

అద్దె భవనాలతో అవస్థలు

మంచి ఆలోచనతో ఏర్పాటు చేసిన కళాశాల హాస్టల్లకు సంవత్సరాలుగా అద్దె భవనాలు గతి కావడం



ఇబ్బందులకు లోను చేస్తుంది. మొదట ప్రారంభ సమయంలో అద్దె భవనాలలో నడుపుతారని అందరూ అనుకున్నారు. కానీ ఎన్ని సంవత్సరాలైనా పక్కా భవనాల ఆలోచనలు లేకపోవడం విద్యార్థులకు అసహనం కల్గిస్తుంది. బాన్సువాడ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ఎస్టీ బాలుర విద్యార్థులకు మాత్రం బస్సు డిపో దగ్గర పక్కా భవనం నిర్మించారు. బీసీ వసతి గృహం జండా గల్లీలో ఒక అద్దె ఇంటిలో నడుపుతున్నారు. ఎస్సీ వసతి గృహం ఎంపీడీవో కార్యాలయం ముందు గల వసతి గృహంలో నడుపుతున్నారు. బాలికలకు కూడా వసతి గృహాలు ఉన్నా అవి కూడా టీచర్స్ కాలనీలోని అద్దె గృహలలో ఉన్నాయి. ఎస్సీ బాలుర హస్టల్‌లో నీటి వసతి లేక దగ్గర ఉన్నా స్మశానంలో గల బోర్ వద్దకు వెళ్లి స్నానాలు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఆలోచన చేసి కళాశాల వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతే కాకుండా వీరికి ఇన్‌చార్జి వార్డెన్‌లు ఉండటం వలన సరైన ఆహారం అందడం లేదు. ఒక వార్డెన్ రెండు మూడు హాస్టళ్లను చూసుకోవడం వలన కూరగాయలు, ఇతర వస్తువులు తెప్పించే వారు లేరని విద్యార్థులు అంటున్నారు. ముందు విద్యార్థులకు ఖర్చు పెడితే తరువాత బిల్లుల రూపంలో వార్డెన్‌లకు డబ్బులు వస్తున్నాయి. దీంతో వార్డెన్‌లు హాస్టల్ల మీద సరిగ్గా దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం కళాశాల వసతి గృహాల గురించి పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాకెవరు దిక్కు..? ప్రజల అయోమయం..

- విలీన గ్రామస్తుల ఆవేదన
- గ్రామాల్లో రెండు శాఖల పాలన

విజయక్రాంతి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజల్లో అయోమయం నెలకొంది. గతేడాది సర్కార్ గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీల్లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ పాలక వర్గం పదవీ కాలం ముగియగానే వాటిని ఆయా మున్సిపాల్టీల్లో విలీనం చేయాలనే ఆలోచన చేసింది. పంచాయతీల పదవీ కాలం ముగిసినా పలు గ్రామాలు మున్సిపాల్టీల్లో విలీనం కాలేదు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులను ఆశ్రయించడంతో విలీనం కాస్తా ఆగిపోయింది. ఇప్పుడు ఆ గ్రామాల్లో పాలన రెండు శాఖలతో కొనసాగుతోంది. నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో వింత పాలన కొనసాగుతోంది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలకు శివారులో ఉన్న గ్రామాలను ఆయా మున్సిపాల్టీల్లో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత దాన్ని గాలికి వదిలేసింది. దీంతో విలీనం అయిన గ్రామ పంచాయతీల్లో మున్సిపల్ అధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. కొన్ని గ్రామాలపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఆ గ్రామాల్లో పంచాయతీరాజ్ యధావిధిగా విధులు నిర్వహిస్తుండగా మున్సిపల్ ప్రత్యేక అధికారులు సైతం విధులు నిర్వహిస్తున్నారు. బోర్గం(పి), పాంగ్రా, గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, మానిక్ భండార్, ఖానాపూర్, కాలూర్, సారంగపూర్‌లను నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. కార్పొరేషన్‌లో విలీనాన్ని వ్యతిరేకిస్తూ కొందరు నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు విలీనంపై స్టే ఇవ్వడంతో ఏడు గ్రామ పంచాయతీల విలీనం నిలిచిపోయింది. ఏడు గ్రామ పంచాయతీలకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారులను నియమించింది. గ్రామాల్లో ప్రస్తుతం కార్పొరేషన్, పంచాయతీ రెండు శాఖలు పనిచేయడంపై ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.



గ్రామాల్లో రెండు శాఖల అధికారులు..

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శివారులోని 8 గ్రామ పంచాయతీలను సర్కార్ కార్పొరేషన్‌లో విలీనం చేయగా ఇందులో 7 గ్రామాలు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాయి. ఇందులో మానిక్‌భండార్ గ్రామ పంచాయతీపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో ఆ గ్రామం కార్పొరేషన్‌లో దాదాపుగా విలీనం అయినట్లే. ప్రస్తుతం మానిక్‌భండార్ మాత్రమే మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తోంది. ప్రజలు ఆస్తి పన్నుతో పాటు నిర్మాణాల కోసం అనుమతులను కార్పొరేషన్ నుంచి పొందుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులకు 8 గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. 7 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యాలయాలు యధావిధిగా పనిచేస్తున్నాయి. ఇవే గ్రామాలకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారులను నియమించింది. సర్కార్ తీసుకున్న నిర్ణయంతో విలీన గ్రామాల ప్రజలు తమ గోడును ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు జరగకపోవడం, మున్సిపల్ అధికారులు పట్టించుకోపోవడంతో గ్రామాలు అనాథలుగా మారాయి.

'విజయక్రాంతి' విజయ ఢంకా మోగించాలి

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- క్యాలెండర్ ఆవిష్కరణ, అభినందనలు

విజయక్రాంతి, కొల్లాపూర్: నూతన సంవత్సరంలో విజయక్రాంతి పత్రిక విజయఢంకా మోగించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాడు విజయక్రాంతి కొల్లాపూర్ రిపోర్టర్ ఔట రాజశేఖర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయక్రాంతి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముందు వరుసలో ఉందన్నారు. గత కాలంలో విజయక్రాంతి తీసుకొచ్చిన ప్రత్యేక శీర్షికలను అభినందించారు. భవిష్యత్తులో విజయక్రాంతి విజయ ఢంకా మోగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రత్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కాటం జంబులయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండల వెంకటస్వామి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, మండల అధ్యక్షుడు ముచ్చర్ల రాంచందర్ యాదవ్, సురేందర్‌సింగ్, ఓర మల్లయ్య, రిటైర్డ్ ఎంఈవో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఊడితే ఏ నాయకుడూ పట్టించుకోడు

- నగర పంచాయతీ అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే బీరం

విజయక్రాంతి, కొల్లాపూర్: పట్టణంలో ఏ వీధుల్లో చూసినా పరిశుభ్రత లేకపోవడంతో నగర పంచాయతీ అధికారులపై ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అయ్యుండి సమస్యలను పట్టించుకోకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ఉద్యోగం ఊడి కట్టుబట్టలతో నడిరోడ్డుమీద నిలబడితే ఏ నాయకుడూ పట్టించుకోడని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం రామమందిరంలో పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని జమ్మేనిగడ్డ, ఉడివేల ఎస్సీ కాలనీ, జయశంకర్ కాలనీలో గల్లీగల్లి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఏ వీధుల్లో చూసినా చెత్త దర్శనమివ్వడంతో నగర పంచాయతీ ఈఈ ప్రవీణ్, నాగశేషయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలిపారు. వీధుల్లో మురికి కాలువలు, సీసీ రోడ్లు సక్రమంగా లేవని, గత పాలకులు పదవుల్లో ఉన్నంత కాలం మా కాలనీ అభివృద్ధికి చేసిందేమీ లేదని వాపోయారు. మిషన్ భగీరథ కాలువలు అసంపూర్తిగా ఉండడంతో ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల నుండి ఏం చేస్తున్నారు..? ప్రతి రోజూ ఒక కాలనీకి తిరిగి సమస్యను పరిష్కరించేది లేదా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ ప్రజలు పెన్షన్, గుడి నిర్మాణాలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎస్సీ కాలనీల్లో ఏళ్ల తరబడి పూరిగుడిసెల్లో ఉంటున్న కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం రెండు పడకల గదులను ప్రారంభిస్తే తక్షణమే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వున్నారు.

శబరిమలలో స్త్రీల ప్రవేశం కుట్రే

- అయ్యప్ప స్వాముల ర్యాలీ, ధర్నా

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: ప్రాచీన సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించేలా పాలకులు, న్యాయ వ్యవస్థ తీర్పులను ఇవ్వాలే తప్ప హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా తీర్పులను ఇవ్వడం సరికాదని అయ్యప్ప సేవా సమితి నాయకులు పులేందర్‌రెడ్డి అన్నారు. శబరిమల ఆలయంలోకి నిషేధిత వయస్సు గల ఇద్దరు మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని మూసి వేసి ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. సేవ్ శబరిమల నినాదాలతో పురవీధులు దద్దరిల్లాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూర్వకంగా హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే నిషేధ మహిళలను పవిత్ర శబరిమల ఆలయంలోకి నేరుగా దర్శనానికి తీసుకెళ్లి ప్రాచీన సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. కేరళ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఖానాపూర్ ప్రదీప్, ప్రధాన కార్యదర్శి నరేష్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వాములు రంగయ్య, లక్ష్మణ్, తిరుపతయ్య, జగన్‌మోహన్, శివ, పాండు, పిడికిళ్ల జంగయ్య, దినేష్ వందలాది మంది అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీ కవితకు వినతి

విజయక్రాంతి, నర్సంపేట: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు, టీఆర్‌ఎస్‌కేవీ ఇన్‌చార్జ్ నల్లా భారతి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నిజామాబాద్ ఎంపీ కవితను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. హైదరాబాద్‌లో ఎంపీని కలిసి మొదటగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారతి అంగన్‌వాడీల సమస్యలను వివరించారు. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్‌లకు మూడు వేల రూపాయలతో పాటు మరో పదిహేను వందలు, ఆయాలకు ఇచ్చే పది హేను వందలకు మరో ఏడు వందల యాభై పెంచి ఇస్తామని ప్రకటించి నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి తమ వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

విజయక్రాంతి, నర్సంపేట: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందాలని ఏఐసీసీ సభ్యుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. నర్సంపేట మండలం రాజుపేట మాజీ ఎంపీటీసీ వీరన్న టీఆర్‌ఎస్ పార్టీనీ వీడి శుక్రవారం తన అనుచరులతో దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఉండి సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసే భాధ్యత గ్రామ, మండల కమిటీలు తీసుకొని ప్రత్యర్థిని ఢీకొనే స్థాయి ఉన్న వారిని, పార్టీ కోసం పని చేసిన నాయకులను ఎంపిక చేయాలని సూచించారు. టీఆర్‌ఎస్ పార్టీ అధికార బలంతో ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లొంగ కుండా ఉండేందుకు ఓటర్లను కలిసి ప్రభుత్వ విధానాలను వివరించాలని అన్నారు. గత ఐదేండ్లలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు శూన్యమని, ఇదే విషయాన్ని ఓటర్లకు తెలియపర్చి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ఓట్లు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పెండెం రామానంద్, మండల పార్టీ అద్యక్షుడు లక్ష్మణ్ నాయక్, తుమ్మలపెల్లి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ భూసేకరణను నెలాఖరులోపు పూర్తి చేయాలి: కలెక్టర్

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: జిల్లాలో పెండింగ్ భూసేకరణ పనులు, జాతీయ రహదారి భూసేకరణ పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డి .రోనాల్డ్‌రోస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి దేవసూగూరు నుంచి జడ్చర్ల వరకు నాలుగు లైన్ల రైల్వే డబ్లింగ్ పునలు సర్వే పూర్తి చేయాలని, సర్వేలో ఏవైనా సమస్యలు వస్తే ఆర్‌డీవోలకు తెలపాలని, జాతీయ రదారి పనులు 2వ ఫేస్‌లో 125 ఎకరాలు సర్వే పూర్తి అయ్యిందని, హెడ్ మార్కింగ్ చేసి సర్వే పూర్తి చేసి మూడవ ఫేస్‌కు ఫైనల్ సబ్‌మిట్ చేయాలని, ఎక్సెస్ ఏమైనా సమస్యలుంటే మా దృష్టికి తేవాలని, మూడవ ఫేస్‌కు సంబంధించిన ఈ నెలఖారు వరకు పూర్తి చేయాలని అన్నారు.

నిజాలను నిర్భయంగా రాసే పత్రిక విజయక్రాంతి

విజయక్రాంతి, దుబ్బాక: నిజాలను నిర్భయంగా రాసే పత్రిక అంటే విజయక్రాంతి దిన పత్రిక అని దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 2019 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ... ప్రజా సమస్యలను వెలిక్కి తీసే ఏకైక పత్రిక విజయ క్రాంతి అని గుర్తు చేశారు. విజయక్రాంతి పత్రిక ప్రజా సమస్యలే వెలికి తీయడంలో ముందుందన్నారు. నిజాలని నిర్భయంగా నిష్పక్షంగా రాసే పత్రిక అంటే విజయక్రాంతేనని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై విజయక్రాంతి సమరం సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విజయక్రాంతి దుబ్బాక జర్నలిస్టు కతైర నవీన్ కుమార్, జర్నలిస్టులు కాల్వలింగం, బండ నర్సింలు, కుంబాల రవి, టీఆర్‌ఎస్ నాయకులు తౌడ శ్రీను, రొట్టె రమేష్, బండి రాజు, నరేష్, శివకుమార్ పాల్గొన్నారు.

భెల్ చౌరస్తా.. ట్రాఫిక్ ఇక్కట్లకు అడ్డా!

విజయక్రాంతి, పటాన్‌చెరు: లింగంపల్లి చౌరస్తాలో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై బీహెచ్ఈఎల్ మొదలుకుని ఇస్నాపూర్ చౌరస్తా వరకు ట్రాఫిక్ సస్యమ్యలు ఎదురవుతున్నాయి. పటాన్‌చెరు పట్టణంలో వేస్తున్న పైప్‌లైన్ పనులతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది. రోడ్డు దాటుతున్న వ్యక్తులను వాహనాలు ఢీకొడుతున్న సంఘటనలు కూడా ఎక్కువవుతున్నాయి. పాదచారులు రోడ్డు దాటేందుకు జంకుతున్నారు. అశోక్‌నగర్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు రాత్రి పూట ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను సర్వీసు రోడ్లపై నిలుపుతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులను ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలుపుతుండడంతో రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. సర్వీసు రోడ్లను దాదాపు తొలగించేశారు. ప్రధానంగా సాయిరాం హోటల్ దగ్గరలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. లింగంపల్లి చౌరస్తాలోని సిగ్నల్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. బ్రాండ్ ఫ్యాక్టరీ ముందు ఆర్టీసీ బస్సులను నిలిపివేయడంతో ఫ్రీలెఫ్ట్‌కు అడ్డంకిగా మారింది. దానిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడ బస్సులను నిలపకుండా పాత ఎల్ఐజీ ఆఫీసు దగ్గర బస్సులు ఆపేలా చూడాలి.

ఆర్టీసీ బస్సులు భెల్‌లోకి వెళ్లె భారీ వాహనాలతో పాటు టౌన్‌షిప్‌లోకి వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థను సరిచేసి ఇక్కడ ట్రాఫిక్ లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. లింగంపల్లి నుంచి ఇస్నాపూర్ వరకు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవిశ్రంతంగా శ్రమిస్తున్నారు. స్థానిక లోపాలు సరిదిద్దుతే సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక

విజయక్రాంతి, మంచిర్యాల: ఈ నెల ఖమ్మంలో జరిగిన టిఎస్‌యూటిఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల్లో మంచిర్యాల జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా శాంతికుమారిని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజవేణు, ఆగాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సమస్యలపై పోరాటమేకాకుండా సామాజిక స్పృహతో సమాజమార్పునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తమని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన వారికి సంఘంలో ఉన్నత పదవులు అందడం పట్ల జిల్లా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి పట్టివేత

విజయక్రాంతి, చెన్నూర్ (మంచిర్యాల): మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజక వర్గం కేంద్రంలో ఈరోజు ఉదయం గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్.ఐ లోభానంద్ తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తి మొహమ్మద్ అక్బర్, తండ్రి జానీమియాగా గుర్తించారు. గంజాయిని బెల్లంపల్లి నుంచి కొత్తూరు, నార్వాయిపేటకు చేరవేస్తున్నట్లు నేరస్థుడు అంగీకరించాడన్నారు. అతని వద్ద నుంచి 20 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకొని నిందితుడిన్ని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

ఏకగ్రీవం చేస్తే బంపర్ ఆఫర్

విజయక్రాంతి, కొడంగల్: రానున్న పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు బంఫర్ ఆఫర్ ఇస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలో టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నాయకులతో మాట్లాడుతు గ్రామాలలో టీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సర్పంచ్ గెలిచే గ్రామాలలోని అభ్యర్థులను ఎకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ గ్రామాలకు పార్టీ సమక్షంలో బంపర్ ఆఫర్ ఇచ్చి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామిలు ఇచ్చారు. పార్టీలో గ్రూపు గ్రూపులుగా ఏర్పాడి ఒకరిపై ఒకరు పోటీ పడకుండ ముందస్తుగా ఒకరినే ఎన్నుకుని వారిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఎలాంటి సమస్యలు వచ్చినా తానే ముందుండి చూసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మాజీ జెడ్పీటీసీ ఎనుగుల భాస్కర్, నాయకులు మధుసూదన్‌యాదవ్‌లతో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన చిన్నారి

విజయక్రాంతి, దుబ్బాక: ఇటీవల రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన విధితమే. హైద్రాబాద్‌లోని ఆ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నాయిని గణేష్(35) స్వంత గ్రామం దుబ్బాక మండలం ఆకారం గ్రామం. ఆయన బతుకుదెరువు కోసం కాంగ్రెస్ నాయకుడైన మద్దుల నాగేశ్వర్ రెడ్డికి చెందిన ఓ కారుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల దుబ్బాక ఆకారం రోడ్డు ప్రమాదంలో గణేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతితో దుబ్బాక పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గణేష్‌కు కుమారులు లేకపోవడంతో తన ఐదు సంవత్సరాల కూతురు తన తండ్రికి తల కొరివి పెట్టింది. దీంతో ఆ చిన్నారిని చూసి దుబ్బాకలో ప్రతి ఒక్కరు కన్నీరు పెట్టారు. గణేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏకగ్రీవానికి బుజ్జగింపులు

- ఎన్నికలు సమీపించినా గౌరవ వేతనం ఏదీ?
- ఏకగ్రీవ పంచాయతీలు చేసేందుకు అధికార పార్టీ నేతల యత్నం
- ఏకగ్రీవం అయితే రూ.10 లక్షలు నజరానా..



విజయక్రాంతి, వికారాబాద్: ప్రస్తుతం గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఏ గ్రామంలో చూసిన ఎన్నికల హడావుడి నెలకొంది. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసేవారు ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం 6 నుంచి 10 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థిని ఏక గ్రీవంగా ఎన్నుకొంటే ప్రభుత్వ పరంగా గ్రామానికి రూ.10 లక్షలు నజరానా ఇవ్వడంతో పాటు.. గ్రామ అభివృద్ధికి గాను ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గ్రామంలోని సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గ్రామ స్థాయిలోని ముఖ్య నాయకులతో కలిసి ఏక గ్రీవ గ్రామ పంచాయితీలు చేసేందుకు పావులు కదుపుతున్నారు. వికారాబాద్ జిల్లాలో గతంలో 367 గ్రామ పంచాయతీలు ఉంటే వాటిలో 29 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ 29 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు నజరాను కూడా గత కొన్ని నెలల క్రితం ఇచ్చింది. ప్రస్తుతం జిల్లాలో కొత్త గ్రామ పంచాయతీలతో కలుపుకొని 565 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 7వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం మొదలై ఈ నెల 30 వ తేదీ తో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగియనున్నాయి.

ఇంకా విదిల్చని గౌరవ వేతనం

వికారాబాద్ జిల్లాలో గతంలో 367 గ్రామ పంచాయితీలు (పాతవి)ఉండేవి. వీటికి సంబంధించి 367 మంది సర్పంచ్‌లకు సంబంధించిన గౌరవ వేతనాలు 18 నెలలుగా రూ.3.30 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2015 సంవత్సరం నుంచి సర్పంచ్‌ల గౌరవ వేతనం రూ.5 వేలు ఇవ్వనున్నట్లు టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు కేవలం 16 నెలలకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లించింది. మిగతా 18 నెలల గౌరవ వేతనం గతంలో ఉన్న సర్పంచ్‌లకు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే మరో మూడు నెలల గౌరవ వేతనం సంబంధిత సర్పంచ్‌లకు చెల్లించామని అధికారులు చెబుతున్నారు. సర్పంచ్‌ల పదవి కాలం పూర్తి అయిన సర్పంచ్‌లకు చెల్లించాల్సిన పెండింగ్ గౌరవ వేతనం పైసా కూడా రాలేదంటు మాజీ సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పైసా కూడా రాలేదు

అర చేతిలో వైకుంఠం చూపే విధంగా కేసీఆర్ మాట్లాడుతారు తప్ప పనులు చేయరు. సర్పంచ్‌లకు సైతం అదే తీరుగా గతంలో హామీ ఇచ్చారు. గౌరవవేతనం ఇస్తాం..మాజీ సర్పంచ్‌లకు పింఛన్లు ఇస్తామంటూ కల్లబొల్లి మాటలు గతంలో కేసీఆర్ చెప్పారు. సర్పంచ్‌గా కొనసాగినన్ని రోజుల్లో 16 నెలల గౌరవ వేతనం మాత్రం సర్పంచ్‌లకు చెల్లించారు. మరో 18 నెలల గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ విషయమై ఎప్పుడు అధికారులను అడిగినా ప్రభుత్వం నుంచి రాలేదని సమాధానం చెప్పేవారు. అధికారులు మూడు నెలల గౌరవ వేతనం ఇచ్చామని చెప్పడం అబద్ధం. ఇస్తే ఎవరి అకౌంట్లో డబ్బులు వేశారో తెలియజేయాలి.



రాజేందర్‌రెడ్డి, ఎబ్బనూరు మాజీ సర్పంచ్

సింగరేణిలో ప్రాణాలతో చెలగాటం

వైద్యాధికారిని బదిలీ చేయాలని గుర్తింపు సంఘం డిమాండ్



విజయక్రాంతి, రామగుండం: సింగరేణిలో అనారోగ్యంతో ఉన్న కార్మికుల ప్రాణాలతో వైద్యశాఖ చెలగాటం ఆడుతుందని టీఆర్‌ఎస్ అనుబంధ గుర్తింపు సంఘం టిబిజికెఎస్ ఆరోపించింది. ఈ మేరకు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న జీడీకె–5వ బొగ్గుగని కార్మికుడు ఈసంపల్లి కుమార్ పట్ల వైద్యబృందం చూపుతున్న నిర్లక్ష్యాన్ని సంఘ నేతలు ఆక్షేపణ వ్యక్తం చేస్తూ శుక్రవారం కుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా టిబిజికెఎస్ రామగుండం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గండ్ర దామోదర్ రావు మీడియాతో మాట్లాడుతూ కడుపునొప్పితో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేరగా అతని పరిస్థితి తీవ్రస్థాయికి చేరుకున్నప్పటికీ గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌కు రెఫర్ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కుమార్ కడుపులో గడ్డలు ఉండగా, ఈ గడ్డను తొలగించడానికి ఆసుప్రతి వైద్యులు ఆపరేషన్ చేసినప్పటికీ ఆ గడ్డలు తొలగించలేక అలాగే కుట్లువేసి చిత్రం చూస్తున్నారన్నారు.

ఈ తరహాలో ఎంతోమంది కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్మికుల ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అడిషనల్ ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాతను తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.కృష్ణమూర్తి, మండ రమేష్, జనగామ శ్రీనివాస్, యాదవరెడ్డి, రత్నమాల తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



విజయక్రాంతి, పటాన్‌చెరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పటాన్‌చెరు నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణం ఎల్ఐజీ కాలనీలో కెఎస్‌జీ ట్రస్టు ఆధ్వర్యంలో 45 రోజుల పాటు సాగిన మగ్గం వర్క్స్ శిక్షణ పూర్తయిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందిన మహిళలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్‌ను శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెద్ద మొత్తంలో మహిళలు మగ్గం వర్క్స్ శిక్షణ శిబిరంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో స్వయం కృషితో ఎదగాలని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు సొంతంగా వర్క్‌షాప్‌లను పెట్టుకొని జీవనం సాగించాలని పేర్కొన్నారు. మహిళలందరూ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సీడీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వీటితో పాటు కెఎస్‌జీ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమ్మ, ఈశ్వరి, లావణ్య, కళ, కాంచన, నవీన, జగదీశ్వరి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల ఆలయాన్ని రక్షించుకుందాం

విజయక్రాంతి, మంచిర్యాల: అయ్యప్ప ఆలయానికి అపచారం కలిగించే కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్రీయ హిందు సేన జిల్లా ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు పిలుపునిచ్చారు. 28 సెప్టెంబర్ 2018న సుప్రీం కోర్టు ధర్మాసనం శబరిమల ఆలయంపై వెలువర్చిన తీర్పు హిందు దేవాలయాల ఆచార వ్యవహారాను మంట గలిపే విధంగా ఉన్నాయని వారన్నారు. తీర్పు వచ్చిన నాటి నుంచి నాస్తికులు అన్యమస్తులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. హిందువులు ఏకమై హిందు సంసృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ హిందు సేన ప్రతినిధులు ప్రవీణ్, ప్రదీప్, నాగభూషన్, అరుణ్, సతీష్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

దేశా వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

విజయక్రాంతి, దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, దానికి వ్యతిరేకంగా ఈ నెల 8,9వ తేదిల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మచ్చ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోని వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని రెగ్యూలరైజ్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు అమలు చేయాలన్నారు. కార్మికులకు నూతన ఫించన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8,9 తేదిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా పంచాయతీ ఎన్నికలు

విజయక్రాంతి, కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు కూడా రసవత్తరంగా మారనున్నాయి. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీఘోర పరాజయం కావడంతో దురదృష్టకరంగా భావిస్తున్న ప్రజలు ఈ ఎన్నికలలో అయిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్‌లుగా గెలిచి రేవంత్‌రెడ్డి సత్తాను చాటేందుకు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రేవంత్‌రెడ్డికి కానుకగా ఇచ్చేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధం అవుతున్న తరుణంలో అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు మండల కేంద్రాలలో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశాలను ఏర్పాటు చేసి టీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు.

గ్రామాలలో టీఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఎకగ్రీవంగా చేస్తే అ గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకుపోవడమే కాకుండా బంపర్ ఆఫర్ ఇస్తామని అధికార పార్టీ ప్రకటించడంతో టీఆర్‌ఎస్ పార్టీలో నేను అంటే నేను అంటు నాయకులు పోటీకి సిద్ధమవుతున్నారు. అయితే ఒకే పార్టీలో గ్రూపులు ఏర్పడి పార్టీకి నష్టం తీసుకురాకుండా గెలిచే వారిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినా, గ్రామాలలో నాయకులు మాత్రం పట్టించుకోకుండా ఎవరికి వారే యమున తీరే అన్న రీతిలో ఉన్నట్లు సమాచారం. మరోపక్క కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆ పార్టీ నాయకులు గట్టి పోటీ ఇచ్చి టీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

తెరకెక్కిన ‘స్థానిక’ నినాదం!

- పార్టీల్లో నిశ్శబ్ద విప్లవం
- ఆశవాహుల్లో అలజడి
- పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లో చర్చనీయాంశం

విజయక్రాంతి, రామగుండం: తెలంగాణలో ప్రాముఖ్య తను సంతరించుకున్న పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడ్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ‘స్థానిక’ నినాదం రచ్చకెక్కింది. రాజకీయ వర్గాల్లోనే కాకుండా అన్ని వర్గాల్లో ఈ అంశంపై వాడీవేడి చర్చజరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీపడడానికి ఆశవాహులు ఆయా పార్టీల్లో మల్లగుల్లాలు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, జగిత్యాల జిల్లాలోని ధర్మపురి అసెంబీ సెగ్మెంటు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్నాయి. అయితే ఈ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో 1952 నుంచి ప్రాతినిధ్య ఎన్నికలు జరుగుతుండగా, అప్పటి నుంచి 2014 వరకు ఒకరిద్దరు తప్ప మిగిలిన వారందరు స్థానికేతరులే లోక్‌సభ సభ్యులుగా ఉంటుండమే ప్రస్తుతం ఈ చర్చకు కారణమయ్యింది. ఈ స్థానిక నినాదం అన్ని పార్టీల్లోను చెలరేగుతుంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీపడడానికి స్థానికేతరులుగా ఉన్న ఆశవాహుల్లో అలజడి ప్రారంభంకాగా, స్థానిక నినాదానికి బలం చేకూర్చడానికి స్థానికంగా ఆశవాహులుగా ఉన్న పలుపార్టీల్లోని నేతలు నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తున్నారు.

స్థానికులే మేలు..

1952 నుంచి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపక్షాన పోటీపడి లోక్‌సభ సభ్యులుగా ఎంఆర్.కృష్ణ, వి.తులసీరాం, కె.రాజమల్లు, జి.వెంకటస్వామి, జి.వివేక్‌లు ఉండగా, టిడిపి నుంచి లోక్‌సభ సభ్యులుగా గొట్టె భూపతి, సిహెచ్.సుగుణకుమారి ప్రాతినిధ్యం వహించారు. 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జి.వివేక్‌పై టిఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ 2.91 లక్షల మెజారిటీతో గెలుపొందారు. కాగా ఈ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ సభ్యుల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారంత స్థానికేతరులు కావడంతో ఇక్కడ ఈ లోక్‌సభ సభ్యులందరు అతిధి పాత్ర వహించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ ప్రాంత సమస్యలను, అభివృద్దిని పట్టించుకోలేదనే ఆరోపణలు కూడ సర్వత్రా ఉన్నాయి. తక్కువసార్లు ఇక్కడికి ఈ లోక్‌సభ సభ్యులు వస్తుంటారనే ఫిర్యాదులుసైతం ఉన్నాయి. కేంద్రప్రభుత్వ సంక్షేమానికి ఈ పారిశ్రామిక ప్రాంతం దూరంగా ఉందని అనేక సాక్ష్యాలు నిలువెత్తుగా లేకపోలేదు. ఈ నేపధ్యంలో పెద్దపల్లి పార్లమెంట్‌కు స్థానిక ప్రాతినిధ్యమే మేలుగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పార్టీల్లో అలజడి..

పెద్దపల్లి నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక నినాదం రచ్చకెక్కడంతో ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పోటీ పరిస్థితి డోలాయానంలో పడింది. ప్రాధానంగా అధికార పార్టీ టిఆర్‌ఎస్‌లో ఈ అలజడి కొనసాగుతోంది. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీపడి అపజయం పొందిన ప్రభుత్వ సలహాదారుడు, మాజీ ఎంపి డాక్టర్ జి.వివేక్ టిఆర్‌ఎస్ నుంచి పోటీపడడానికి సిద్దపడుతుండగా స్థానికేతర నినాదంతో రకరకాల కారణాలతో అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇటీవల ఎమ్మెల్యేలుగా గెలిచిన టిఆర్‌ఎస్ నేతలతోపాటు, ఓడిన మాజీ టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వివేక్ అభ్యర్థిత్వంపై వ్యతిరేకత చూపుతున్నట్టుగా తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి స్థానికంగా ఉన్న గోమాస శ్రీనివాస్, ఊట్ల వరప్రసాద్, గుమ్మడి కుమారస్వామి, బడికెల రాజలింగం పోటీ పడడానికి ఈ ప్రాంత నాయకత్వం ఊహాగానాలు చేస్తుండగా, బీజేపీ నుంచి ఎస్.కుమార్, కాసిపేట లింగయ్య పేర్లు బయటపడుతుండగా, మహాకూటమి లేని పక్షంలో మాజీ ఎంపీ సుగుణకుమారిని రంగంలోకి దించుతారనే ఊహాగానాలు బయటపడుతున్నాయి.

ఏదిఏమైన అధికార పార్టీ కీలకంగా ఉన్న ఈ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో ఎటువంటి రాజకీయ పోటీ వాతావరణం నెలకొంటుందో, స్థానిక నినాదం ఏమేరకు ఉంటుందో వేచిచూడాల్సిందే.

గీతం రిజిస్ట్రార్‌గా డాక్టర్ బాలాజీ

విజయక్రాంతి, పటాన్‌చెరు: పటాన్‌చెరు సమీపంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన రిజిస్టర్‌గా డాక్టర్ కేవీజీడీ బాలాజీ నియమితులయ్యారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా, రీసెర్చ్ అండ్ డెంలప్‌మెంట్ విభాగం డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ బాలాజీ బాధ్యతలు చేపట్టినట్లు శుక్రవారం తెలిపారు. దేశంలోని ప్రముఖ సివిల్ ఇంజనీర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ దాదాపు వందకుపైగా సివిల్ ఇంజనీరింగ్ పనులకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ రంగంపై నాలుగు గ్రంథాలను వెలువరించడంతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో 58కి పైగా పరిశోధన పత్రాలను సమర్పించినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం(యూజీసీ) భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంజూరు చేసిన ఏడు పరిశోధన ప్రాజెక్టులలో ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు. పలువురు పరిశోధక విద్యార్థులకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్న డాక్టర్ బాలాజీ సివిల్ ఇంజనీరింగ్‌లో స్ట్రక్చర్స్ నిపుణుడిగా పేరుపొందినట్లు వివరించారు. గీతం రిజిస్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ బాలాజీని హైదరాబాద్ గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ శివప్రసాద్, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలువురు ప్రొఫెసర్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సీడాక్‌తో గీతం అవగాహన

సీడాక్‌తో గీతం హైదరాబాద్ ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. ఈ అవగాహన మేరకు గీతం విద్యార్థులకు సైబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్డింగ్‌పై సీడాక్ శిక్షణ ఇవ్వనుంది. రిమోట్ వర్క్‌షాప్, ఇంటర్న్‌షిప్ ప్రొగ్రామ్‌లను కూడా సీడాక్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీడాక్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ వీసీవీ రావు శుక్రవారం గీతమ్‌ను సందర్శించిన ఈ అవగాహన ఏర్పరచుకున్నట్లు తెలిపారు.

ఐదు తీర్మానాలను ప్రవేశపెట్టిన ఏబీవీపీ

విజయక్రాంతి, మంచిర్యాల: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్యలయంలో జాతీయ మహ సభలలో జరిగిన తీర్మాణాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోలిశెట్టి అశ్విన్ కుమార్ మాట్లాడుతూ 27 నుంచి 30వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 64వ జాతీయ మహ సభలు విజయవంతం అయ్యాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ అధ్యక్షులను ఎన్నుకున్నామని, అదేవిధంగా ఈ సభల్లో 5 తీర్మానాలను ప్రవేశపెట్టామని వారు తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని ప్రతిజ్ఞ చేయించామన్నారు. దేశంలో ఓటు హక్కును 100 శాతం వినియోగించుకునే విధంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కో–కన్వీనర్ దుర్గం వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన రాణి, జిల్లా కన్వీనర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం మరో పెళ్లికి యత్నం



విజయక్రాంతి, రాజేంద్రనగర్: నివ్వంటే నాకేంతో ఇష్టం.. నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నా.. నివ్వేకావాలి.. జీవితాంతం నీకు తోడుగా ఉంటానని మూడేళ్లుగా యువతిని నమ్మించి ప్రేమాయణం సాగించాడు. ఇరు కుటుంబాల పెద్దలను కాదని వికలాంగురాలైన యువతిని ప్రేమపెళ్లి చేసుకొన్న వ్యక్తి ఆమెతో కాపురం చేస్తూనే వరకట్నం ఆశతో మరో యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న ఆ యువతి పోలీసులను ఆశ్రయించడంతో ఆ సంబంధం కాస్త తెగిపోయింది. అతడు పరారయ్యాడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్లోని ప్రేమావతిపేట్‌లో నివాసముండే జి.రాములు కూతురు లిల్లీకుమారి వయసు 33 ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా 14 ఏళ్లుగా పనిచేస్తుంది. నగరంలోని బడంగ్‌పేటలో నివాసముండే సీహెచ్.శ్రీధర్ (36) అదే విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అయితే ఒకే విభాగంలో పనిచేస్తుండటంతో వికలాంగురాలైన లిల్లీకుమారిని శ్రీధర్ ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. ఏడాది కాలంలో ఆమెతో చనువుగా ఉండటంతో ఆమె అతని ప్రేమను అంగీకరించింది. ఇద్దరు కూలాలు వేరు కావడంతో శ్రీధర్ కుటుంబ సభ్యులు లిల్లీ కుమారిని శ్రీధర్ పెళ్లి చేసుకోవడాన్ని వ్యతిరేకించారు. దీంతో ఇద్దరు భవానికాలనీ, శివరాంపల్లి ప్రాంతాల్లో కాపురం పెట్టారు. అయితే ఏడాది తర్వాత శ్రీధర్ కుటుంబ సభ్యులు మరో అమ్మాయిని పెళ్లి చేసుకొంటే రూ.36 లక్షలవరకట్నం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పడంతో శ్రీధర వరకట్నానికి ఆశపడి లిల్లీ కుమారిని తరచుగా శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రాజేంద్రనగర్ పోలీసులు శ్రీధర్‌పై కేసు నమోదు చేశారు.

తనకు జరిగిన అన్యాయాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, రిజిస్ట్రార్‌లతో పాటు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదని విచారం వ్యక్తం చేసింది. తన కుటుంబ సభ్యులకు, తన భర్తకు దూరమైన తనకు మద్దతు తెలిపేవారు ఎవరు లేరని మీడియా కథనాలతో ప్రభుత్వం, మానవహక్కుల కమిషన్ తనకు న్యాయం చేసి శ్రీధర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.

శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రేమావతిపేట్‌కు చెందిన దళిత మహిళను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకొని వదిలేసిమోసం చేసిన సీహెచ్.శ్రీధర్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు. శుక్రవారం బాధితురాలితో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు కోరని బాల్‌రాజ్ నాయకులు పి.జీవన్‌దాస్, సయ్యద్ బాబు, దయానంద్, శోభ తదితరులు బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు.

ప్రజల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత మనదే: ఎమ్మెల్యే గూడెం

విజయక్రాంతి, పటాన్‌చెరు: జిన్నారం మండల ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వాటి పరిష్కారానికి కృషి చేసే బాధ్యత మనందరిపై ఉందని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ కొలాన్ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జిన్నారం మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఎంపీపీ కొలాన్ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కుంచాల ప్రభాకర్, ఎంపీటీసీలు పూలమా లలతో సత్కరించి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ



ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అదే విధంగా చేయాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ఉన్నాయని అన్నారు. అభివృద్ధి విషయంలో నియోజకవర్గంలోని ప్రజలు తలెత్తుకునేలా చేసి చూపిస్తానని పేర్కొన్నారు. రానున్నది వేసవి కాలం కావడంతో సంబంధిత అధికారులు గ్రామాలలో నీటి ఎద్దడి ఉండకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచరించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బామ్మ చిట్కాలు

- ఇడ్లీ పిండిలో చెంచా నువ్వుల నూనె వేస్తే ఇడ్లీలు తెల్లగా మృదువుగా వస్తాయి.
- ఉడికించే నీటిలో కొద్దిగా వంటనూనె వేస్తే బంగాళదుంపలు త్వరగా ఉడుకుతాయి.
- ఉల్లిపాయను అడ్డంగా కోసి దోసెల (అట్లు) పెనం మీద రాస్తే దోసెలు చక్కగా చెడకుండా వస్తాయి.
- సన్న జాజి ఆకులు నమిలి ఉమ్మి వేస్తుంటే నోటిపూత అతి త్వరగా తగ్గుతుంది.
- వేడి పాలలో పసుపు, మిరియాలపొడి కలిపి తాగితే జ్వరం, పడిశం హరిస్తాయి.
- లివరును ఆరోగ్యంగా ఉంచగలదు ఈ ముల్లంగి. జీర్ణశక్తిని వృద్ధిచేస్తూ శరీరంలో నీరు నిలిచేలా చేస్తుంది



స్టార్టర్స్

చలి కాలంలో ఎవరికైనా వేడి వేడిగా ఏదైనా చిరుతిళ్లు తినాలనుంటది. పిల్లలకైనా పెద్దలకైనా ఈ రోజుల్లో ఎక్కువగా ఇష్టపడేవి స్టార్టర్స్. అందులో వెజ్ స్టార్టర్స్ అయితే రుచికి రుచి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఈ స్టార్టర్స్ తినడం వల్ల ఆరోగ్యంతో పాటు మంచి టేస్టీ ఫుడ్‌ను మీ పిల్లలకి అందించవచ్చు.



మసాల కుల్చా

కావలసిన పదార్థాలు

మైదా 250 గ్రా, బేకర్స్ ఈస్ట్ ఒక టీ స్పూను, పాలు ఒక కప్పు, పచ్చిమిర్చి 2, పెద్ద ఉల్లిపాయలు 2, కారం ఒక టేబుల్ స్పూను, ఉప్పు రుచికి సరిపడా, నూనె 2 టేబుల్ స్పూన్లు, బటర్ ఒక టేబుల్ స్పూను, ఉల్లిగింజలు (కలొంజి) ఒక టీ స్పూను, కొత్తిమీర తరుగు ముప్పావు కప్పు.

తయారు చేసే విధానం

గోరువెచ్చని పాలల్లో (ఒక వంతు పాలు + మూడు వంతులు నీరు) ఈస్ట్, అర టీ స్పూను పంచదార వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మైదాలో వేస్తూ ముద్దగా చేసుకుని 30 నిమిషాలు పక్కనుంచాలి. ఉల్లి తరుగులో ఉప్పు, కారం వేసి కొద్దిసేపు తర్వాత పిండి నీరు తీసెయ్యాలి. మైదా ముద్దని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని ఒత్తి మధ్యలో ఉల్లి మిశ్రమం పెట్టి మడిచి 10 నిమిషాలు పక్కనుంచాలి. ఇప్పుడు ఓవెన్ను 250 డిగ్రీల దగ్గర పది నిమిషాల పాటు ప్రీహీట్ చేసుకోవాలి. నూనె రాసిన బేకింగ్ ట్రేలో ఉండలు ఉంచి, చేత్తో కుల్చాలుగా (కచోరిలా) ఒత్తి పైన ఉల్లిగింజలు, కొత్తిమీర చల్లాలి. తర్వాత 160 డిగ్రీల దగ్గర 810 నిమషాల పాటు ఓవెన్లో బేక్ చేసుకోవాలి. కుల్చాలకు మసాల శనగల కూర మంచి కాంబినేషన్.



కంద వడలు

కావాల్సిన పదార్థాలు

కంద – అర కేజి, బియ్యపిండి – 1/2 కప్పు, పచ్చి మిర్చి, ఎండు మిర్చి, జీలకర్ర, కరివేపాకు, కొత్తిమీర, ఉప్పు తగినంత, నూనె తగినంత

తయారు చేసే విధానం

కంద చెక్కు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసి, ఎర్ర మిరపకాయలు, పచ్చిమిర్చి, పసుపు, జీలకర్ర, ఉప్పును కలపి గ్రైండ్ చేసుకోవాలి. ఆ పిండిలో బియ్యపిండిని జోడించండి. మిశ్రమంతో వడల్లా చేసి నూనెలలో గోధుమరంగు వచ్చే వరకూ ఫ్రై చేసుకుంటే కరకరలాడే కంద వడలు రెడీ. కంద పులుసు, కూర వంటివి తినడానికి ఇష్టపడని వాళ్లు ఈ విధంగా స్నాక్స్ చేసుకుంటే ఎంతో రుచిగాను, పిల్లలకు ఈవినింగ్ స్నాక్స్‌గా రెడీ.



మష్రూమ్స్ మంచూరియా

కావలసిన పదార్థాలు

మష్రూమ్స్ 200 గ్రా॥, మిరియాల పొడి ఒక టీ స్పూను, బియ్యపిండి, మైదా, కార్న్‌ఫ్లోర్ 3 టేబుల్ స్పూన్ల చొప్పున, ఉప్పు రుచికి తగినంత, కారం ఒక టీ స్పూను, నీరు అరకప్పు, నూనె వేయించడానికి సరిపడా, ఉల్లిపాయలు 2, వెల్లుల్లి రెబ్బలు 4, సోయా సాస్ 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి 4, టమోటా సాస్ ఒక టేబుల్ స్పూను, టమోటా ప్యూరీ 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు అలంకరణకు.

తయారుచేసే విధానం

ఒక బౌల్లో బియ్యప్పిండి, కార్న్‌ఫ్లోర్, మైదా, కారం, ఉప్పు (ఇష్టమైతే చిటికెడు ఆరంజ్ ఫుడ్ కలర్) వేసి నీటితో జారుగా కలుపుకోవాలి. రెండు ముక్కలుగా తరిగిన మష్రూమ్స్‌ను జారులో ముంచి నూనెలో దోరగా వేగించి పక్కనుంచాలి. ఇప్పుడు మరో కడాయిలో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి ఉల్లి తరుగు, పొడుగ్గా చీరిన పచ్చిమిర్చి, వెల్లుల్లి తరుగు చిటికెడు ఉప్పు వేసి వేగించాలి. తర్వాత సోయా సాస్, టమోటా ప్యూరీ, సాస్ (ఇష్టమైతే అజినమోటో చిటికెడు) వేయాలి. రెండు నిమిషాల తర్వాత పక్కనుంచిన మష్రూమ్స్ వేసి చిక్కబడేవరకూ ఉంచి కొత్తిమీర చల్లి దించేయాలి. ఇవి స్నాక్స్ లేదా భోజనంతో పాటు సైడ్ డిష్‌గా బావుంటాయి.

అమ్మ అయ్యాక ఆరోగ్యం పదిలం!



తల్లులందరికీ ప్రసవ వేదన అత్యంత క్లిష్టతరముగా ఉంటుంది. కడుపులో బిడ్డతో పాటు తల్లికి కూడా సరైన రక్షణ, ఓషధాల వినియోగం ఖచ్చితంగా ఉండాలి. సరైన ఆహార ప్రణాళిక అనేది గర్భం దాల్చిన వారికి ఎంత ముఖ్యమో, ప్రసవానంతరం తర్వాత కూడా అంతే ముఖ్యం. ప్రసవానంతరం మహిళలకు అవసరమైన పోషకాలు అందివ్వగల అనేక రకాల ఆహారపదార్థాలు అందుబాటులో ఉన్నాయి. ప్రణాళికా బద్దమైన ఆహారపు అలవాట్లు, జీవన శైలి, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ప్రసవానంతరం మహిళలకు సరైన పోషకాలను అందివ్వగలవి పండ్లే. కావున కాలానుగుణంగా పండ్లు తీసుకోవడం ఎంతో ముఖ్యం. తక్కువ క్రొవ్వు కలిగిన పాల పదార్థాలను కూడా తీసుకోవచ్చు.

వీటికి దూరంగా ఉండాలి..

ప్రసవానంతరం, బిడ్డకు తల్లి పాలను ఎక్కువ కాలం ఇవ్వవలసి ఉంటుంది. కావున ఇలాంటి సమయంలో చిరుతిండ్లకు దూరంగా ఉండాలి. మీరు ఎటువంటి చిరుతిండికి మొగ్గు చూపినా, ఆ ప్రభావం మీ బిడ్డమీద కూడా ఉంటుందని గ్రహించవలసిన అవసరం ఉన్నది. నిబంధన లేని అన్ని రకాల చిరుతిండ్లను తింటే దాని ప్రభావం మీతోపాటు మీ బిడ్డ అనారాగ్యోనికి కారణం అవుతుంది.

అంటువ్యాధులు సంక్రమించకుండా

ప్రసవానంతరం మహిళలలో రోగ నిరోధక శక్తి తత్వాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో అనేక అంటువ్యాధులకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. మీ ఆహార ప్రణాళికలలో భాగంగా అత్యధికంగా విటమిన్–సిని చేర్చుకోవాలి. విటమిన్–సి శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలను పెంచడంలో తద్వారా శరీరాన్ని ఆరోగ్యకరంగా చేయడంలో ఎంతో సహాయం చేస్తుంది . మిగిలిన ఆహార పదార్థాలైన బ్రొకోలి, బంగాళా దుంపలు, నిమ్మజాతి కి చెందిన పండ్లు, టొమాటోలు మొదలైన వాటి నుండి విటమిన్ సి ని పొందవచ్చు.

ఐరన్ తప్పనిసరి

స్త్రీ, తన ప్రసవ సమయంలో అత్యధిక రక్తాన్ని కోల్పోవలసి ఉంటుంది. సాధారణ కాన్పు అయినా లేదా ఆపరేషన్ వలన అయినా రక్తం కోల్పోవడం మాత్రం సర్వసాధారణం. తద్వారా ప్రసవానంతరం, కోల్పోయిన ఐరన్ తిరిగి పొందాల్సిన అవసరం ఉన్నది. ఆహార ప్రణాళికలో మార్పుల ద్వారా తీసుకున్న ఆహారం ద్వారా రక్తంలో ఐరన్ నిల్వలను పెంచే ప్రయత్నం చేయవచ్చు. రక్తం లో ఉన్న ఐరన్ నిల్వలు హీమోగ్లోబిన్ పెంచడంలో సహాయం చేస్తాయి. హీమోగ్లోబిన్ రక్తంలోని కణాలకు ఎరుపు రంగును ఇవ్వడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. సరైన ఐరన్ నిల్వలు లేని శరీరం, రక్తహీనత వంటి సమస్యలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలను పెంచడం ద్వారా ఐరన్ నిల్వలను సమతుల్యం చేయవచ్చు. చిక్కుడు, చేపలు, మాంసం మొదలైన వాటిని స్వీకరించడం ద్వారా ఎంతో లాభం పొందవచ్చు. ప్రసవానంతరం, మహిళలు తగినంత నీటిని తీసుకోవడంలో అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. కానీ కొన్ని రోజుల తర్వాత ఖచ్చితంగా నీటిని తీసుకోవలసిన పరిస్థితులు నెలకొంటాయి. క్రమంగా రోజులో కనీసం 8 నుండి 10 గ్లాసుల నీటిని స్వీకరించాల్సి వస్తుంది. తద్వారా శరీరం డీహైడ్రేట్ కు గురికాకుండా ఉంటుంది. నీటికి బదులుగా అప్పుడప్పుడు పళ్లరసాలు లేదా క్రొవ్వు తక్కువగా ఉన్న పాల పదార్థాలు తీసుకోవచ్చు. ప్రసవానంతరం ప్రతి మహిళ కూడా తన శరీరం లో నీటి నిల్వలు తగ్గకుండా చూసుకోవడం అన్నిటికన్నా ముందస్తు చర్యగా చెప్పబడినది.



తేలికపాటి దుస్తులు

ప్రసవానంతరం మహిళల శరీర ఉష్ణోగ్రతలు, సాధారణ మహిళల కంటే కొంచం అదనంగానే కనిపిస్తూ ఉంటాయి. వీరు తేలికపాటి దుస్తులను ధరించడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. కాటన్ వంటి తేలికపాటి దుస్తుల ద్వారా శ్వాసకు అనువుగా ఉంటుంది. దృఢమైన దుస్తుల కన్నా తేలికపాటి దుస్తులు ఎంతో సౌకర్యంగా ఉంటాయి కూడా. తద్వారా మానసిక అసౌకర్యానికి కూడా దూరంగా ఉండవచ్చు. మీ స్వభావాన్ని శాంతంగా ఉండేలా చూసుకోవాలి . తద్వారా మీ బిడ్డ కూడా సంతోషంగా ఉండగలుగుతుంది. మీ నిద్ర సమయంలో మీరు సౌకర్యవంతంగా ఉండేలా పరిసరాలను సిద్ధం చేసుకోవలసిన అవసరం కూడా ఉంది. ప్రసవానంతరం శరీరం సున్నితంగా మారుతుంది. ముఖ్యంగా వేసవిలో కొన్ని ఆహార పదార్థాలు ఎంతో అసౌకర్యానికి గురిచేస్తుంటాయి.

మూత్రాశయ సమస్యలు

సాధారణ ప్రసవం అయినా కూడా జననేంద్రియాలు మాత్రమే కాకుండా, వాటి చుట్టూ ఉన్న అవయవాలు కూడా కొన్ని పరిస్థితులను ఎదుర్కొంటాయి. తద్వారా ఎక్కువ మంది మహిళలు మూత్రాశయ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. తద్వారా మూత్ర నాళంలో మంట, నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. వేసవిలో ఇలాంటి సమస్యలవలన చాలా అసౌకర్యానికి గురవుతూ ఉంటారు. ఒక్కోసారి సమస్య జఠిలం కూడా అవుతుంది. మూత్ర ద్వారంలోని కండరాల ప్రాంతాన్ని కొద్ది సేపు గట్టిగా పట్టి ఉంచి వదులుతూ చేసే వ్యాయామం సమయానుసారం చేస్తూ ఉండడం ద్వారా మూత్రాశయ సమస్యలను దరికి రాకుండా చూడవచ్చు.

పప్పులు, తృణధాన్యాలు

పప్పులు తృణ ధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిదిగా సూచించబడినది. ముఖ్యంగా ప్రసవానంతరం మహిళలు వీటిని ఎక్కువగా తీసుకోవాలి. ఇవి కారాలు, మసాలాలు లేకుండా తేలికపాటి ఆహార పదార్థాలుగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియలను వేగవంతం చేయడంలో సరైన పోషకాలను శరీరానికి ఇవ్వడంలో అధికంగా సహాయపడుతాయి.

ఆకుపచ్చని కూరగాయలు

ప్రసవానంతరం, రక్తం ఎక్కువగా పోవడం కారణంగా ఐరన్ ఎక్కువగా కోల్పోవడం జరుగుతుంది. ఆకుపచ్చని కూరగాయలు ఈ ఐరన్ ను తిరిగి పొందడంలో సహాయం చేస్తాయి. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాలు తీసుకోవడం ద్వారా, తమ బిడ్డకు కూడా ఆరోగ్యవంతమైన పాలను అందించడంలో భాధ్యతను తీసుకోవచ్చు. ప్రసవానంతరం మహిళలకు, కాలానుగుణంగా పండే కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం సూచించడమైనది.

హెల్త్

ఎదిగే పిల్లలకు కావాల్సిన విటమిన్లు




ఎదిగే వయస్సులో సరైన ఆహారాన్ని తింటేనే వయస్సు పైబడే కొద్దీ శక్తితో నిలబడగలుగుతారు. పెరిగే పిల్లలకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారాలను, విటమిన్స్ ఎక్కువ ఉండి శక్తినందించే వాటిని ఇవ్వడం చాలా అవసరం. అందుకు వీరికి కావాల్సిన విటమిన్లు అందించే ఆహారేలేంటో, ఏ విటమిన్లు వేటిలో ఉంటాయో చూద్దాం..

విటమిన్–ఎ

చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకి ఉపయోగపడుతుంది. ఎముక బలానికీ, కంటి చూపు మెరుగుపడేందుకూ తోడ్పడుతుంది. ఈ విటమిన్ కోసం చీజ్, క్యారెట్, పాలూ, గుడ్లూ తినిపించాలి.

విటమిన్–బి

శరీర పనితీరు బాగుండి చురుగ్గా ఉండాలంటే అన్ని రకాల బి–విటమిన్లూ అందేట్టు చూడాలి. అందుకు మాంసం, చేపలూ, సోయా, బీన్స్ వంటివి ఇవ్వడం వల్ల బి విటమిన్ బాగా అందుతుంది.



కండర పుష్టికి

శారీరక దృఢత్వానికీ, అందమైన చర్మానికీ విటమిన్–సి చాలా అవసరం. టొమాటోలూ, తాజా కాయగూరలూ, విటమిన్ సి అందించే పుల్లని పండ్లూ అందించడం మంచిది.

ఎముక బలానికి


ఎముకలు బలంగా ఉండాలంటే ఆహారంలో క్యాల్షియం ఉండాలి. ఇది సమృద్ధిగా అందాలంటే విటమిన్ డి అందాలి. ఇందు కోసం పాలూ, పాల ఉత్పత్తులతోపాటూ ఉదయం వేళ సూర్యరశ్మి పిల్లలకు అందేట్టు జాగ్రత్త తీసుకోవాలి.

ఐరన్ లోపానికి

ఇది రక్తం వృద్ధి చెందేట్టు చేస్తుంది. పాలకూర, ఎండుద్రాక్ష, బీన్స్ వంటివి తరచూ ఇస్తుండాలి.

డయాబెటిస్‌ను తగ్గించే బేరిపండు

బేరిపండు ఫ్రక్టోజ్ రూపంలో సహజ చక్కెరలను కలిగి ఉంటుంది. గ్లైసెమిక్ తక్కువ శాతంలో ఉండి, డయాబెటిస్‌తో బాధపడుతున్న వ్యక్తులు ఏ భయం లేకుండా ఈ పండును తినవచ్చు. వీటిలో ఇన్సులిన్ సెన్సిటివిటీని అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇది మధుమేహమును నిరోధించడంలోనూ, నివారించడంలో కీలకమైన పాత్రను పోషిస్తుంది.





ఆ బంధం ప్రేమమయం కావాలి!

వివాహం అయిన అమ్మాయిలు ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సి వుంటుంది. కొత్త ఆచారాలు, కొత్త బంధుత్వాలు, కొత్త నియమనిబంధనలను పాటించాల్సి వుంటుంది. మొత్తంగా చెప్పాలంటే.. అమ్మాయి తన అలవాట్లను మర్చిపోయి కొత్త మార్గాన్ని ఎంచుకోవాల్సి వుంటుంది.

అయితే ఇటువంటి వ్యవహారాలను కేవలం కొంత మంది అమ్మాయిలు మాత్రమే అంగీకరిస్తారు. అత్తమామలు, ఇతర బంధుత్వాలు లేకుండా స్వేచ్ఛగా తమ జీవితాన్ని గడపాలనుకుంటారు వీరు. అత్తామామలు చెప్పిన విషయాలను పట్టించుకోకుండా, కేవలం తమ పనులను కానిచ్చుకుంటుంటారు. దీంతో తరుచుగా ఇంట్లో అత్తాకోడళ్ల మధ్య గొడవలు అవుతుంటాయి. కొందరైతే ఒకరినొకరు కొట్టుకుంటారు కూడా. మరికొందరు తమ భర్తను తీసుకుని ఇల్లు వదిలి వెళ్లిపోతారు. దీంతో బంధుత్వాలు తెగిపోయి దూరాలు పెరుగుతాయి.

అత్తా ఒకింటి కోడలే! కోడలూ ఒక అమ్మకు కూతురే! అత్తాకోడళ్లు ఈ వాస్తవాన్ని గుర్తించి మసలుకుంటే వారి బంధం తల్లీకూతుళ్ల అనుబంధంలా అలరారుతుంది.

కోడలు అమ్మలా... అత్త కూతురిలా..



సాధారణంగా వివాహం చేసుకుని వచ్చిన ఒక కొత్త అమ్మాయికి కొత్త ఆచారాలను పాటించడానికి కొంత సమయం పడుతుంది. అటువంటి సమయాల్లో అత్త వారింటి నుంచి కూడా కొంతమేరకు సహకారం అందాలి. కోడలు అత్తను ఒక అమ్మలా భావించి, తను చెప్పే కార్యక్రమాలను నిర్వర్తించాలి. ఇలా చేయడం వల్ల అత్త కూడా చాలా సంతోషిస్తుంది. ఇలా ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల వారిద్దరి మధ్య ఎటువంటి గొడవలు చోటుచేసుకోవు.

కోడలిగా నిర్వర్తించాల్సినవి..

సాధారణంగా ఒక అమ్మాయి తన అత్తవారింట్లో ఎంత పనిచేసినా... దానికి ఎవరూ ప్రశంసించరు. పనితోనే పొద్దు గడిచిపోతుంది. అటువంటి సమయాల్లో మీరు వారితో గొడవ పడకుండా చాకచక్యంతో వ్యవహరించాలి. కోడలు అత్తతో స్నేహపూర్వకంగా కలిసిపోవాలి. అత్తగారు ముందుచేసిన మంచి కార్యక్రమాలను గుర్తుచేసి, దాని గురించి చర్చించడం మొదలుపెట్టండి. దాంతో ఆమె పాత అనుభవాలను గుర్తు చేసుకుని సంతోషిస్తుంది. ఆమె చేసిన కష్టాలను గుర్తించి, తన కొడుకుని ప్రయోజకుడిగా చేసినందుకు వారిని అభినందించండి... గౌరవించండి. దాంతో ఆమె మీతో ఓపికగా వ్యవహరించే అవకాశాలు చాలా వున్నాయి.

అత్తమామలను పట్టించుకోండి..

పెళ్లయిన కొందరు వివాహితులు తమ అత్తమామల గురించి పట్టించుకోరు. అటువంటి సమయాల్లో వారికి చాలా బాధ కలుగుతుంది. దాంతో ఒకరికొకరి మధ్య మనస్పర్థలు ఏర్పడి నిత్యం గొడవలకు దారితీయొచ్చు. అలా కాకుండా వారికి తోడుగా వుండండి. వారి సలహాలను గుర్తించండి. దాంతో వారిలో మీ మీద ఒక మంచి భావన కలుగుతుంది.



అత్తతో చర్చించండి..

మామూలుగా కొందరి భార్యాభర్తల మధ్య వచ్చే గొడవలను అత్తగారితో చర్చించండి. మీరు మీ జీవితంలో ఏ విధంగా అయితే భర్తకు ప్రాముఖ్యతను ఇస్తారో... అదే విధంగా ఇంట్లో వున్న ఇతరులకు కూడా ఇవ్వండి. అప్పుడు మిమ్మల్ని ఒక కోడలిగా కాకుండా, తమ సొంత కూతురిలా వారు చూసుకుంటారు.

స్నేహంగానే మసలుకోవాలి..


కొంతమంది తల్లీకొడుకులు చాలా స్నేహపూర్వకంగా వుంటారు. ఆ సమయంలో కోడలు కూడా స్నేహంగా మసలుకునే ప్రయత్నం చేయాలి. అత్త మీదున్న అభిమానాన్ని వ్యక్తమయ్యేలా చేస్తే... అత్త కూడా కోడలితో స్నేహపూర్వకంగా, తల్లిలా వుంటుంది.

మందలిస్తే.. అర్థం చేసుకోండి

కోడలి వల్ల ఏదైనా ఒక చిన్న తప్పు జరిగితే.. దానికి అత్తగారు మందలించడం జరుగుతుంది. అప్పుడు వారిమీద అసూయ పెంచుకోకుండా వారు చెప్పిన మాటలను అర్థం చేసుకొని, మరోసారి తప్పులు కాకుండా జాగ్రత్తపడాలి. కోడలు అత్తతో మంచి స్నేహితురాలుగా నడుచుకోవడం నేర్చుకోవాలి.

బిస్కెట్లతో జాగ్రత్త!

సాధారణంగా మనం భోజనానికి అల్పాహారంలోకి సమ్మిళిత పదార్థాలను ఇష్టపడతాం. అంటే పెరుగన్నంలోకి ఊరమిరపకాయ, సాంబారుకు అప్పడం, రసానికి వడియం అలాగే ఛాయ్‌కి బిస్కెట్.



పొద్దున్నే చాయ్ బిస్కెట్ కాంబినేషన్ అందరికీ సుపరిచితమే. ఈ మధ్య డైజెస్టివ్ బిస్కెట్లు బాగా వాడకంలోకి వచ్చాయి. వాటి గురించి వినే ఉంటూ, రుచి కూడా చూసే ఉంటారు. డైజెస్టివ్ బిస్కెట్లు ఆకలిని తీర్చవచ్చు, ఆరోగ్యకరమైన ఆహారం తిన్నామన్న తృప్తినీ కల్గించవచ్చు కానీ వీటిని అత్యధికంగా తినడం వల్ల మనకు మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు గల కారణాలు...

జీర్ణక్రియ సరిగా లేని వారి కోసం ఈ బిస్కెట్లు మార్కెట్లోకి వచ్చాయి. ప్రస్తుతం ఇవి చిరుతిండిగా మారిపోయాయి కానీ వచ్చిన చిక్కేంటంటే, ఈ బిస్కెట్లలో ఉన్న చక్కెరలు, కొవ్వు పదార్థాలు, సోడియం, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉన్నాయంటూ సదరు ప్యాకెట్స్‌పై రాసి ఉంటుంది. కానీ అక్కడ రాసిన పదాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే బిస్కెట్లకు బానిసలయ్యేలా వీటిలో రుచిని ఎక్కువగా కలిగించే పదార్థాలను కలిపిన విషం అని అర్థమవుతుంది. బిస్కెట్లు వందలాది పరిమాణాల్లో లభిస్తుంటాయి. అందువల్ల కంపెనీలు వీటిని ఎక్కువగా ప్రాసెస్ చేస్తుంటాయి. మీరెప్పుడైనా బిస్కెట్లు బూజు పట్టి చెడిపోవడం లాంటివి గమనించారా... అందుకు కారణం ఇవి ఎక్కువ కాలం నిల్వ ఉండే విధంగా ప్రాసెస్ చేయడం, అందుకు కొన్ని పదార్థాలను కలపడం చేస్తుంటారు. సాధారణంగా డైజెస్టివ్ బిస్కెట్ కనీసం 50 కాలరీలను కలిగి ఉంటుంది. ఇందులో సగానికి పైగా అనారోగ్యకర కాలరీలే అని చెప్పొచ్చు. ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. కేవలం నాజూకుతనం కోసం చేసే ప్రయత్నాలను దెబ్బతీయవచ్చు. చక్కెరలు, పిండి, సోడియంలో ఉండే అనారోగ్య కాలరీలు మన శరీరానికి అవసరం లేదు. ఇవి మన ఆరోగ్యాన్ని పాడు చేసే అవకాశాలే ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



'చిటికె'లో సాధ్యం..!



- ముగ్గులకు వేసే రంగుల్లో గళ్ళ ఉప్పును కలిపి వేస్తే, ముగ్గుల అందం రెట్టింపు అవ్వడమే కాక ముగ్గులు ఛమక్ ఛమక్‌న మెరుస్తాయి.
- రంగులు సరిపోని సమయంలో ఉన్నవాటిలోనే ఏవేని రెండు కలర్లు కలిపితే, మరో కొత్త రంగు ఏర్పడుతుంది.
- రంగుల్లో పొడి ఉప్పును కలిపితే, ముగ్గు వేసేటపుడు రంగుపొడి జాలువారుతూ రంగులు నింపే పనిని సులువు చేస్తుంది.

ముఖంపై జిడ్డు.. ఇబ్బందే?

జిడ్డు చర్మంతో తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్న వారికి చిన్న చిట్కాలను పాటించమని చెప్తున్నారు బ్యూటీషియన్లు. వాటిని రెగ్యులర్‌గా అప్లై చేసుకుంటే, చర్మం ఆరోగ్యంగా వుండటంతో పాటు ఆయిల్ స్కిన్‌ను తక్షణమే నివారించుకోవచ్చు. మొటిమలు, మచ్చలు, ఇతర ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆ రెమెడీలేంటో తెలుసుకుందామా...



పుదీనా..

పుదీనా ఆకులను వేడి నీళ్ళలో వేసి, అది చల్లబడేంతవరకు అలాగే వుంచాలి. చల్లబడిన నీటితో ముఖం శుభ్రం చేసుకోవాలి. ఇలా కాకపోతే కాటన్‌ను ఆ నీటిలో డిప్ చేసి ముఖాన్ని తుడవాలి.

నిమ్మరసం

ఒక చెంచా నిమ్మరసం, ఒక మింట్ టీ బ్యాగ్ తీసుకొని వేడి నీళ్ళలో మిక్స్ చేసి ఉడికించాలి. టీ బ్యాగ్‌ను వేడి నీళ్ళలో వేసి కొద్దిసేపు బాయిల్ చేయాలి. టీబ్యాగ్‌ను తీసేసి, మిశ్రమాన్ని మిక్స్ చేసి, తర్వాత చల్లార్చి అందులో కాటన్ బాల్ డిప్ చేసి ముఖం, మెడను శుభ్రం చేసుకోవాలి.



కలబంద

అలోవెర రసాన్ని పూర్తిగా తీసుకొని నేరుగా ముఖానికి అప్లై చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే.. సన్ బర్న్, రాషెస్ నివారించబడుతాయి.


కీరదోసపెరుగు


ఫ్రెష్‌గా ఉండే కీరదోసకాయను మెత్తగా తురుముకొని, పెరుగులో వేసి మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. పది నిముషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

ఎగ్ వైట్


ఎగ్ వైట్‌ను తీసుకొని ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా ప్రతి రోజూ చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది.


ముంగిట్లో ముగ్గు














ఫిదా



మా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, 'మా', మెంబర్స్ కి ప్రతి నెల రూ 5000 పెన్షన్ ఇవ్వడం అందరికి తెలిసిన విషయం. ఇప్పటి నుండి 'మా' మెంబర్ తదనంతరం, మెంబర్ యొక్క సతీమణికి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలియచేయడానికి ఎంతో సంతోషిస్తున్నాము. జనవరి 1 వ తేదీ, 2019, నుండి 'మా' అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురుంచి అభినందనలు తెలియ చేయడానికి ఆర్థికంగా వెనుకబడ్డ కొందరు 'మా' సభ్యులైన వీరమాచినేని ప్రసాద్, కవి, రమేష్ నాయుడు, ధూళిపాళ రవీంద్ర, శంకర్ తదితరులు 'మా' కార్యాలయానికి వచ్చి 'మా' అధ్యక్షులైన శ్రీ శివాజీ రాజాగారిని మరియు ఉపాధ్యక్షులైన శ్రీ బెనర్జీ గారిని మరియు సంయుక్త కార్యదర్శి శ్రీ ఏడిద శ్రీరామ్ గారిని కలిసి తమ అభినందనలు తెలియచేసారు.



చిరు కొరటాల కాంబో

మెగాస్టార్ చిరంజీవి కొరటాల శివకాంబోలో ఒక చిత్రం రానుందని గత కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో అనేక వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఇటు కొరటాల నుండి గాని, అటు మెగా క్యాంపు నుండి గాని ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

కానీ తాజాగా సినీ వర్గాల సమాచారం ప్రకారం కొరటాల శివ, మెగాస్టార్ తో చెయ్యబోతున్న సినిమా ఈ వేసవి నుంచి మొదలు కానుందని తెలుస్తోంది. చిరు కోసం కొరటాల ఓ మంచి సోషల్ మెసేజ్‌తో కూడుకున్న స్క్రిప్ట్‌ను తయారు చేశారట.

ప్రస్తుతం మెగాస్టార్ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న 'సైరా నర్సింహారెడ్డి' చిత్రంతో బిజీగా ఉన్నారు.



చరణ్‌లాంటి డాన్సర్‌తో స్టెప్పులువేసి ఎంజాయ్ చేశా – కియరా అద్వాని

మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన ఫ్యామిలీ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వినయవిధేయరామ'. కియరా అద్వాని హీరోయిన్‌గా నటించినసీ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా కియరా అద్వాని మీడియాతో మాట్లాడుతూ ...

దర్శకుడు బోయపాటి శ్రీనుగారు ఈ సినిమా స్టోరీ చెప్పినప్పుడు పూర్తి సినిమా చూసేశాననే ఫీలింగ్ వచ్చింది. చాలా రోజుల తర్వాత ఒక మంచి ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించి ఇమీడియట్‌గా ఓకే చెప్పేశాను. ఇంత స్టార్‌క్యాస్ట్ ఉన్న సినిమాలో నటించలేదు. రామ్ చరణ్, వివేక్ ఒబెరాయ్, ప్రశాంత్, ఆర్యన్ రాజేష్, స్నేహ లాంటి 15 మంది టాప్ యాక్టర్‌తో నటించడం అనేది అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. సెట్స్ దగ్గరి నుండి ప్రతీది లార్జర్ దేన్ లైఫ్ అనిపించేలా సినిమా చాలా గ్రాండ్‌గా వచ్చింది. బోయపాటిగారు ఇన్‌క్రెడిబుల్ డైరెక్టర్. నేచురల్ ఎలిమెంట్స్‌ను ప్రెజెంట్ చేయడం వేరు.. ఏదైతే నమ్మడానికి వీల్లేకుండా ఉంటాయో, వాటిని నమ్మేంతగా.. ఫీలయ్యేంతగా మెస్మరైజ్ చేస్తూ స్క్రీన్ పై ఎలివేట్ చేయడం చాలా కష్టం. అది బోయపాటి లాంటి ఫిల్మ్ మేకర్స్‌కి సాధ్యమవుతుంది. ఇది కూడా ఆయన బ్రాండ్ ఫిలిం. నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అందుకే నటినయ్యా. కంప్లీట్‌గా అటు డ్యాన్స్, కామెడీ పెర్ఫామ్ చేయడానికి మంచి స్కోప్ ఉన్న సినిమాలో పని చేసే అవకాశం దొరికినప్పుడు చాలా హ్యాపీగా ఉంటుంది. 'వినయ విధేయ రామ' చేసినందుకు కూడా అదే ఫీలింగ్. సినిమాలో నాకు, చరణ్‌కి మధ్య కెమిస్ట్రీ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ పేరు 'సీత'. ఫ్యామిలీలో అందరి ముందు చాలా వినయంగా ఉంటూ, రామ్ ఏది చెప్తే అదీ అన్నట్టుగా ఉంటాను. బయట మాత్రం చాలా డామినేటింగ్‌గా ఉంటాను. మా కాంబినేషన్‌లో ఉండే సీన్స్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. సినిమాలో నేను ఎంత టైమ్ స్క్రీన్ పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంత సేపు నేను ప్లే చేసిన క్యారెక్టర్‌కి క్వాలిటీ ఉందా లేదా..? నా ప్రెజెన్స్ ని ఆడియెన్స్ ఫీల్ అయ్యారా లేదా అని ఆలోచిస్తా.

బేసిగ్గా డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి చరణ్ లాంటి డ్యాన్సర్‌తో స్టెప్స్ వేస్తూ, చాలా ఎంజాయ్ చేశా. నాకు 'రామా వెడ్స్ సీత' ఇప్పటి వరకు నేను చేసిన సాంగ్స్‌లో మోస్ట్ ఫేవరేట్. 800 మంది డ్యాన్సర్స్‌తో చాలా గ్రాండ్‌గా పిక్చరైజ్ చేశారు ఆ పాటని. నాకైతే పర్టికులర్‌గా ఒకే లాంగ్వేజ్ ఆడియెన్స్‌కి స్టిక్ అవ్వాలనే ఆలోచన లేదు. గ్లోబల్ ఆడియెన్స్‌ని ఎంటర్ టైన్ చేయాలి. లాంగ్వేజ్ ఏదైనా, స్క్రిప్ట్ బావుంటే అది డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయినా 'నో' అని చెప్పను. 'భరత్ అనే నేను' సినిమాకి ముందు నమ్రతా నన్ను వేరే సినిమాలకోసం అప్రోచ్ అయ్యారు. కానీ అప్పుడు డేట్స్ అడ్జెస్ట్ అవ్వకపోవడం వల్ల కుదరలేదు. ఎప్పుడైతే 'భరత్ అనే నేను' ఆఫర్ వచ్చిందో ఎలాగైనా చేసేయాలనుకున్నా. రామ్ చరణ్ ఇన్‌స్టాగ్రామ్ అంటే చాలా ఇష్టం. ఆయనకీ సీక్రెట్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా ఉంది. కానీ చాలా మందికి ఆ విషయం తెలీదు.



క్రిష్‌ను ఫాలో అయ్యా అంతే –కంగనా రనౌత్

కంగనా రనౌత్ టైటిల్ ప్రాతలో నటించిన చిత్రం 'మణికర్ణిక'. జీ స్టూడియోస్, కమల్ జైన్ నిర్మాణంలో జాగర్లమూడి క్రిష్, కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జనవరి 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో...

ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "మన స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల చరిత్రను తెరకెక్కించిన జీ స్టూడియో వారిని, కంగనా రనౌత్ను అభినందిస్తున్నాను. ఒకప్పుడు మేం హిందీ సినిమాల్లోకి ఎప్పుడూ వెళ్దామా అని ఎదురు చూస్తే.. బాలీవుడ్ వాళ్లు హాలీవుడ్ లోకి ఎప్పుడు వెళ్దామా అని ఎదురుచూసే వాళ్లు. ఎల్.వి.ప్రసాద్ నుండి రాంగోపాల్ వరకు మన తెలుగు ఖ్యాతిని చాటినవాళ్లు ఎందరో ఉన్నారు. ఇప్పుడు మణికర్ణికను కథ, స్క్రీన్‌ప్లే విజయేంద్ర ప్రసాద్ అని చూసిన తర్వాత.. దర్శకుడు జాగర్లమూడి క్రిష్ అని చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. యాక్షన్ పార్ట్ను డైరెక్ట్ చేసిన కంగనా రనౌత్‌గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన గొప్ప రచయిత విజయేంద్ర ప్రసాద్. కేవలం తెలుగులోనే కాదు, తమిళం, కన్నడ సహ హిందీలో గొప్ప చిత్రాలను అందించారు. ఇప్పుడు మణికర్ణిక రూపొందంలో ఆయన కీలకభూమిక పోషించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రథమ స్వాతంత్ర్య పోరులో పోరాడిన ఝాన్సీ రాణి కథను తెరకెక్కించిన యూనిట్కు ఆల్ ది బెస్ట్" అన్నారు.

కంగనా రనౌత్ మాట్లాడుతూ "తెలుగులో ట్రైలర్ ఇంతకు ముందుగానే చూశాను. సౌండింగ్ డిఫరెంట్‌గా అనిపించింది. అయితే క్యారెక్టర్ పై తెలుగు వాయిస్ అందించిన ప్రతి ఒక్కరూ న్యాయం చేశారు. విజయేంద్ర ప్రసాద్‌గారు కూడా ట్రైలర్ మీద వర్క్ చేశారు. తెలుగులో ఓ పవర్ ఉంటుంది. అందుకే నేను బాహుబలిని తెలుగులో, హిందీలో కూడా చూశాను. నేను ఈ సినిమాను డైరెక్ట్ చేయడమనేది ప్లానింగ్ ప్రకారం జరగలేదు. యాక్సిడెంటల్‌గా జరిగింది. ఆగస్ట్‌లో రావాల్సిన ఈ సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేయలేక పోయాం. ఆ సమయంలో క్రిష్‌గారు మరో ప్రాజెక్ట్ 'యన్.టి.ఆర్' పూర్తి చేయాల్సి ఉంది. కాబట్టి సినిమాను జనవరిలో పూర్తి చేయాలని నేను డైరెక్ట్ చేశాను. క్రిష్‌గారు సినిమాను గొప్పగా తెరకెక్కించారు. ఆయన్ను నేను ఫాలో అయ్యానంతే. టీం సహకారంతో సినిమాను పూర్తి చేశాను. తదుపరి కూడా నేను డైరెక్ట్ చేయాలను కుంటున్నాను. ఆ సినిమాకు విజయేంద్ర ప్రసాద్‌గారిని కథను అందించమని చెప్పాను. తప్పకుండా మేం కలిసి పనిచేస్తాం. రెండు నెలలు సినిమా కోసం చాలా కష్టపడ్డాను. మనం కోసం రక్తం ధారపోసిన వారి గురించి పట్టించుకోవడం లేదు. వారు మన చరిత్ర. అలాంటి వారికి గౌరవం ఇవ్వాలి. అలా చరిత్ర మరుగున పడిపోయిన ఎందరో వీరులున్నారు. అలాంటి కారణంతోనే ఝాన్సీ కథను సినిమాగా చేయాలని అనుకున్నాను. ఈ సినిమా మేకింగ్‌లో చాలా సమస్యలను ఫేస్ చేశాను. షూటింగ్ ప్రారంభంలోనే నా నుదుటికి గాయమైంది. అలాగే డైరెక్టర్‌గా మారాలని కమల్‌గారు చెప్పినప్పుడు కూడా నేను ఇంత పెద్ద సినిమాను హ్యాండిల్ చేయగలనా అనే సందేహం కలిగింది. అలాంటి సమయంలో చాలా ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను" అన్నారు.

నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ "ప్రస్తుతం చాలా బయోపిక్స్ రూపొందుతున్నాయి. వాటి సక్సెస్ శాతం కూడా ఎక్కువగానే ఉంది. ఇప్పటి వరకు వచ్చిన బయోపిక్స్‌కు మణికర్ణికను మదర్ ఆఫ్ బయోపిక్స్ అని చెప్పొచ్చు. ఈ సినిమాను చేసే సమయంలో చాలా స్ట్రగుల్స్‌ను ఫేస్ చేశాం. వాటన్నింటినీ దాటి చేసిన సినిమా ఇది. విజయేంద్ర ప్రసాద్‌గారు అద్భుతమైన స్క్రిప్ట్‌ను అందించారు. చాలా మంచి టీం దొరికింది కాబట్టి సినిమాను పూర్తి చేశాం" అన్నారు.



అదిరిన 'పేట' ట్రైలర్

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా యంగ్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళచిత్రం 'పేట' ఈనెల 10వ తేదీన విడుదల కానుంది. తెలుగులో ఈ సినిమాను నిర్మాత వల్లభనేని అశోక్ ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సినిమాలో త్రిష, సిమ్రాన్, విజయ్ సేతుపతి, నవాజుద్దీన్ సిద్దిఖీ తదితరులు నటించారు. ఈ సినిమాలో రజనీ రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమాలో రజనీ మాస్ డైలాగ్లతో అదరగొట్టాడు. నిజం చెబుతున్నా... కొట్టి అండర్ వేర్తో పరిగెత్తిస్తాను... పరువు పోతే మళ్లీ తిరిగిరారు చూస్కో... ఏయ్ ఎవడికైనా పెళ్లం పిల్లలు అనే సెంటిమెంట్ గింటిమెంట్ ఉంటే వెనక్కితిరిగి చూడకుండా వెళ్లిపొండి... ఇక్కడ మండిపోతుంది.... దొరికారా ఇక భస్మమే... అంటూ రజనీ తన మార్కు డైలాగ్‌తో ఆకట్టుకున్నారు. 'చూడ్డానికి చిన్నపిల్లాడిలా చాలా స్టైల్‌గా ఉన్నారంటూ' మేఘా ఆకాశ్ ఇచ్చిన కాంప్లిమెంట్‌కు 'స్టైల్‌గా ఉన్నానట నాచురల్లీ' అంటూ రజనీ వేసిన రివర్స్ పంచ్ డైలాగ్‌లు ఉన్నాయి.





పాయల్ బిజీ బిజీ

ఒకే ఒక్క సినిమాతో మంచి పాపులారిటీ తెచ్చుకుంది పాయల్ రాజ్ పుత్. ఈ పంజాబీ బ్యూటీ అందచందాలకు యూత్ ఫిదా అయిపోయారంటే నమ్మాల్సిందే మరి. అంతకుమించి పాయల్ డేరింగ్ అండ్ గట్స్ యాటిట్యూడ్ కు గుండెల్లో గుడి కట్టేశారు. ఆర్ఎక్స్ 100 గ్రాండ్ సక్సెస్ పాయల్ జాతకమే మార్చేసింది. ఇప్పుడు టాలీవుడ్ లోనే కాదు అటు కోలీవుడ్ లోనూ పాయల్ దూసుకుపోతోంది. అక్కడ ఉదయనిధి స్టాలిన్ లాంటి యంగ్ హీరో సరసన అవకాశం అందుకుంది.

ప్రస్తుతం ఉదయనిధితో కలిసి ఆన్ లొకేషన్ ఈ బ్యూటీ చేస్తున్న సందడి మామూలుగా లేదు. తమిళ చిత్రం ఏంజెల్ షూటింగ్‌తో బిజీ అంటూ పాయల్ తాజాగా ఓ వీడియోని ఇన్‌స్టాగ్రామ్‌లో అప్ లోడ్ చేసింది. హాయ్ ఉదయ్.. షూటింగ్ ఫర్ ఏంజెల్! అంటూ ఛీర్స్ చేసింది. మొత్తానికి పాయల్ జోరు చూస్తుంటే ఇప్పట్లో ఎక్కడా తగ్గేట్టే కనిపించడం లేదు.

ఎన్టీఆర్ కథానాయకుడు చిత్రంలో జయసుధ పాత్రలో పాయల్ నటిస్తోంది. దీంతోపాటు భానుశంకర్ దర్శకత్వంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో నటించనుంది. ఇరువార్ ఉల్లమ్ అనే తమిళ చిత్రంలో ఇష్కా అనే పంజాబీ చిత్రంలోనూ పాయల్ నటిస్తోంది. ఇప్పటికే పంజాబీలో అరడజను చిత్రాల్లో నటించిన మేటి కథానాయికగా వెలిగిపోతోంది పాయల్. ఇకపై అగ్ర హీరోల చిత్రాల్లోనూ నటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఫుల్ బిజీ బిజీగా సాగిపోతుంది ఈమె జర్నీ.

జయలలితగా రమ్యకృష్ణ

తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి పురిచ్చి తలైవి జయలలితగారి జీవితం ఆధారంగా ఇప్పటికే ఏఎల్ విజయ్, ప్రియదర్శిని, భారతాయి రాజా ఇలా పలువురు దర్శకులు సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే వారితో పాటు దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ కూడా జయలలిత బయోపిక్‌ను వెబ్ సిరీస్‌గా తెరకెక్కిస్తున్నానని ఇటీవలే ఆయన అధికారికంగా ప్రకటించారు.

కాగా వెబ్ సిరీస్ గా జయలలిత జీవితాన్ని 32 ఎపిసోడ్స్ ఉండేలా రూపొందించాలని, దానికి సంబంధించిన స్క్రిప్ట్‌ని కూడా ఆయన ఫైనల్ చేసారని తెలుస్తోంది. ఇక జయలలిత పాత్రలో రమ్యకృష్ణ నటిస్తుంది.

జయలలితగారి లాంటి బలమైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాలంటే రమ్యకృష్ణ లాంటి బలమైన నటి అయితేనే ఆ పాత్రకు పూర్తి న్యాయం జరుగుతుందని దర్శకనిర్మాతలు భావించారట. అందుకే రమ్యకృష్ణను జయలలిత పాత్రలో నటింపజేస్తున్నారు. ఇక రమ్యకృష్ణ అమ్మ, అక్క పాత్రలతో పాటు మంచి హుందాతనం కలిగిన పాత్రలలో ధిట్ట అనే చెప్పాలి. బాహుబలిలో శివగామిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

కోడిగుడ్లు
రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	442	విజయవాడ	453
ముంబయి	494	ఢిల్లీ	470
చెన్నై	445	బెంగళూరు	445



బ్రాయిలర్ చికెన్
ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	120	ఢిల్లీ	150
కరీంనగర్	115	ముంబయి	145
వరంగల్	110	చెన్నై	150



సెన్సెక్స్ +181.39
35,695



నిఫ్టీ +55.10
10,727

రూపాయి
₹69.72
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,880.00
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

వెండి పరుగులు

- 40వేల మార్క్ దాటిన కిలో వెండి



ముంబై: వెండి ధర పరుగులు పెడుతోంది. వరుసగా నాలుగో రోజు ధర పెరగడంతో బులియన్ మార్కెట్లో కేజీ వెండి రూ. 40వేల మార్క్ దాటింది. శుక్రవారం ఒక్కరోజే రూ. 440 పెరిగి కేజీ వెండి ధర రూ. 40,140 పలికింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో ధర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అటు బంగారం ధర మాత్రం కాస్త దిగొచ్చింది. డాలర్‌తో రూపాయి బలపడటంతో పాటు స్థానికంగా కొనుగోళ్లు తగ్గడంతో 10 గ్రాముల పసిడి ధర రూ. 145 తగ్గి రూ. 32,690గా ఉంది. గడిచిన మూడు రోజుల్లో బంగారం ధర రూ. 565 పెరిగింది. కాగా.. అంతర్జాతీయంగా ఈ లోహల ధరలు స్వల్పంగా పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 1293.61 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.75 డాలర్లుగా ఉంది.



రూ.2వేల ముద్రణ విషయంపై

ఇంకా నిర్ణయం తీసుకోలేదు

- అవసరమైన దానికంటే 2.వేల నోట్లు చెలామణిలో ఎక్కువే ఉన్నాయి: కేంద్ర ఆర్థిక శాఖ

ఢిల్లీ: ప్రస్తుతం అవసరమైన దాని కంటే ఎక్కువగానే రూ.2వేల నోట్లు చెలామణిలో ఉన్నాయని ఆర్థికశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టం చేశారు. రూ.2వేల నోట్ల ముద్రణ విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన శుక్రవారం వెల్లడించారు. నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తీసుకురానున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పష్టతనిచ్చారు. 'వ్యవస్థలో ప్రస్తుతం అవసరమైన దాని కంటే ఎక్కువ రూ.2వేల నోట్లు ఉన్నాయి. దాదాపు 35శాతం నోట్లు చలామణీలో ఉన్నాయి. రూ.2వేల నోట్ల ముద్రణకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు' అని ఆయన స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి నోట్ల ముద్రణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



రిజర్వు బ్యాంకు రూ. 2000నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తగ్గించిందని ఆర్థికశాఖ ఉన్నతాధికారి గురువారం వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో రూ.2వేల నోటు క్రమేణా కనుమరుగు కానుందని వార్తలు వచ్చాయి. చలామణీలో ఉన్న నగదుపై సమీక్ష జరిపిన కేంద్రం, ఆర్బీఐ ఏ మేరకు కొత్త నోట్లను ముద్రించాలన్న దానిపై తగిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.2వేల నోట్ల ముద్రణను తగ్గించినట్లు తెలిపారు. నవంబరు 8, 2016న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కొత్తగా రూ.2వేల నోటును ప్రవేశపెట్టారుప్రవేశపెట్టారు.

విలీనంతో ఉద్యోగాల కోత ఉండదు: అరుణ్ జైట్లీ

ఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం వల్ల ఉద్యోగాల కోత ఉండబోదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంకు, విజయా బ్యాంక్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. దీనిపై జైట్లీ గురువారం లోక్‌సభలో మాట్లాడారు. బ్యాంకుల విలీనంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి అతిపెద్ద సంస్థ ఏర్పడుతుందని, అంతేగాక.. రుణ వ్యయం కూడా తగ్గుతుందని జైట్లీ అన్నారు. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ.. బ్యాంకు నిరర్థక ఆస్తులు తగ్గుతున్నాయని, రూ. 3లక్షల కోట్లను తిరిగి వ్యవస్థలోకి తెచ్చేందుకు దివాల చట్టం సాయపడిందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల రీకాపిటలైజేషన్ కింద డిసెంబరు 31 నాటికి రూ. 51,533కోట్లను బ్యాంకులకు ఇచ్చినట్లు తెలిపారు.



'2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ. 65వేల కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకుల రికాపిటలైజేషన్ కోసం కేటాయించాం. ఇందులో డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్లను బ్యాంకులకు ఇచ్చాం. నిరర్థక ఆస్తులతో ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాలను చవిచూస్తున్నాయి' అని జైట్లీ తెలిపారు. మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 11 బ్యాంకులను తక్షణ దిద్దుబాటు చర్యల నియమావళి కిందకు తీసుకొచ్చినట్లు తెలిపారు.

స్వల్ప లాభాలతో స్టాక్ మార్కెట్



ముంబయి: దలాల్ స్ట్రీట్ స్వల్ప లాభాలతో ముగిసింది. సూచీలు శుక్రవారం ఉదయం లాభ నష్టాలతో ఒడిదొడుకులకు గురైనప్పటికీ తర్వాత కోలుకున్నాయి. చివరి రెండు గంటల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో మార్కెట్లు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. ఆరంభంలో సెన్సెక్స్ 70 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 10,700 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 181.39 పాయింట్లు లాభపడి 35695.10 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 55.1పాయింట్ల లాభంతో 10727.35 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.69.87వద్ద ట్రేడవుతోంది. ఎన్ఎస్ఈలో భారతి ఇన్ఫ్రాటెల్, వేదాంత, యస్ బ్యాంకు, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి.

27 మంది దేశం విడిచి పరారు: శివప్రతాప్ శుక్లా



ఢిల్లీ: గత ఐదేళ్లలో దాదాపు 27 మంది ఎగవేతదారులు, ఆర్థిక నేరగాళ్లు భారత్ విడిచి పారిపోయారని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా లోక్‌సభలో తెలియజేశారు. 27 మందిలో 20 మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినట్లు ఆయన వెల్లడించారు. భారత్ అధికారుల అభ్యర్థన మేరకు దేశం విడిచి పారిపోయిన ఎనిమిది మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు లోక్‌సభకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఆరు కేసుల్లోని నిందితులను భారత్ తిరిగి పంపించాల్సిందిగా కోరుతూ అభ్యర్థనలు పెట్టినట్లు తెలిపారు. బ్యాంకులకు రూ.9వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను భారత్‌కు తిరిగి పంపించేందుకు బ్రిటన్‌కు చెందిన వెస్ట్‌మినిస్టర్ కోర్టు అంగీకరించినట్లు ఆయన ఈ సందర్భంగా లోక్‌సభకు తెలియజేశారు. కంపెనీలకు రూ.50కోట్ల పైన రుణాలు ఇచ్చే సమయంలో బ్యాంకు అధికారులు ప్రమోటర్లు/ డైరెక్టర్ల పాస్‌పోర్ట్ కాపీలను తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం బ్యాంకులకు సూచించినట్లు పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.13వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితులుగా ఉన్న నీరవ్ మోదీ, మోహుల్ ఛోక్సీలను భారత్ రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.



స్పోర్ట్స

జడేజా ఉండటం వల్లే శతకం సాధించగలిగా: రిషబ్ పంత్



సిడ్నీ: తాను సెంచరీతో చెలరేగడానికి కారణం అవతలి ఎండ్‌లో జడేజా ఉండటమే అని టీం ఇండియా కీపర్ రిషబ్ పంత్ అన్నారు. " నా ఆటలో ఎలాంటి మార్పు లేదు. ఈ సారి అవతలి ఎండ్‌లో మంచి బ్యాట్స్‌మెన్ ఉన్నాడు. చాలాసార్లు నేను క్రీజులోకి వచ్చినప్పుడు టెయిలెండర్లు ఉంటారు. అలాంటి సమయంలో ఆలోచన వేరేలా ఉంటుంది. బ్యాట్స్‌మెన్స్‌తో కలిసి ఆడుతున్నప్పుడు ఆలోచనా విధానం మరోలా ఉంటుంది. స్వేచ్ఛగా ఆడేందుకు జట్టు యాజమాన్యం నాకు అవకాశమిచ్చింది. బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారీ ఆటను ఆస్వాదిస్తా. గతంలో వెస్టిండీస్‌పై రెండుసార్లు 92 వద్ద ఔటయ్యాను. ఇప్పుడది నన్ను కంగారు పెట్టింది. కానీ ఆ దశను త్వరగా దాటేశా. అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించే ప్రతి శతకం ప్రత్యేకం. ఇప్పుడే నా కెరీర్ మొదలైంది. శతకాల గురించి నేను ఆలోచించను. జట్టు అవసరమేంటో ఆలోచిస్తా. క్రికెట్లో నిరంతరం నేర్చుకోవాలి. అప్పుడే గడ్డు దశలను సులభంగా దాటేస్తాం' అని పంత్ అన్నాడు. అయితే పంత్ ఖాతాలో మరో రికార్డు చేరింది. ఉప ఖండం ఆవల అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. తొలిసారిగా ఈ ఘనత పాకిస్థాన్ వికెట్ కీపర్ మొయిన్ ఖాన్‌కు దక్కింది. 2003లో హామిల్టన్‌లో జరిగిన టెస్టులో అతను అత్యధికంగా 137 పరుగులు చేశాడు. ఆ తర్వాత శ్రీలంక క్రికెటర్ దినేశ్ చండిమాల్ 2016లో చెస్టర్లీ స్ట్రీట్‌లో జరిగిన టెస్టులో 126 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ ముష్ఫికర్ రహీమ్ 2017లో 159 పరుగులు చేసి తొలి స్థానంలో నిలిచాడు. ఇప్పుడు సిడ్నీ వేదికగా జరిగిన టెస్టులో పంత్ సైతం 159 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడంతో ఈ రికార్డు పంత్ సొంతమైంది.

అతిథులను అవమానించడం సరికాదు

- కోహ్లీని గేలిచేసిన అభిమానులపై క్రికెట్ ఆస్ట్రేలియా ఆగ్రహం

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండుసార్లు అవమానానికి గురయ్యాడు. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా ఆసీస్ ప్రేక్షకులు కోహ్లీని వెకిలి చేష్టలతో అవమానించారు. తాజాగా సిడ్నీ టెస్టులోనూ కోహ్లీకి అటువంటి అనుభవమే ఎదురైంది. కోహ్లీ బ్యాటింగ్‌కు దిగుతున్నప్పుడు ఆసీస్ అభిమానులు అతడిని వెక్కిరిస్తూ విపరీత వ్యాఖ్యలు చేశారు. అనుచితంగా ప్రవర్తించారు. కోహ్లీకి రెండుసార్లు ఇదే అనుభవం ఎదురుకావడంపై క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో కెవిన్ రాబర్ట్స్ తీవ్రంగా స్పందించాడు. అభిమానులు ఇటువంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నాడు. దేశానికి వచ్చిన అతిథులను ఇలా అవమానించడం సరికాదంటూ ప్రేక్షకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతిథులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికాడు. "మనందరికంటే ఆట గొప్పది. అతిథులను మనం గౌరవించాలి. మన దేశానికి వచ్చినప్పుడు వారికి అందమైన అనుభవం ఇవ్వాలి. అయితే, మైదానంలో మాత్రం కలబడాలి" అని పేర్కొన్నాడు.

కోహ్లీసేన 622/7 డిక్లేర్డ్

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు
- తృటిలో డబుల్ సెంచరీ మిస్ చేసుకున్న పుజారా(193)
- 159 పరుగులతో అజేయంగా నిలిచిన రిషబ్ పంత్
- అర్ధ శతకం చేసిన జడేజా
- నాలుగు వికెట్లు పడగొట్టిన నాథన్‌లైయన్
- ఆసీస్ 24/0



పుజారా(193)

సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరుగుతన్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్స్ అదరగొట్టారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌ను కోహ్లీసేన 622/7 వద్ద డిక్లేర్ చేసింది. 168వ ఓవర్లలో జడేజా(81) పెవిలియన్ చేరిన అనంతరం టీమిండియా సారథి విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించాడు. చివరి టెస్టు రెండో రోజు ఆటలో భాగంగా 303/4 ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కోహ్లీ సేన మరో 319 పరుగులు జోడించింది. పుజారా(193), రిషబ్ పంత్(159; నాటౌట్) రాణించడంతో ఆసీస్ ముందు టీమిండియా భారీ స్కోరును నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో నాథన్ నాలుగు వికెట్లు తీయగా.. హేజిల్‌వుడ్‌కు రెండు, మిచెల్ స్టార్క్ ఒక వికెట్ పడగొట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత్ చేసిన రెండో భారీ స్కోరు ఇది. 2004లో సిడ్నీ స్టేడియంలోనే భారత్ 7 వికెట్ల నష్టానికి 705 పరుగులు చేసింది.

రెండో రోజు ప్రారంభంలోనే..

తొలుత 303/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ మొదలుపెట్టిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి పది ఓవర్లలోనే కోహ్లీసేన ఐదో వికెట్ చేజార్చుకుంది. తొలి రోజు నుంచి పుజారాతో కలిసి కీలక ఇన్నింగ్స్ నిర్మించిన హనుమ విహారి(42)ని నాథన్ లైయన్ పెవిలియన్ చేర్చాడు. పుజారాతో కలిసి విహారి 101 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించాడు.

స్పెషల్ ఇన్నింగ్స్ పుజారాదే..

టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ చెప్పినట్లు.. కొన్నాళ్ల తర్వాత ఈ సిరీస్‌ను గుర్తు చేసుకుంటే ముందు పుజారా పేరే స్ఫురిస్తుందేమో. నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్ టీమిండియా నయా వాల్‌దే అనడంలో సందేహమే లేదు. తొలి రోజునుంచి ఆసీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన పుజారా తొలి రోజే రికార్డు శతకం నమోదు చేసుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 130 పరుగులు చేసి రెండో రోజూ అదే జోరు కొనసాగించాడు. 193 పరుగులు చేసి ద్విశతకానికి దగ్గరగా వచ్చిన పుజారాను లైయన్ అడ్డుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో నయావాల్ మొత్తంగా 22 బౌండరీలు బాదాడు.130 ఓవర్‌లో లైయన్ వేసిన ఆఖరు బంతిని అంచనా వేయలేకపోయిన పుజారా..అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో ద్విశతకం చేయాలన్న పుజారా కల చెదిరింది. అప్పటికి టీమిండియా 420 పరుగులు చేసింది.

రిషబ్ పంత్ సూపర్‌షో..

తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన పంత్ దుమ్ములేపాడు. ఫైన్ సేన ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ 137 బంతుల్లో టెస్టు కెరీర్‌లో రెండో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ఉన్న జడేజా సైతం పంత్‌కు సహకరిస్తూ టెస్టు కెరీర్‌లో పదో అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తర్వాత దూకుడు పెంచిన పంత్ జడేజా జోడీ స్కోరు బోర్డును 600 దాటించింది. దీంతో పాటు 204 కీలక భాగస్వామ్య పరుగులను అందించింది. ఒకానొక దశలో పంత్ ద్విశతకం, జడేజా శతకం చేసేలా కనిపించారు. బౌండరీలు బాదుతూ స్టేడియాన్ని కాసేపు హోరెత్తించారు. దూసుకుపోతున్న ఈ జంటను నాథన్ లైయన్ విడదీశాడు. 168వఓవర్లో నాథన్ వేసిన బంతికి జడేజా 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద బౌల్డ్ అయ్యాడు. అప్పటికే జట్టు స్కోరు 600 దాటింది. దీంతో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 622/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు కోల్పోకుండా 24 పరుగులు చేసింది.



జడేజా(81)



నాథన్‌లైయన్ (4/178)



రిషబ్ పంత్(159) నాటౌట్

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.